www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 54 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ ఆశ్వీయుజ బహుళ విదియ

30 అక్టోబర్ - 05 నవంబర్ 2023

వెల : ₹20/-

## అస్తమిస్తున్న ద్రవిడ సూర్యుడు ?





## ఎన్నికలలో ఉచితాలు
## ప్రజల కోసమా! పార్టీల కోసమా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

చంద్రయాన్, సూర్యయాన్, మంగళయాన్... ఒకటేమిటి? అంతరిక్ష రంగంలో భారత్ దూసుకు పోతున్నది. నిన్నటివరకూ మానవ రహిత వాహనాలను విజయవంతంగా చంద్రుడిపైకి, సూర్యుడు, మంగళగ్రహాలపైకి పంపిన అంతరిక్ష సంస్థ ఇప్పుడు మానవ సహిత రాకెట్ ప్రయోగాలకు సిద్ధమవుతున్నది. ఎంతో తక్కువ ఖర్చుతో అఖండమైన జ్ఞానాన్ని సంపాదించుకురావడం అన్నది కేవలం భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తలు, సంస్థల సొత్తుమాత్రమే.




# లేటైనా... లేటెస్ట్ విజయం.. టివి–డి1

మానవులను అంతరిక్షంలోకి పంపేందుకు భారత్ గగన్‌యాన్ పేరుతో వాహనాన్ని సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా, తొలి టెస్ట్ వెహికిల్ డెవలప్‌మెంట్ ఫ్లైట్ (టివి–డి1)ను శనివారం ఉదయం భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించింది. కాగా, వాతావరణ పరిస్థితులు, సాంకేతిక సమస్యల కారణంగా ఈ ప్రయోగం అనుకున్న సమయానికి చేయలేదు.

ఈ క్రమంలోనే రెండుసార్లు వాయిదా వేసిన ప్రయోగాన్ని అక్టోబర్ 21 ఉదయం విజయవంతంగా చేసింది. తొలుత ఉదయం 8 గంటలకు ఈ ప్రయోగాన్ని జరుపవలసి ఉండగా, సాంకేతికంగా ఏర్పడిన సమస్య కారణంగా దానిని వాయిదా వేసి, అప్పటికప్పుడు సరి చేశారు. మొత్తం మీద ఏమైతేనేం భారతదేశపు తొలి మానవ సహిత తొలి అంతరిక్ష నౌక గగన్‌యాన్ కోసం టివి–డి1ను ప్రయోగించారు. క్లుప్తంగా జరిపిన ఈ ప్రయోగంలో క్రూ ఎస్కేప్ సిస్టం (సిఇఎస్– చోదకసిబ్బంది తప్పించుకునే వ్యవస్థ)ను, క్రూ మాడ్యూల్‌ను 17 కిమీల ఎత్తులో ప్రారంభమై, శ్రీహరికోటకు 10కిమీ సమీపంలో బంగాళాఖాతంలో సురక్షితంగా టచ్‌డౌన్ కావడం ఒక గొప్ప విజయం.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో, మిషన్ గగన్‌యాన్ టివి–డి1 టెస్ట్ ఫ్లైట్‌ను సాధించామని, క్రూ ఎస్కేప్ సిస్టం తాము కోరుకున్నట్టుగానే పని చేసిందని, మిషన్ గగన్‌యాన్ విజయవంతంగా ప్రారంభమైందని ఇస్రో పేర్కొంది.

ఉదయం 8 గంటలకు పంపాలనుకున్న సమయానికి పంపకుండా కొంత సమయం ఆపి, తర్వాత దానిని ప్రయోగించారు. అందులో ఏర్పడిన సాంకేతిక సమస్యను దానిని ప్రయోగించే ముందే పరిష్కరించారు.

వాస్తవానికి 8 గంటలకు అనుకున్న సమయాన్ని 8.30 గంటలకు, తర్వాత 8.45 గంటలకు వాయిదా వేశారు. దీనికి కారణం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం. మొత్తం మీద వ్యవస్థలను కూడా సరిచేసి, ప్రయోగాన్ని 10 గంటలకు చేపట్టాలని నిర్ణయించారు.

విజయవంతమైన టెస్ట్ వెహికిల్ ప్రయోగా నంతరం గగన్‌యాన్ టివి–డివి1కు చెందిన మూడు ప్రధాన పారాచూట్లను నియోగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టివి–డి1 మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఇస్రో అధిపతి ఎస్ సోమనాథ్ హర్షాన్ని వ్యక్తం చేశారు. గగన్‌యాన్ కార్యక్రమానికి క్రూ ఎస్కేప్ వ్యవస్థను ప్రదర్శించడమే దీని లక్ష్యం అని ఆయన అన్నారు. ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ కార్యక్రమం కోసం భారతీయ వైమానికాదళం, భారతీయ నావికాదళం ఇస్రోతో కలిసి పని చేస్తున్నాయి. గగన్‌యాన్ మిషన్ కోసం వైమానిక దళం నిరీక్షిస్తోందని, తమ సిబ్బంది సురక్షితమైన చేతుల్లో ఉందని తమకు తెలుసని భారతీయ వైమానికా దళం ప్రయోగానంతరం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా గగన్‌యాన్ టివి–డి1 టెస్ట్ ఫ్లైట్‌ను విజయవంతంగా ప్రయో గించడాన్ని కొనియాడుతూ, అంతరిక్ష ప్రయాణంలో భారత్ మరొక మైలురాయిని సాధించిందని అన్నారు.

'తొలి పరీక్షా వాహనం టివి–డి1ను విజయవంతంగా ప్రయోగించినందుకు కుడోస్ ఇస్రో!' మానవ సహిత అంతరిక్ష నౌక మిషన్ గగన్‌యాన్ ప్రయాణపు చివరి అంకంలో తొలి అడుగు. ప్రధాని శ్రీ నరేంద్రమోదీ, అందించిన ప్రోత్సాహంతో విజాయాల మీద విజయాలు సాధిస్తున్న ఇస్రోకు గగన్‌యాన్ తదుపరి కీలక విజయమంటూ, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇస్రో సిబ్బందిని అభినందించారు. ★

# ఒత్తిడి కాదు, ప్రేమే ఆర్‌ఎస్‌ఎస్ శైలి




దేశ వైభవాన్ని చట్టం, పాలన లేక నాయకుడి ద్వారా మాత్రమే సాధించలేమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పరమపూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కొళిక్కోడ్‌లో ఆరవ అమృతశతం సిరీస్ ఉపన్యాసాన్ని ఇస్తూ, ఒక దేశం తన వైభవాన్ని ఎలా సాధించవచ్చో వివరించారు.

వ్యక్తిత్వ, శీలనిర్మాణం అన్నవి ఇందుకు అత్యవసరమని ఆయన చెప్పారు. ఒత్తిడి, బలవంతంగా ఇతరులపై విషయాలను రుద్దడం కాక ప్రేమతో పని చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ పద్ధతి అని తెలిపారు. ఈ పనినే ఆర్‌ఎస్‌ఎస్ ఎంతోకాలం  చేస్తూ వస్తోందని పేర్కొన్నారు. విజ్ఞానానికి కళ అవసరమని, కళకు విజ్ఞానం అవసరమని, అవి అందరికీ లాభాన్ని కలిగించాలని, అప్పుడే సత్యం, శివం, సుందరం అన్నవి సాకారమవుతాయని డాక్టర్ మోహన్ భగవత్ చెప్పారు.

ధర్మ, అర్థ, కామ, మోక్షాలనేవి అంతః అనుసంధానాన్ని కలిగి ఉన్నవని ప్రపంచంలోని ఇతర దేశాలకు తెలియదని, అయితే 4,000 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగినదని రుజువైన భారతీయ సంస్కృతి, నాగరికతలు ఈ భావనను ముందుకు తీసుకువెడుతున్నాయని ఆయన వివరించారు. నేడు ప్రపంచానికి కావలసింది ఇదేనని అన్నారు. భిన్న వైరుధ్యాలను కలిగి ఉన్నప్పటికీ, భారత్ ప్రాచీన సంస్కృతిని కలిగి ఉందని, ఇదే హిందుత్వమని సర్‌సంఘచాలక్ వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ హిందువులందరినీ కలుపుకు పోతుందని, తమ సంస్కృతి  ఆధారంగా భారతీయులంతా హిందువులేనని ఆయన చెప్పారు.




Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**92001006140532 5, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**
✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్ **9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

**మూ**ర్ఖుల మనసు రంజింపచేయడం ఎంత కష్టమో ఏనాడో తేల్చాడు శతకకారుడు. అందునా అహంకారం తలకెక్కిన రాజకీయరంగ మూర్ఖుల మనసు మార్చడం బ్రహ్మాదులకు కూడా సాధ్యం కాదు. నిజం చెప్పాలంటే వాళ్ల మనసులు మారతాయని కాని, అహంకారం వదులుతుందని గాని, మూర్ఖత్వం కరుగుతుందని కాని ఆశపడడం దురాశ మాత్రమే. 'ఇండియా' పేరుతో ఆర్భాటంగా ఆరంభమైన సరికొత్త పాత కూటమి ప్రముఖులు వ్యవహరిస్తున్న తీరు చూశాక శతకకారుడి అంచనా అద్భుతమనిపిస్తుంది. అదేం వింతో మరి! ఎన్నికలు ప్రకటించినప్పుడల్లా విచ్ఛిన్నమైపోవడానికి విపక్ష 'ఇండియా' సమాయత్తమవుతూ ఉంటుంది. త్వరలో జరగబోయే అసెంబ్లీల ఎన్నికలలోను ఇది పునరావృతం కాబోతున్నది.

'ఇండియా' భాగస్థుల మధ్య తాజా మంటకు కారణం మధ్యప్రదేశ్‌లో పొత్తులు, సీట్ల పంపకాలూను. అంతేకాదు, కులగణన నినాదం మీద హక్కు కూడా అందులో కాస్త ఆజ్యం పోసింది. మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ మధ్య వచ్చిన సీట్ల పంపకం విభేదాలు బాగా ముదిరేటట్టే కనిపిస్తున్నాయి. సీట్ల పంపకం గురించి అడిగినప్పుడు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ 'అఖిలేశ్, వకిలేశ్ ఇవన్నీ వద్దు సోదరా!' అంటూ సదరు విలేకరికి కాస్త వెగటుగానే సమాధానం ఇచ్చారు. మధ్యప్రదేశ్ ఎన్నికల బరినుంచి సమాజ్‌వాదీ తప్పుకుంటే భేషుగ్గా ఉంటుందంటూ ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ చేసిన సూచనతో అఖిలేశ్ గుర్రుగా ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో సీట్ల పంపకం గురించి పెద్ద నాయకులు ఆ విధంగా స్పందిస్తే తాను సైతం ప్రతిస్పందించకుండా ఉండడం కూడా సాధ్యం కాదంటూ అఖిలేశ్ 'ఇండియా' కూటమి మిథ్య అన్నంత వరకు వెళ్లారు. కులగణన ఘనత తమకే దక్కాలని, ఇందులో కాంగ్రెస్‌కు కాస్త కూడా వాటా లేదని సమాజ్‌వాదీ వంటి పార్టీలు అభిప్రాయపడున్నాయి మరి!

కాంగ్రెస్ పార్టీకి పొత్తు సమ్మతం కాకపోతే ఆ విషయం చెప్పాలి. అంతేగాని మాకు వ్యతిరేకంగా కుట్రలు చేయకూడదు. మమ్మల్ని మోసం

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ ఆశ్వీయుజ బహుళ విదియ**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**ఎన్నికలలో ఉచితాలు**
**ప్రజల కోసమా! పార్టీల కోసమా?** 6లో

జాతీయం
**స్వలింగ వివాహాలపై సుప్రీం సముచిత తీర్పు** 12లో






ధారావాహిక నవల
**మహా సంకల్పం**
– పి. చంద్రశేఖర ఆజాద్ 20లో

# జాగృతి

## సంపాదకీయం

చేయాలని చూడ కూడదు అని పెద్ద మాటలే అఖిలేశ్ సంధించారు. తాము అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాలలోను కులగణన చేపడతామని కాంగ్రెస్ చెప్పడం అఖిలేశ్‌కు నచ్చడంలేదు. అసలు ఈ నినాదంతో ఎన్నికల బరిలో దిగడానికి ఆ పార్టీకి హక్కే లేదన్నది అఖిలేశ్ వాదన. ఇప్పుడు తాము అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాలలోను కులగుణన చేపడతామని చెబుతున్న ఈ కాంగ్రెస్ గతంలో తాము చేసిన కులగణన వివరాలు మాత్రం బయటపెట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. అసలు శతాధిక సంవత్సరాల పార్టీలో ఇంత గందరగోళం ఏమిటి అంటూ కూడా ఆయన నిలదీశారు. ఈ క్రమంలోనే తెలిసో తెలియకో కొన్ని

## వీళ్లు మారరు!

దేవ రహస్యాలు కూడా చెప్పేశారు. ఇక్కడ ప్రశ్న ఏమిటీ అంటే విశ్వసనీయత. కాంగ్రెస్ వ్యవహార సరళి ఇలాగే ఉంటే ఆ పార్టీ వెనకాల ఎవరు ఉంటారు? అని అన్నారాయన. బీజేపీ అనేది చాలా వ్యవస్థీకృతమైన పార్టీ అని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి, ఈ మాత్రం ఎందుకు తెలియకుండా ఈ గందరగోళంతో అలాంటి పార్టీతో పోరాడదామనుకుంటే సాధ్యం కాదని తెలుసుకోండని కూడా అఖిలేశ్ హితవు పలికారు. కూటమి, పొత్తు ధర్మాల ఆధారంగా మాకు స్థానాలు కేటాయించే ఉద్దేశమే లేకపోతే చర్చలు కూడా దండగేనని కూడా ఎస్పీ నాయకుడు తలంటారు. ఇండియా కూటమి పొత్తులనేవి జాతీయ ఎన్నికల వరకేనని మధ్యప్రదేశ్ పరిణామాల బట్టి అర్థమవుతుందని కూడా తేల్చారు ఎస్పీ నేత. కమల్‌నాథ్ మాటలు అఖిలేశ్‌ను బాగానే రెచ్చగొట్టాయి. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లో ఈ రకంగా మాట్లాడినవారికి రేపు ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలో మాతో చర్చించడానికి వచ్చినప్పుడు సమాధానం చెప్పగలం అని కూడా హెచ్చరించారు. సరిగ్గా ఇదే మర్యాద చేస్తామని కూడా చెప్పేశారు. మధ్యప్రదేశ్ ఎన్నికల బరి నుంచి సమాజ్‌వాదీ వైదొలగకపోతే అంతిమంగా బీజేపీకే లబ్ధి చేకూరు తుందని రాయ్ చేసిన విశ్లేషణను అఖిలేశ్ కొట్టిపారేశారు. ఘోసి (యూపీ) అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తప్పుకున్న విధంగానే ఎంపీలో సమాజ్‌వాదీ తప్పుకోవాలని రాయ్ మెలిక పెట్టారు. ఇది కూడా అఖిలేశ్‌కి నచ్చలేదు. రాయ్ ఓ శుంఠ, ఆయన అలాగే చెబుతాడు అని కూడా అనేశారు. ఘోసీ ఎన్నికకు ఒక ప్రత్యేకత ఉంది. ఇండియా కూటమి ఏర్పడిన తరువాత జరిగిన తొలి ఎన్నిక ఇదే. ఇక్కడ ఎస్పీ అభ్యర్థి బీజేపీ అభ్యర్థిపై 42వేల భారీ మెజారిటీతో గెలిచారు. ఆ సమయంలో ఆర్ఎల్‌డీ, కాంగ్రెస్ పార్టీ ఎస్పీకి మద్దతు ఇచ్చాయి. ఇది గుర్తు పెట్టుకునయినా సమాజ్‌వాదీ మధ్యప్రదేశ్‌లో పోటీ చేయరాదని కాంగ్రెస్ ఆశ. అసోం పీసీసీ నేత భూపేన్ బోరా ప్రకటన కూడా ఈ నేపథ్యంలోనే వెలువడింది. రాష్ట్రంలోని 14 స్థానాలకు తాము పోటీ చేస్తామని ఆయన అన్నారు. ఇక్కడ తాము అంటే కాంగ్రెస్‌తో కలసి వచ్చే పార్టీలని కూడా ఆయన భాష్యం చెప్పారు. మూడు ప్రాంతీయ పార్టీలు కలసి రావడం లేదని కూడా చెప్పేశారు. అందులో ఒకటి ఎస్పీ అన్నదే ఆయన ఉద్దేశం. మరొక ప్రాంతీయ పార్టీ ఆప్ కూడా ఇండియాలో ఉంటూనే మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో అభ్యర్థుల జాబితాలు ప్రకటించేసింది.


ఇదంతా చూస్తుంటే ప్రధాని నరేంద్ర మోదీ ఇండియా కూటమిని ఘమండియా అని వ్యాఖ్యానించడం (అహంకారుల కూటమి) సరైనదేనని తేలిందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. వీళ్లంతా అట్టహాసంగా ఇండియా అన్న పేరు పెట్టుకున్నందుకైనా సమైక్యంగా ఉంటే బాగుంటుంది. ఎందుకంటే, ఇండియా అని పేరు పెట్టి, ఎన్నికల నగారా మోగగానే చీలికలు పేలికలుగా చెదిరిపోవడమే బాధాకరంగా ఉంటుంది. ముందు ముందు ఎన్ని కలహాలు వస్తాయో! భాగస్వాములు ఎన్ని తిట్టు కుంటారో! ఎన్ని ముక్కలు చేస్తారో! అన్నిసార్లు 'ఇండియా'ని చీల్చాలా? ★

30 అక్టోబర్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్

**పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు విన్నపం**

జాగృతి దీపావళి ప్రత్యేక సంచిక –2023, నవంబర్ 13–19న వెలువడు తుంది. కాబట్టి 06–13 నవంబర్ సంచిక వెలువడదు. పునర్దర్శనం దీపావళి సంచికతోనే..

– అసోసియేట్ ఎడిటర్





| | | |
|---|---|---|
| ఈ ఎన్నికలు మహా 'ప్రియం' గురూ! (తెలంగాణ) | – | 14 |
| విశాఖ నుంచి పాలన.. స్వపక్షంలోనే విముఖత (వేదిక) | – | 16 |
| ఇజ్రాయెల్– హమాస్ యుద్ధం (అంతర్జాతీయం) | – | 23 |
| 'పసిడి' మనస్వినికి ప్రణతులు (ప్రత్యేక వ్యాసం) | – | 26 |
| ఏకకాలంలో 11 రాష్ట్రాలకు 'వందే భారత్'.. (ప్రగతి) | – | 34 |
| సమరసేవలో పద్మ'స్త్రీ' (మహిళ) | – | 44 |
| భళా! భారత హాకీ! (క్రీడ) | – | 43 |
| బాలకృష్ణకు హ్యాట్రిక్ అందించిన 'భగవంత్ కేసరి' (సినిమా) | – | 50 |




ఉచిత బహుమతులకు తేలిగ్గా ఆకర్షితులు కావడం మానవుల బలహీనత. వ్యాపారాభివృద్ధి కోసం వివిధ వాణిజ్య సంస్థలు ‘ఆఫర్’ల పేరుతో బహుమతులు, రాయితీలు ఇస్తూ వినియోగదారులను ఆకర్షించడానికి యత్నిస్తుంటాయి. ఇది చట్టవిరుద్ధం కానందువల్ల పట్టించుకోవాల్సిన అవసరం లేదనిపించవచ్చు. కానీ రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఓటర్లను తమవైపు ఆకర్షించేందుకు ఈ ‘ఉచితాల’ హామీలు పరిమితి, విపరీత దశలను దాటి అడ్డగోలు స్థాయికి చేరుకోవడం తాజా పరిణామం. ‘వైబ్రెంట్ డెమాక్రసీ’ (స్పందనాత్మక ప్రజాస్వామ్యం) కలిగిన భారత్‌లో ఈ ‘ఉచితాల’ వల్ల కలిగే విపరిణామాలను ఏ రాజకీయ పార్టీ

# ఎన్నికలలో ఉచితాలు ప్రజల కోసమా! పార్టీల కోసమా?

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తాను ఎన్నికల్లో వాగ్దానం చేసిన ప్రధానమైన ఐదు ఉచితాల అమలు కోసం 2023-24 బడ్జెట్ లోటు ఏకంగా రూ.39,565కు చేరుకుంది. అదే గతంలో బొమ్మై ప్రభుత్వం రూ. 402 కోట్ల మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఉచితాలు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఎంతటి నష్టం కలిగిస్తాయో చెప్పడానికి ఇంతకు మించిన ఉదాహరణ అవసరం లేదు. వ్యవసాయం, ఆరోగ్యం, పండ్లతోటలు, నీటి వనరులు, గ్రామీణాభివృద్ధి, సహకార రంగాల్లో గతంతో పోలిస్తే కేటాయింపులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకానికి కేటాయింపుల్లో 40%, నీటి వనరులకు 17%, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థలకు 13%, సహకార రంగానికి 38%, మూలధన వ్యయంలో ఏకంగా 13% కోత విధించాల్సి వచ్చింది. ప్రభుత్వ రుణం గతంతో పోలిస్తే 10.38% పెరిగింది. మొత్తం మీద చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఉచితాల వల్ల రూ.40 వేల కోట్లు భారం పడుతోంది.

ఈ ఉచితాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వీటివల్ల రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడితీరుతుంది. ఒకప్పుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన రాష్ట్రంగా పేరుపొందిన కర్ణాటక ఇప్పుడు ఉచితాల పుణ్యమాని ఆర్థిక క్రమశిక్షణా రాహిత్య రాష్ట్రంగా పేరును మూట గట్టుకోబోతున్నది.

**విస్తరిస్తున్న ఉచితాలు**

ఎన్నికల సమయాల్లో రాజకీయ పార్టీలు ఉచితాలతో పాటు ఓటర్లను నగదుతో ప్రలోభ పెట్టడం వంటివి సర్వసాధారణమైపోయాయి. చివరకు విద్యుత్, తాగునీటి సదుపాయం, ఇంటర్నెట్, రవాణా, భోజన సదుపాయం వంటి అంశాలకు ఈ ‘ఉచితాలు’ విస్తరించాయి. నిజం చెప్పాలంటే రాజకీయ పార్టీలు ప్రతి ఎన్నికల సమయానికి తమ సృజనాత్మకతకు పదునుపెట్టి మరీ ‘ఉచితాల’ హామీల్లో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అధికారంలోకి రావడమే పరమావధిగా ఈ ‘ఉచిత’ హామీలు ఉంటున్నాయి తప్ప, నిజమైన ప్రజా సంక్షేమం, రాష్ట్రాలు, దేశాభివృద్ధిపై ఎంతమాత్రం పట్టించుకునే స్థితిలో ఏ రాజకీయ పార్టీ లేదన్నది మాత్రం నిష్ఠుర సత్యం. రాజకీయ పార్టీలు ఇట్లాగే ఉచితాలను ప్రకటిస్తూ వెళితే ఒకానొక దశలో అంతరిక్ష అంచులను దాటిపోవడం తథ్యం! ఈ ఉచితాలను నియంత్రించకపోతే, మన ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ప్రమాదం. ఇందుకోసం కేంద్రం తక్షణం కొన్ని నిబంధనలను రూపొందించాలి. ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు ‘ఉచిత’ హామీలు మాత్రమే తమను ఎన్నికల వైతరణి నుంచి కాపాడే సోపానాలుగా పరిగణించే దుస్థితి రావడం ఎంతవరకు శ్రేయస్కరమన్నది ఆలోచించాలి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన సుప్రీంకోర్టు, ఉచితాల విషయంలో కొన్ని పరిమితులు విధించేందుకు రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. రాజకీయ పార్టీలు ఇందుకు స్పందించకపోవడంతో ఈ ప్రయత్నం ఆశించిన ఫలితం ఇవ్వలేదు. ఉచితాలు ‘ఆర్థిక విధ్వంసానికి’ దారి తీస్తాయని కేంద్రం స్పష్టం చేస్తున్నప్పటికీ, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు దీన్ని పట్టించుకోవడంలేదు. ‘వివిధ పార్టీలు ప్రకటిస్తున్న అనుచిత ఉచితాలపై పార్లమెంట్‌లో చర్చించబోరనేది వాస్తవం’. ఎందుకంటే రాజకీయ పార్టీలు తాము ప్రకటించే ఉచితాల నుంచి వెనక్కి మళ్లడానికి ఎంతమాత్రం అంగీకరించవు’ అని 2022 ఆగస్టులో సుప్రీంకోర్టు పేర్కొనడం వర్తమాన పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఉచితాల ‘సమస్య’ను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించి, చివరకు ఈ సమస్యను పరిశీలించేందుకు ముగ్గురు న్యాయ మూర్తులతో కూడిన బెంచ్‌కు అప్పగించింది.


**తమిళనాడులో ప్రారంభం**

చారిత్రకంగా పరిశీలిస్తే ఈ ఉచితాల సంస్కృతికి ఆద్యులుగా తమిళనాడు రాష్ట్రాన్ని చెప్పవచ్చు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే రూపాయికి కిలో బియ్యం పథకాన్ని తన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఈ విధంగా దేశంలో సబ్సిడీ బియ్యం పథకాన్ని ప్రకటించిన తొలి పార్టీగా డీఎంకే నిలిచింది. ఈ పేరుతో డీఎంకే సంధించిన ‘ఉచితాస్త్రం’ ఆ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదం చేసింది. తర్వాత

పట్టించుకోకపోవడం వర్తమాన విషాదం. తీరా అధికారంలోకి వచ్చాక తమ 'ఉచిత' వాగ్దానాలను నెరవేర్చలేకపోవడమో లేక వీటిని బలవంతంగా అమలు చేయడం వల్ల ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిని, అభివృద్ధి కుంటుపడి, నిండా అప్పుల్లో మునిగిపోవడమో జరుగుతోంది. ఇందుకు తాజా ఉదాహరణ కర్ణాటక!




జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

మరింత ముందుకెళ్లి పేదలకు టెలివిజన్ సెట్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. క్రమంగా ఈ ఉచితాలు ఆరోగ్యం, విద్యారంగాలకు విస్తరించాయి. ఈ 'ఉచిత' ఘనత కూడా డీఎంకే పార్టీదే. ఈ 'కిటుకు'ను గుర్తించిన జాతీయ స్థాయి రాజకీయ పార్టీలు ఇదే బాటను ఎంచుకోవడంతో, దేశవ్యాప్తంగా ఇదొక సర్వామోదిత మార్గంగా మారింది. ప్రస్తుతం దాదాపు అన్ని రాష్ట్రాల్లో కూడా ఈ ఉచిత సంస్కృతి వ్యాపించడం విశేషం. గత పదేళ్లకాలంలో ఈ సంస్కృతి బాగా పెరిగిపోయింది.

**ఆత్మవిశ్వాసం లేకపోవడం**

ఎన్నికల ముందే అధికార పార్టీ ఉచితాలను ప్రకటించిందంటే, ఎన్నికల్లో గెలుస్తామన్న నమ్మకం, ఆత్మవిశ్వాసం లేకపోవడమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది పన్ను చెల్లింపుదార్ల ధనాన్ని ఈ ఉచితాల పేరుతో వృథా చేయడం తప్ప మరోటి కాదు. ఇవి స్వేచ్ఛాయుత ఎన్నికలకు పూర్తి విఘాతం కలిగిస్తాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని 123వ సెక్షన్‌లో 'అవినీతి'తో కూడిన మ్యానిఫెస్టోల గురించిన ప్రస్తావన లేదు. రాజ్యాంగంలో సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉండటం రాజకీయ పార్టీలకు కలిసొచ్చిన అంశం. అయితే క్రమంగా అవి రాజ్యాంగంలో పేర్కొన్న సంక్షేమ అంశాలను దాటి మరింత ముందుకు పోవడం ప్రస్తుతం చోటు చేసుకుంటున్న విపరిణామం. ఉదాహరణకు 2015లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) పట్టణ ఓటర్లకు కొంతమేర ఉచిత విద్యుత్, నీటి సదుపాయ కల్పనకు హామీ ఇచ్చింది. అయితే ఈ రెండూ రాజ్యాంగ ప్రతిపాదిత సంక్షేమ కార్యక్రమాలు కాకపోవడం వల్ల కచ్చితంగా ఆ పార్టీ ఓటర్లను మభ్యపెట్టే ప్రతిఫల సిద్ధాంతాన్ని (క్విడ్ ప్రో కొ) అనుసరించిందని చెప్పక తప్పదు. రాజకీయ పార్టీలు ఓటర్లను లోబరచుకునే రీతిలో అవినీతి కార్యకలాపాలకు పాల్పడకూడదని 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం స్పష్టం చేస్తున్నది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎప్పటికప్పుడు తమ ప్రచారసరళి వ్యూహాల్లో సృజనాత్మక రీతిలో మార్పులు తీసుకొస్తున్నాయి. ఉచిత నీటిసదుపాయం, విద్యుత్, రవాణా, టెలివిజన్లు వంటివి ఈ కోవ కిందికే వస్తాయి. రాజకీయ పార్టీలు అధికారమనే 'పరమ లక్ష్యాన్ని' సాధించేందుకు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని కూడా ఉల్లంఘించడానికి వెను కాడటం లేదు. ఇక్కడ ఒక అంశాన్ని గుర్తించాలి. రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించకుండా పూర్తిగా నిరోధించడం సాధ్యంకాదు. రాజ్యాంగంలోని సంక్షేమ సూత్రాలకు అనుగుణంగా ఇచ్చే ఉచిత హామీలను ప్రజాసంక్షేమం దృక్కోణంతో మాత్రమే చూడాల్సి ఉంటుంది. అయితే రాజకీయ పార్టీలు తామిచ్చే 'ఉచిత' హామీలకు నిధులు ఏ విధంగా సమకూర్చుకుంటాయన్న అంశాన్ని ఎన్నికల ప్రచార సమయంలో స్పష్టంగా ప్రజలకు తెలియ జేయాలి. వీటి అమలుకు రాజకీయ పార్టీలు ప్రభుత్వ బొక్కసాన్ని ఉపయోగిస్తే, అవి ఒక ఓటరు జేబులోని డబ్బును మరో ఓటరుకు అందిస్తున్నట్టే లెక్క. అంటే తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఖర్చును విపరీతంగా పెంచేస్తాయని అర్థం.

**ఉచితాలే కీలకం**

భారత రాజకీయాల్లో ఉచితాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. వీటిని సమర్థించేవారు కొందరైతే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ఉచితాలకు వ్యతిరేకంగా బీజేపీ నేత అశ్వనీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ఏకంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు కూడా. తమ మ్యానిఫెస్టోల్లో ఉచితాలకు హామీలిచ్చే పార్టీలను వాటి అమలుకు బాధ్యులను చేయాలని, ఇందుకు సంబంధించిన నియమ నిబంధలను కేంద్రం, ఎన్నికల సంఘం రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తన పిటిషన్‌లో

కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా అశ్వనీ ఉపాధ్యాయను సమర్థించడం గమనార్హం. ఎన్నికల సంఘం కూడా సుప్రీంకోర్టు సలహా మేరకు ఉచితాల నియంత్రణకు ఒక కమిటీ ఏర్పాటుకు అంగీకరించింది. 'రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉచిత విద్యుత్, ఆహారం వంటి వాటికోసం అనవసర ఖర్చులు చేస్తే వాటి ఆర్థిక పరిస్థితి దుర్భరమవుతుంది. ప్రధానంగా ప్రజలకు ఉపయోగకరమైన మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందువల్ల ఉచితాలకు స్వస్తి పలకాలి' అని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు కె.వి.సుబ్రహ్మణ్యం పేర్కొన్న అంశం అక్షరసత్యం.

**విభిన్న వాదనలు**

2022 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నరేంద్రమోదీ, 'రాజకీయ నేతలు ఉచితాల ద్వారా ప్రజలను కొనుగోలు చేయాలని చూస్తుండటం నిజానికి ఇప్పుడు దేశంలో కొనసాగుతున్న ప్రమాదకరమైన ధోరణి' అంటూ దీన్ని 'రేవ్‌డీ కల్చర్'గా అభివర్ణించారు. అయితే ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీయేతర పార్టీలు మాత్రం దీన్ని సామాజిక అసమానతలు తొలగించే ప్రక్రియలో భాగంగా వర్ణిస్తూ, సంక్షేమ పథకాలను చట్టవిరుద్ధ కార్యక్రమాలుగా చూపేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారంటూ విమర్శించాయి. వీటిపై ఎన్ని రకాల వాదనలు వినిపిస్తున్నప్పటికీ 1947 నుంచి 'ఉచితాలు' భారత రాజకీయాల్లో విడదీయలేని భాగంగా కొనసాగుతూ వస్తున్నాయి. నిజం చెప్పాలంటే భారత రాజకీయ సంస్కృతిలో ఉచితాలు నేడొక కొరుకుడు పడని సమస్య. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు రాజకీయ పార్టీలు ఈ ఉచితాలను ప్రకటించే క్రమంలో నైతికత కంటే ఆర్థిక అంశానికే ప్రాధాన్యం ఉండటం గమనార్హం. ఒక ఓటరు తనకు నచ్చిన రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి ఓటు వేయడం అనేది నైతిక కోణం అయితే, ఓటర్లకు ఉచితాలను ప్రకటించి తమవైపు తిప్పుకోవడం 'ప్రలోభపెట్టడం' లేదా 'లంచం'గా పరిగణించాల్సి వస్తుంది. వాస్తవానికి రాజ్యం ఉచితాలను భరిస్తూ రావడం వల్ల ఆర్థిక పరిస్థితి కుప్పకూలిపోవడానికే దారితీస్తుంది. భారత చట్టాల్లో ఈ ఉచితాలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన నిర్వచనమేదీ లేదు. ప్రస్తుతానికైతే కేంద్ర ప్రభుత్వం 'ఉచితం' అనే పదాన్ని కేవలం 'రాజకీయ' పరమైనదిగా పరిగణిస్తూ, కొన్ని రకాల పథకాలకు ఆమోదం తెలపడం లేదు. నిజానికి 'ఉచితాలు' కేవలం తాత్కాలిక ఉపశమనాన్నే కలిగిస్తాయి తప్ప ఆర్థికవ్యవస్థ పురోగతికి దోహదం చేయవు. ప్రస్తుతం దేశంలో 'ఉచితాలు', 'రాయితీ' లకు మధ్య తేడాను నిర్వచించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా డిమాండ్ అధికంగా ఉన్న కొన్ని లక్షిత అంశాలకు ఇచ్చే రాయితీనే సబ్సిడీ అని పేర్కొనవచ్చు. ప్రతి రాష్ట్రానికి రాయితీలను లేదా 'ఉచితాలను' అందించే హక్కు ఉంటుంది. కాకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవి భారం కాని రీతిలో ఉండాలి.



**అన్ని పార్టీలదీ ఒకే బాట**

రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలు సంక్షేమ రాజ్యస్థాపన అనే ప్రాథమిక సూత్రానికి విరుద్ధంగా ఉండటం గమనార్హం. నిజానికి సంక్షేమం అనేది నిరుపేదలకు, కనీసావసరాలు కూడా తీర్చుకోలేని వారికి అవసరం. కానీ వర్తమాన రాజకీయ పార్టీలు ఉచితాల 'పరుగు'లో ఈ ప్రాథమిక సూత్రాన్ని పట్టించుకోకపోవడం విషాదం. ఉదాహరణకు, పంజాబ్‌లో ప్రతి మహిళకు నెలకు రూ.1000, ఢిల్లీలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం వంటివి పరిశీలిస్తే, మహిళలకు వారి ఆర్థిక పరిస్థితితో నిమిత్తం లేకుండా కల్పిస్తున్న సదుపాయాలివి. మరి ఆర్టీసీ బస్సులో కూడా ప్రయాణించడం కష్టంగా ఉన్న నిరుపేద పురుషుల సంగతేంటి? ఇది సమానత్వ సూత్రానికి విరుద్ధం కాదా? నిజం చెప్పాలంటే బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న ఉద్యోగులు ఎప్పటికప్పుడు ప్రభుత్వాలను ఈ ఉచితాలపై హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ అధికారం కోసం అర్రులు చాచే రాజకీయ పార్టీలు వీటిని ఎంతమాత్రం పట్టించుకోకపోవడం విషాదం.

**బీజేపీ:** మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. నిరుపేదలు తమ కాళ్లమీద తాము నిలబడే విధంగా తమ విధానాలను అమలు జరుపుతోందని, అదే విపక్షాలు ప్రకటించే ఉచితాల వల్ల కలిగేది తాత్కాలిక ప్రయోజనమేనని బీజేపీ పేర్కొంటున్నది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రైతులకు ఎకరానికి ఏటా రూ.6000 పెట్టుబడి సహాయంగా అందిస్తోంది. దీన్నే 'కిసాన్ సమ్మాన్ నిధి' అని పేర్కొంటున్నది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి ఈ పథకం ఎంతో ఉపయోగపడింది. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'కన్యాశ్రీ' పథకానికి పోటీగా బీజేపీ.. పాఠశాల విద్యను అభ్యసించే బాలికలకు రూ.22 వేలు నాలుగు విడతలుగా అందిస్తామని వాగ్దానం చేసింది. అదేవిధంగా రైతులకు వార్షికంగా రూ. 10వేలు, మత్స్యకారులకు రూ. 6వేలు ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొంది. 2022 యూపీ ఎన్నికల్లో బీజేపీ.. మహిళలకు ఉచిత సిలిండర్, స్కూటీ అందిస్తామని, రైతులకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తామని, విద్యార్థులకు రెండుకోట్ల ట్యాబ్లెట్లను ఇస్తామని వాగ్దానం చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కూడా రవాణాలో 50శాతం రాయితీని కల్పిస్తామని హామీ ఇచ్చింది.

**కాంగ్రెస్:** హస్తం పార్టీ విషయానికి వస్తే నిరుపేదలకు ఇటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం రాజ్యాంగబద్ధమైన విధి అంటూ వాదిస్తోంది. సమాజంలోని బలహీన వర్గాల ప్రజలను పైకి తీసుకొని రావడం అధికార పార్టీల రాజ్యాంగ బద్ధమైన విధి. అందువల్ల ఈ వర్గాలకు అందించే రాయితీలను 'ఉచితాలు' అని పేర్కొనడానికి వీల్లేదని స్పష్టం చేస్తోంది. 2022లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఉచితాలను ప్రకటించింది. స్కూటర్లు, స్మార్ట్‌ఫోన్లు అందిస్తామని, విద్యుత్ బిల్లుల్లో రాయితీలు, రైతుల రుణాలను రద్దు చేస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హామీ ఇచ్చారు. 2019లో కాంగ్రెస్ చేసిన అతిపెద్ద వాగ్దానం రైతు రుణాల మాఫీ.

**ఆమ్ ఆద్మీ పార్టీ:** 'కోట్లాది రూపాయలు కార్పొరేట్ రంగానికి రాయితీలుగా అందిస్తున్నప్పుడు సామాన్యుడికి ఉచిత విద్యుత్, భోజనం, తాగునీటి సదుపాయం కల్పించడంలో తప్పేముంది?' అనేది ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ వాదన. ఇందుకు అనుగుణంగానే ఆమ్ ఆద్మీ పార్టీ తాను అధికారంలోకి వచ్చిన 2013 తర్వాత నుంచి

50శాతం విద్యుత్ సబ్సిడీని, నెలకు 20 వేల లీటర్ల ఉచిత నీటిని అందిస్తోంది. 2020కి ముందు 200 యూనిట్ల వరకు ఢిల్లీలో ఉచితంగా విద్యుత్ అందిస్తుండగా, పంజాబ్, గోవా, గుజరాత్‌లో అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తెస్తానని వాగ్దానం చేసింది. నిరుద్యోగ మహిళలకు నెలకు రూ.1000, అందరికీ ఉచిత ఆరోగ్యం, విద్యను అందిస్తామని పేర్కొంది. ఢిల్లీలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తోంది.

**భారత రాష్ట్ర సమితి:** నిరుపేదలకు అమలు చేసే సంక్షేమ పథకాలు ‘ఉచితాలు’ కావు. సంస్థలకు ఇచ్చే రాయితీలే అసలైన ‘ఉచితాలు’ అనేది భారత రాష్ట్రసమితి (బీఆర్ఎస్) వాదన. అంతేకాదు నిరుపేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో 250 సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నది కేవలం పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమేనని బీఆర్ఎస్ సమర్థించుకుంటోంది. అందువల్ల తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయాలని కేంద్రం ఒత్తిళ్లు తీసుకొని రావడం ఎంతవరకు సమంజసమన్నది కూడా బీఆర్ఎస్ వాదన. నకిలీ సంస్థలకు కేంద్రం రూ. పది లక్షల కోట్ల మేర రుణాలను ఎత్తేసింది. ఇది ఎంతవరకు సమంజసం? బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇది సామాజిక బాధ్యతలో భాగం. కేంద్రప్రభుత్వ వైఖరిని మేధావులు ఖండించాలంటూ బీఆర్ఎస్ పిలుపునిస్తోంది.

**డీఎంకే, అన్నా డీఎంకే:** పేదలకు అందించే రాయితీలు ‘ఉచితాలు’ కావని డీఎంకే నిశ్చితాభిప్రాయం. రాజ్యాంగంలోని 38వ అధికరణం ప్రకారం సమాజంలో అసమానతలను తొలగించేందుకు ఇవి అవసరం. కనీసావసరాలకు నోచని నిరుపేద వర్గాలకు అటువంటి సదుపాయాలు కల్పించడమే ‘సంక్షేమ’ పథకాల ముఖ్య లక్ష్యం. వీటిని ‘విలాసాలు’గా పరిగణించడం ఎంతమాత్రం సముచితం కాదు అని స్పష్టం చేసింది. ఇదే సమయంలో తమిళనాడులో అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాలను సమర్థించుకుంది. నిజానికి డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు ఉచితాల ప్రకటనల్లో పోటాపోటీగా ముందున్నాయి. అన్నాడీఎంకే చమురు ధరలు తగ్గిస్తామని హామీ ఇస్తే, డీఎంకే పెట్రోల్‌పై లీటరుకు రూ.5, డీజిల్ ధరను లీటరుకు రూ.4 చొప్పున తగ్గిస్తామని వాగ్దానం చేసింది. ఇక ఎఐడీఎంకే అయితే ఏకంగా వాషింగ్ మెషిన్లు, సోలార్ గ్యాస్ స్టౌలు పంపిణీ చేస్తామంటూ ఎన్నికల బరిలోకి దిగింది. కాగా డీఎంకె విద్యార్థులకు ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, ఉచిత ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామని పేర్కొంది.




**శివసేన:** కోట్లాది రూపాయలు ఎగ్గొట్టే బడాబాబుల రుణాలను రద్దు చేయడమే ఆర్థిక వ్యవస్థకు నిజమైన నష్టం కలిగించడం. అంతేకాని నిరుపేద వర్గాలకు అందించే సంక్షేమ ఫలాలు, సమాజానికి ప్రయోజనమే కాని నష్టం కాదన్నది శివసేన అభిప్రాయం.

**టీఎంసీ:** పశ్చిమ బెంగాల్‌లోని అధికార టీఎంసీ సార్వజనిక ప్రాథమిక ఆదాయ పథకం కింద జనరల్ కేటగిరీ కుటుంబాలకు నెలకు రూ.500, ఎస్.సి/ఎస్.టి. వర్గాలకు నెలకు రూ.1000 అందిస్తామని పేర్కొంది. అదేవిధంగా చిన్నకారు రైతులకు ప్రస్తుతం ఏటా అందిస్తున్న రూ.6వేలను రూ.10వేలకు పెంచుతామని పేర్కొంది. విద్యార్థులకు రూ.10 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు తమ ఉన్నత విద్యకోసం అందిస్తామని హామీ ఇచ్చింది. వీటిపై తీసుకునే మొత్తాలకు 4శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

**వైఎస్సార్‌సీపీ:** ఉచితాల విషయంలో ఏపీలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ మరో అడుగు ముందుకేసిందనే చెప్పాలి. నవరత్నాల పేరుతో ఆ ప్రభుత్వం అమలు చేస్తున్న చాలా వరకు పథకాలు కేవలం ఓటుబ్యాంకు పథకాలు తప్ప మరోటి కాదు.

### ఉచితాల వల్ల లాభాలు

ఉచితాలు ఆర్థిక ప్రగతిని ఉద్దీప్తం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీర్ఘకాలంలో ఇవి శ్రామికుల్లో ఉత్పాదకశక్తి పెరగడానికి దోహదం చేశాయి. తయారీ పరిశ్రమకు మంచి ప్రోత్సాహం లభించింది. ఉదాహరణకు తమిళనాడు, బిహార్ రాష్ట్రాలు కుట్టు మిషన్లు, సైకిళ్లు పంపిణీ చేయడం వల్ల సంబంధిత పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు బాగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచే ఈ మొత్తాన్ని చెల్లించినప్పటికీ, సంస్థపరంగా ప్రయోజనం కలిగింది. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాల్లో ఎన్నికల సమయాల్లో ఆయా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలకు సంబంధించిన కొన్ని హామీల కారణంగా కొంతమేర ఆర్థికాభివృద్ధి జరిగిన సందర్భాలున్నాయి. వెనుకబడిన రాష్ట్రాల్లో పేదరికంలో మగ్గుతున్న అధిక సంఖ్యాకులైన ప్రజలు, దారిద్ర్యరేఖ నుంచి బయటకురావడానికి ఈ ఉచితాలు దోహదపడ్డాయి. సాధారణంగా అటువంటి ఉచితాలు డిమాండ్‌కు అనుగుణంగా ఉండటాన్ని గమనించవచ్చు.

### ఉచితాలు-నష్టాలు

స్థూల ఆర్థిక వ్యవస్థ సుస్థిరతను ఈ ఉచితాలు దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేని రాష్ట్రాల్లో ఈ ఉచితాల అమలు వల్ల, వాటి ఆర్థిక స్థితి దెబ్బతినడం కనిపిస్తుంది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాల కోసం ఇటువంటి ఖర్చులు చేస్తే, వాటి ఆర్థిక పరిస్థితి దయనీయ స్థితికి చేరుతుంది. రాష్ట్రాలకు ఈ ఉచితాలను అమలు చేసే అధికారం, హక్కు ఉంటాయి. కానీ ఇది ఒక పరిమితిని దాటినప్పుడు రాష్ట్రమే దివాలా తీయవచ్చు. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనలు నిర్దేశించిన పరిమితిని దాటి రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేస్తే వాటి ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుంది. హేతుబద్ధతకు తిలోదకాలిచ్చి మరీ రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించి, వాటిని ప్రజాధనం నుంచి అమలు చేయాలనుకోవడం సహేతుకం కాదు. ఇది స్వేచ్ఛాయుత ఎన్నికల భావనకు విరుద్ధం. కొంతమంది రాజకీయ విశ్లేషకుల ప్రకారం, ఉచితాలు ప్రకటించడం, అమలు చేయడంలో నైతికత ఎంతమేర ఉన్నదన్న ప్రశ్న ఉదయిస్తుంది. ముఖ్యంగా ఇటువంటి ఉచితాల ప్రకటించడమంటే ప్రజలకు లంచం ఇవ్వజూపడమేనన్న వారి వాదనలో సహేతుకతను కొట్టిపారేయలేం. ఇక తయారీ పరిశ్రమపై ఈ ఉచితాలు ప్రతికూల

ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా వాటిల్లో పోటీతత్వం పడిపోయి, ఉత్పత్తుల్లో నాణ్యత కొరవడుతుంది. ఏకపక్షంగా ఆర్డర్లు ఇవ్వడం వల్ల ఆయా సంస్థలు నాణ్యతపై పెద్దగా దృష్టిపెట్టడం తగ్గుతుంది. ఇక రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికార పార్టీ ఉచితాలను అమలు చేసుకుంటూ పోతే దీర్ఘకాలంలో ఆర్థిక పరిస్థితి కుదేలు కావడం తథ్యం.

## రాయితీకి-ఉచితానికి తేడా ఏంటంటే?

ఉచితాలను ప్రకటించే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం ఎన్నికల్లో విజయం సాధించడం. పాలనా పరంగా ఉత్తమ పనితీరు ప్రదర్శించే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పార్టీలకు ఓటర్లను ఆకర్షించడానికి మరే ఇతర మార్గాలు లేక ఈ ఉచితాలను ప్రకటిస్తుంటాయి. ప్రజలకు తగిన సేవలు అందించాలని ప్రభుత్వం భావించినప్పుడు సబ్సిడీకి, ఉచితానికి మధ్య తేడాను స్పష్టంగా నిర్వచించాలి. సామాజిక సంక్షేమ రంగంలో ఎన్నో సేవలను ప్రజలకు అందించినప్పటికీ, ఇంకా ఇవ్వాల్సినవి చాలా ఉన్నాయని చాలా రాజకీయ పార్టీలు భావిస్తుండటం ఈ ఉచితాల హామీలకు మరో కారణం. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల నగారా మోగడంతో పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో ఓటర్లను ఆకర్షించేందుకు విభిన్న పథకాలను ప్రకటించాయి. ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలు సామాజిక పింఛన్లను భారీగా పెంచుతామని ప్రకటించాయి. ఇక రైతుబంధును దశలవారీగా ఎకరానికి రూ. 16 వేలు చేస్తానని బీఆర్ఎస్ ప్రకటిస్తే కాంగ్రెస్ ఒకేసారి రూ. 15వేలు ఇస్తామని ప్రకటించింది. గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కు అందిస్తామని కాంగ్రెస్ పేర్కొంటే, బీఆర్ఎస్ రూ. 400కే ఇస్తామంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని కర్ణాటకలో మాదిరిగానే కాంగ్రెస్ వాగ్దానం చేసింది. విద్యార్థులకు భరోసా కార్డు ఉద్యోగాల భర్తీకి సంబంధించి కాంగ్రెస్ వాగ్దానం చేసింది. అయితే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో వీటిపై స్పష్టత లేదు.





## దేశాలను ముంచిన ఉచితాలు

సోషలిస్ట్ వెనిజులా ఒకప్పుడు బలమైన ఆర్థిక వ్యవస్థ. 1980 ప్రాంతంలో చమురు ధరలు అధికంగా ఉండటంతో దేశం ఆర్థికంగా సమృద్ధిగా ఉండేది. దీంతో తర్వాత అధికారంలోకి వచ్చిన వారు ఆహారం నుంచి ప్రజా రవాణా వరకు ప్రజలకు ‘ఉచితంగా’ అందుబాటులోకి తెచ్చాయి. తర్వాతి కాలంలో చమురు ధరలు తగ్గడంతో, ఆహార దిగుమతులపై 70% ఆధారపడిన దేశం క్రమంగా చెల్లింపులు జరపలేని దశకు చేరుకొని ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. సర్వత్రా అవినీతి రాజ్యమేలడం మొదలైంది. ఈ దశలో కూడా ప్రభుత్వం రైతుల రుణాల మాఫీని ప్రకటించడం దేశ ఆర్థిక వ్యవస్థకు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది. దీనికితోడు ప్రభుత్వం నుంచే చాలావరకు ఉచితంగా అందుతుండటంతో ప్రజలు పనిచేయడం మానేశారు. దిగుమతులు విపరీతంగా పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి పోయింది. నాలుగు దశాబ్దాలుగా దేశ ఆర్థిక పరిస్థితి ఇంకా కొలిక్కి రాలేదు. క్యూబా ప్రజలు కూడా ప్రభుత్వం అందించే ఉచితాలపై అధికంగా ఆధారపడటంతో ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయింది. ప్రస్తుతం దక్షిణ హవానా వీధులు 1940 నాటి బొంబాయి వీధులను తలపిస్తుంటాయి. క్యూబా ప్రజలకు నేటికి కూడా జి.పి.ఎస్. సాఫ్ట్‌వేర్, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లవంటి ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో లేదంటే ఉచితాల వల్ల కలిగే ప్రతికూల ప్రభావం ఏ విధంగా ఉంటుందో పెద్దగా వివరించాల్సిన అవసరం లేదు. ప్రజలు ప్రధానంగా ప్రభుత్వం ఉచితంగా కల్పించే ప్రాథమిక అవసరాలకు బానిసలు కావడంతో ప్రజాస్వామ్య వ్యవస్థల్లోని పురోగామి, పోటీతత్వ శక్తులు ఇక్కడ స్థానం సంపాదించలేకపోయాయి.

ఇక ఉత్తర కొరియా గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత ఉత్తమం. ఒకప్పటి శ్రీలంక దేశాధ్యక్షుడు గోటబయ్య రాజపక్ష ఏకంగా పన్నుల రాయితీలు ప్రకటించడం, విచక్షణారహితంగా తీసుకున్న ఆర్థికపరమైన నిర్ణయాలు దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేశాయి. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల చివరకు దేశం దివాలా తీసింది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమంటే, ఉచితాలనేవి సామ్యవాద వ్యవస్థలో భాగం. సృజనాత్మకత, పురోగామిత్వం, సృజనాత్మకతలకు ఇక్కడ ప్రాధాన్యం ఉండదు. కేవలం కనీసావసరాల పేరుతో ప్రజల జీవితాలను ఒక చట్రానికే పరిమితం చేయడం కనిపిస్తుంది. ఫలితంగా సమాజం పురోగామిత్వాన్ని, నవకల్పనల స్థాయిని కోల్పోయి స్తబ్దంగా ఉండిపోతుంది. మరి చైనా విషయానికి వస్తే సామ్యవాదం నుంచి పెట్టుబడి మార్కెట్ వ్యవస్థకు మారినప్పుడు మాత్రమే అభివృద్ధి చెందిందన్నది చారిత్రక సత్యం.

భారత్ ఒక ‘యూనియన్’ అంతేకాని ‘రాష్ట్రాల సమాఖ్య’ కాదు. ఇక్కడ గట్టిగా పట్టుకొని ఉండటం కాదు, అందరూ కలిసికట్టుగా ముందుకెళ్లడం మాత్రమే ఉంటుంది. ‘యూనియన్’ అంటే నాశరహితమైంది. ఈ ‘యూనియన్’లో భాగంగా ఉన్న రాష్ట్రాల ఆకృతుల్లో మార్పులు జరగవచ్చు. ‘యూనియన్’ అనేది కేంద్రం, రాష్ట్రాల్లో అంతర్లీనంగా ఉంటుంది. రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం కూడా బలంగా ఉండటం సాధ్యం. ఇండియన్ యూనియన్ స్థూల ఆర్థిక స్థితి బలీయంగా ఉండటం అనేది కేంద్ర, రాష్ట్రాల స్థూల ఆర్థిక స్థితి దృఢంగా ఉండటంపైనే ఆధారపడి ఉంటుంది. ఉచితాలు ఒక పరిమితి దాటితే అవి స్థూల ఆర్థికవ్యవస్థ స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. ప్రభుత్వాలు తమ చేతుల్లో ‘ఉపకరణాలు’గా ఉన్న ఈ ఉచితాలను సముచిత రీతిలో మాత్రమే ప్రయోగించాలి తప్ప విచక్షణా రహితంగా ఉపయోగించకూడదు. ★



# బాబ్రీ కాదు.. 'మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీద్'

అయోధ్యలో రామమందిరానికి తుది మెరుగులు దిద్దుకుంటున్నది. మర్యాద పురుషోత్తముడు రాముడి దర్శనం ఎప్పుడు లభ్యమవుతుందా అని ప్రజలు తహతహలాడుతున్నారు. వచ్చే ఏడాది జనవరి 24న ప్రజల దర్శనార్థం మందిర ద్వారాలను తెరవనున్నట్టు ప్రకటన కూడా వెలువడింది.

కాగా, అయోధ్యలో ధన్నిపూర్ గ్రామంలో ముస్లింలు నిర్మించ తలపెట్టిన మసీదుకు బాబర్ పేరు పెట్టబోవడం లేదుట! ఉత్తరప్రదేశ్ సున్ని వక్ఫ్ బోర్డుకు కేటాయించిన (సుప్రీంకోర్టు తీర్పు మేరకు) భూమిలో ఇండో– ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ ట్రస్టు (ఐఐసిఎఫ్‌టి) ఈ మసీదును నిర్మించబోతోంది. ఇంతకీ, ఈ మసీదుకు 'మహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీద్' అని నామకరణం చేయాలని భారతీయ మసీదులకు ప్రాతినిధ్యం వహించే అఖిల భారత్ రబ్తా–ఎ–మసీదు ప్రతిపాదించింది. ఇది ఒక చారిత్రిక నిర్ణయమనే చెప్పాలి. అంటే ప్రవక్త మహమ్మద్ పేరు, ఆయన తండ్రి అబ్దుల్లా పేరు ఈ మసీదుకు పెడుతున్నారు.

రామజన్మభూమి– బాబ్రీ మసీదు కేసులో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే, ఈ భూమిని వారు కొత్త మసీదును నిర్మించుకునేందుకు కేటాయించారు. ఈ తీర్పు సుదీర్ఘకాల వివాదానికి ముగింపు వాక్యం పలకడమే కాక, అయోధ్యలో రామ్‌లల్లా ఆలయ నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేసింది.

నూతన మసీదు పేరూ, నమూనా రెండూ కూడా భారతీయ ముస్లింల మనస్తత్వాన్ని బయట పెడుతున్నాయి. మసీదు ఎలా ఉండబోతోందో వారు విడుదల చేసిన చిత్రాలను పరిశీలించినప్పుడు దాని వెనుక మధ్య ప్రాచ్య నమూనా స్ఫూర్తి కనిపించక మానదు. వారి మూల నమూనా సమకాలీనంగా, అనేక భారతీయ మసీదులను పోలి ఉంది. అయితే, అనంతర కాలంలో మధ్య ప్రాచ్యం, అరబ్బు దేశాలలో ప్రసిద్ధ మసీదుల స్ఫూర్తితో నూతన మసీదును నిర్మించాలని నిర్ణయించారు. నూతన మసీదుకు ఎత్తైన మినార్‌లు, భారీ డోమ్‌లు ఉంటాయి. పూర్తి అయిన తర్వాత అందులో 5000మంది భక్తులు ప్రార్థన చేసేందుకు వీలుగా ఉంటుంది.

నూతన డిజైన్ అన్నది సంప్రదాయక సౌందర్యాన్ని కలిగి ఉంటుందంటూ యూపీ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు చైర్మన్ జుఫార్ ఫారూకీ వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత అందమైన మసీదుగా ఈ నూతన మసీదును నిర్మించా లన్నది తన లక్ష్యమని కూడా ఆయన చెప్పారు. కాగా, ఈ బృహత్తర కట్టడపు నిర్దిష్ట పరిమితులు ఇంకా బయటపెట్టలేదు.

అరబ్ మసీదులు వైభవానికి చిహ్నాలుగా ఉంటాయని ఫారూకీ ఎందుకు నమ్ముతున్నారో ప్రశ్నించవలసిందే అంటూ కొందరు హిందూ వాదులు అంటున్నారు. అంతేకాదు, అరబ్ ముస్లింలతో పోలికను లేక సంబంధాన్ని కనుగొనే అవసరం భారతీయులకు ఎందుకు ఉందన్నది కూడా ప్రశ్నించవలసిందేనని వారం టున్నారు. అరబ్‌ల గుర్తింపు కోసం భారతీయ ముస్లింలు ఎందుకు అంత తహతహలాడి పోతారు? వారి ప్రస్తావన లేకుండా తమ వారసత్వాన్ని జరుపుకోవడం అంటే సరైన ముస్లింగా ఉండటం కాదా అన్న ప్రశ్నలు కూడా వేస్తున్నారు. కూలక ముందు బాబ్రీ మసీదు అలాగే ఉండాలని వాదించినవారూ, కూలిన తరువాత బాబ్రీని తిరిగి నిర్మించాలని వీరంగం వేసినవారూ అంతా ఏమైయ్యారు? బాబర్ పేరున మసీదు ఉండడం వారికీ ఇష్టం లేకపోతే స్వాగతించవలసిన విషయం. కానీ ఆనాడు హిందువులు అంత పోరాటం చేస్తున్నా బాబరీ మసీదు కోసం పట్టుపట్టినవారు, ఇప్పుడు కొత్త మసీదుకు ఆ పేరే పెట్టకపోవడం నాడు ముస్లింలు చేసిన హంగామా అంతా కేవలం మతకోణంతో చేసిన రాజకీయమేనా?

– జాగృతి డెస్క్



# స్వలింగ వివాహాలపై సుప్రీం సముచిత తీర్పు

**స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరుతూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం, కొంత ఆలస్యంగానే అయినా, సముచితమైన, చక్కని తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించి స్వలింగ సంపర్కుల జంటలు, సామాజిక కార్యకర్తల నుంచి వచ్చిన మొత్తం పద్దెనిమిది పిటిషన్లలోని విభిన్న కోణాలను, భిన్న అనుకూల, ప్రతికూల అభిప్రాయాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.**

నిజానికి ఈ పిటిషన్లపై ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఈ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఏకబిగిన పదిరోజుల పాటు జరిగిన వాదనలలో వ్యక్తమైన ప్రజల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, సర్వోన్నత న్యాయస్థానం లైవ్ స్ట్రీమింగ్‌కు కూడా అనుమతిన్నించింది. అలా అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన విచారణ గత మే 11నే పూర్త యింది. అయితే, సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును వెంటనే వెలువరించలేదు. వాయిదా వేసింది. దీంతో, అప్పటి నుంచి పిటిషన్లు దాఖలు చేసిన స్వలింగ సంపర్కులతో పాటుగా సామాజిక కార్యకర్తలు గత ఐదు నెలలుగా 'తీర్పు' కోసం ఆశగా, ఆసక్తిగా, ఆత్రుతతో ఎదురుచూశారు.

చివరకు, ఉభయ పక్షాల వాదనలను సమగ్రంగా పరిశీలించిన మీదట, సుప్రీంకోర్టు ధర్మాసనం అక్టోబర్ 17న తుది తీర్పును వెలువరించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం న్యాయస్థానం పరిధిలోకి రాదని, స్వలింగ వివాహాలను చట్టబద్ధమైనవిగా గుర్తించడం పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల పరిధిలోని అంశంగా పేర్కొంటూ, ధర్మాసనం తుది తీర్పును వెలువరించింది. సహజంగానే, పిటిషన్లు దాఖలు చేసిన స్వలింగ సంపర్కుల జంటలు, సామాజిక కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. కానీ, ఆ కొద్దిమందిని మినహాయిస్తే, మిగిలిన సమాజం సుప్రీం తీర్పును స్వాగతించింది.

నిజానికి, స్వలింగ సంపర్కం, స్వలింగ వివాహం గురించి చర్చ, సంభాషణ మనదేశంలోనే కాదు, అనేక ప్రపంచ దేశాల్లో చాలా కాలంగా ఉన్నదే. ఎల్జీబీటీ+గా వ్యవహరిస్తున్న విభిన్న/విరుద్ధ లైంగిక లక్షణాల సమూహం, ఎప్పటి నుంచో, హక్కుల పోరాటం సాగిస్తోంది. తమకు ప్రత్యేక గుర్తింపు కావాలని, కోరుకుంటోంది. ఎల్జీబీటీ కమ్యూనిటీ కోసంగా ప్రత్యేక వివాహ చట్టం చేయాలని పట్టుబడు తోంది. అయితే, సుప్రీంకోర్టు ధర్మాసనం స్వలింగ సంపర్కుల పట్ల సానుభూతి చూపుతూనే, వారి ప్రధాన డిమాండ్లకు చట్టసభలే సమాధానం ఇవ్వాలని తీర్పులో పేర్కొంది. తద్వారా స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్ట బద్ధత కల్పించడమనేది శాసన వ్యవస్థ పరిధిలోని అంశమన్న ప్రభుత్వ వాదనను ధర్మాసనం బలపరిచింది.

**సానుకూలమే.. కానీ...**

ఒక విధంగా చూస్తే, ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మొదటి నుంచి కూడా స్వలింగ సంపర్క సమూహం పట్ల, వారి ఆశలు, ఆకాంక్షల విషయంలో కొంతవరకు సానుకూల ధోరణితోనే ఉంది. ఒక విధంగా కొంతమేర సానుకూలంగా వ్యవహరించిందనే చెప్పవచ్చును. అందులో భాగంగానే 2018లోనే సర్వోన్నత న్యాయస్థానం, స్వలింగ సంపర్కం 'నేరం' కాదని, ఇందుకు సంబంధించి బ్రిటిష్ కాలం నాటి చట్టం చెల్లదని తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు ద్వారా స్వలింగ సంపర్కం, స్వలింగ వివాహంపై చర్చ సజీవంగా కొనసాగేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఒక వెసులుబాటును కల్పించింది.



ఈ నేపథ్యంలో, స్వలింగ వివాహాల చట్టబద్ధతపై, వివిధ సంఘాలు, వ్యక్తులు దాఖలు చేసిన 18 పిటిషన్లపై ఈ సంవత్సరం ప్రారంభంలో మొదలైన విచారణ అత్యంత ఆసక్తికరంగా సాగింది. చివరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం, స్వలింగ వివాహాలకు చట్ట భద్రత తమ పరిధిలోకి రాదని తేల్చి చెప్పింది. వివాహం చేసుకున్న స్వలింగ జంటలను దంపతులుగా గుర్తించలేమని, పిల్లలను దత్తత తీసుకనే హక్కును కల్పించలేమని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో సుప్రీం కోర్టు ధర్మాసనం, స్వలింగ జంటల సహజీవనం చేయచ్చని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వలింగ జంటలకు సమాజంలో 'సముచిత స్థానం, గౌరవం, రక్షణ' కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. స్వలింగ జంటల సహజీవనాన్ని అనుమతించే విషయంలో కేంద్ర, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలలోని ప్రభుత్వాలు వారి పట్ల వివక్ష చూపరాదని ప్రధాన న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. స్వలింగ సంపర్కుల జంటలకు కొన్ని చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలను కల్పించే అంశాన్ని పరిశీలించేందుకుగాను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనలను తాము రికార్డుల్లోకి తీసుకుంటున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. అంటే, స్వలింగ వివాహాలకు సంబంధించి, చర్చకు సుప్రీం అంతిమ తీర్పు ముగింపు కాదన్నదే తీర్పు అంతర్లీన సారంశమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, సామాజిక, సాంస్కృతిక కారణాలతో భారతదేశంలోని వివిధ వర్గాలు స్వలింగ సంపర్కుల వివాహాలను చట్టబద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టం తెచ్చేందుకు ముందుకువచ్చే అవకాశాలు ఇప్పుడే కాదు, 'భవిష్యత్'లోనూ బహు తక్కువగా ఉన్నాయనే అభిప్రాయం సామాజిక, రాజకీయ విశ్లేషణలలో వినిపిస్తోంది.

**పాశ్చాత్య దేశాల్లో**

నిజానికి, స్వలింగ వివాహాన్ని ఇప్పటికీ భారతీయ సమాజం ఆమోదించే పరిస్థితి లేదు. కొద్దిపాటి మినహాయింపులను పక్కన పెడితే, దానిని ఒక వికృతిగానే పరిగణిస్తోంది. అయితే ప్రపంచంలో చాలా వరకు దేశాలు, స్వలింగ వివాహాన్ని విభిన్న




రాజనాల బాలకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్


కోణాల్లో విశ్లేషిస్తున్నాయి. కొన్ని దేశాలు స్వలింగ వివాహాలకు చట్ట బద్ధత కలిపించాయి. ముఖ్యంగా వివాహ, కుటుంబ వ్యవస్థలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వని పాశ్చాత్య దేశాలు, స్వలింగవివాహాలకు చట్టబద్ధత కల్పించాయి. అయితే, మన దేశంతో సహా ప్రపంచ వ్యాప్తంగా 133 దేశాలు స్వలింగ సంపర్కాన్ని నేరరహితం (డిక్రిమినలైజ్) చేసినా, అందులో కేవలం 32 దేశాలు మాత్రమే స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాయి. అంటే, విచ్చలవిడి సంస్కృతికి అలవాటు పడిన దేశాలుగా భావించే పాశ్చాత్య దేశాలు కూడా స్వలింగ వివాహం విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నాయి. అయితే, ఇటీవల కాలంలో పాశ్చాత్య జీవన విధానానికి



మరింతగా దగ్గరవుతున్న భారతీయ యువత ఆలోచనలో వస్తున్న మార్పు కారణంగా అయితేనేమీ, మరో కారణం చేతనైతేనేమీ, స్వలింగ సంపర్కం, స్వలింగ వివాహం భారతీయ సమాజం ముందు ఒక ప్రధాన ప్రశ్నగా నిలిచింది.

అందుకే, జాతీయ స్థాయిలో విభిన్న వేదికలపై స్వలింగ వివాహం చర్చకు వస్తోంది. పాశ్చాత్యుల సంగతి పక్కన పెట్టినా, మన దేశంలోనూ, స్వలింగ సంపర్కుల సంఖ్య లక్షల్లో వుంది. ఇంకా పెరుగు తోంది. విదేశీ భావజాల వికృతులను భారతీయ సమాజంలో చొప్పించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న, కామ్రేడ్ పార్టీలు/ సంస్థలు ఈ వికృత బీజాలను విష వృక్షాలుగా పెంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నాయి. మరోవంక కాంగ్రెస్ పార్టీ, ఇది మనసు పెట్టి ఆలోచించవలసిన విషయమే కాదంటూ కొట్టేసింది. అయితే, చాలావరకు రాజకీయ పార్టీల నాయకులు, వ్యక్తిగతంగా స్వలింగ వివాహం విజాతీయ భావనగానే, మన దేశానికి మంచిదికాదనే అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తున్నారు. సిపిఐఎం నేత బృందాకారత్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వంటి కొద్దిమంది మాత్రమే, స్వలింగ వివాహాలను సమర్థిస్తున్నారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును తప్పు పడుతున్నారు.

**మన సంస్కృతి కాదు**

"స్వలింగ సంపర్కుల విషయంలో ఎవరికైనా సానుభూతి ఉంటుంది. అది సహజం. అదే సమయంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం అంత ఉచితం కాదు. ఇది మన సంస్కృతికి విరుద్ధం, అంతేకాదు, స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే, అది భారతీయ సామాజిక వ్యవస్థకు పునాదిగా నిలిచిన వివాహ, కుటుంబ వ్యవస్థలపైనా దుష్ప్రభావం చూపుతుంది" అనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. నిజానికి, ఇది ఎవరో ఒకరో ఇద్దరో వ్యక్తపరిచిన అభిప్రాయం కాదు. సుప్రీం కోర్టు తీర్పుపై స్పందించిన అందరి అభిప్రాయాలను క్రోడీకరిస్తే వ్యక్తమవుతున్న సార్వజనీన అభిప్రాయంగా పేర్కొంటున్నారు.

అందుకే, స్వలింగ సంపర్కులకు, పరిమితుల మేరకు చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలను కల్పించే అంశాన్ని పరిశీలించేందుకు గానూ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, వివాహానికి చట్టబద్ధత, గుర్తింపు ఇచ్చేందుకు మాత్రం అంగీకరించలేదు. ఎలాంటి శషభిషలు లేకుండా, క్లియర్ కట్'గా నో... చెప్పేసింది. న్యాయస్థానం సైతం అదే అభిప్రాయాన్ని అంతే స్పష్టంగా , తీర్పులో పొందు పరిచింది.

**తీర్పును ఆహ్వానించిన సంఘ్**

నిజానికి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తదితర సంఘ పరివార్ సంస్థలు, స్వలింగ వివాహాలు మన సంస్కృతికి విరుద్ధమని స్పష్టం చేస్తూనే ఉన్నాయి. అందుకే, సుప్రీంకోర్టు తీర్పును, సంఘ్‌పరివార్ సంస్థలు స్వాగతించాయి. నిజానికి, ఆర్ఎస్ఎస్ మొదటి నుంచి కూడా 'స్వలింగ సంపర్కం నేరం కాదు, అదొక శారీరక రుగ్మత.. మాత్రమే' అనే అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తూ వచ్చింది. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపైనా, సంఘ్ అదే అభిప్రాయం తెలియచేసింది. సుప్రీంతీర్పు వెలువడిన వెంటనే, ఆర్ఎస్ఎస్ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా తీర్పును స్వాగతించారు. అలాగే, మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఇందుకు సంబంధించిన, అన్ని అంశాలను చర్చించి, సరైన నిర్ణయం తీసుకుంటుం దనే, విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. అలాగే, విశ్వ హిందూ పరిషత్, కార్యనిర్వాహక అధ్యక్షులు అలోక్ కుమార్ కూడా సుప్రీం తీర్పును స్వాగతించారు. అన్ని మతవిశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, స్వలింగ వివాహనికి చట్టబద్ధత లేదని స్పష్టం చేస్తూ ఇచ్చిన తీర్పుతో మేము సంతృప్తి చెందామని పేర్కొన్నారు.

నిజానికి, స్వలింగ వివాహాల పై సుప్రీం కోర్టులో గత జనవరిలో విచారణ ప్రారంభమైన సమయం లోనే, ఆర్ఎస్ఎస్ పరమ పూజ్యనీయ సర్‌సంఘ చాలక్ మోహన్ భాగవత్, 'స్వలింగ సంపర్కం, స్వలింగ వివాహాలపై సంఘ్' దృక్పథాన్ని స్పష్టం చేశారు. గత జనవరిలో 'ఆర్గనైజర్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో.. హిందూ సమాజం స్వలింగ సంపర్కాన్ని, ఒక సమస్యగా చూడదు. ఎల్జీబీటీ కమ్యూనిటీ (స్వలింగ సంపర్క సమూహం)లోని వారికి వ్యక్తిగత, సామాజిక స్వేచ్ఛ, ఉండాలని పేర్కొన్నారు. అంతేకాదు, మానవజాతి మనుగడ మొదలైన నాటి నుంచి అలాంటి పదబంధం ఉందని, అదొక విధమైన భౌతిక జీవన విధానంగా చూడాలని అన్నారు. అయితే, సంఘ్ మొదటి నుంచి కూడా స్వలింగ వివాహాల విషయంలో మాత్రం, స్పష్టమైన వ్యతిరేకతను ఎప్పటికప్పుడు వ్యక్త పరుస్తూనే ఉంది. ఇప్పుడు కాదు, 2016లోనే సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబాలే స్వలింగ సంపర్కం ఇతరులకు హాని చేయనంత వరకు నేరం కాదని స్పష్టం చేశారు. ఇప్పుడు తాజాగా స్వలింగ వివాహాలు మన సంస్కృతికి విరుద్ధమని అన్నారు. అలాగే, మన సంస్కృతిలో పెళ్లి అనేది పరస్పర వ్యతిరేక లింగాల మధ్య మాత్రమే జరుగుతుందని, ఈ అంశంపై కేంద్రప్రభుత్వ నిర్ణయంతో తాము ఏకీభవిస్తున్నామని చెప్పారు. అందుకే, సుప్రీం తీర్పును.. అందరూ స్వాగతిస్తు న్నారు. ★

**తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పోటీ చేయబోతున్న నేతలు, ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో తమ బలాలు ప్రదర్శించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పక్షాల అభ్యర్థుల తరపున నగదు, మద్యం, వస్తువులు ఓటర్లకు ఇంటింటి పంపిణీ 'ఔరా!' అని ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. మరోవంక ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, నిర్వహిస్తున్న తనిఖీలలో నిత్యం రూ. కోట్ల విలువ గల నగదు, బంగారం, వెండి, వస్తువులు పట్టుబడుతున్నాయి.**



# ఈ ఎన్నికలు

ఒకప్పుడు ఎన్నికలంటే హామీలు, పార్టీల మేనిఫెస్టోలు, నియోజకవర్గాల్లోని గ్రామ గ్రామానా, వాడవాడలా నాయకుల ప్రచారాలు, ఆర్భాటాలు, ఓటర్లను వేడుకోవడాలు అన్నట్లుగా ఉండేది. కానీ, కొన్నాళ్లుగా పరిస్థితి పూర్తిగా మారి పోయింది. పైన పేర్కొన్న వాటికంటే మరో రెండు అంశాలు ఎన్నికలను శాసిస్తున్నాయి. గెలుపోట ములను నిర్దేశిస్తున్నాయి. అభ్యర్థుల జాతకాలను మార్చి వేస్తున్నాయి. ప్రభుత్వ పీఠం దక్కే అంశంలో నిర్ణయాత్మకంగా మారుతున్నాయి.

గత కొన్ని ఎన్నికలనుంచి డబ్బు, మద్యం పంచడం వంటివి సర్వసాధారణంగా మారి పోయాయి. ఆయా పార్టీల ముఖ్య నాయకులు పోటీ పడి మరీ ఓటర్లకు డబ్బులు, మద్యం పంచి పెడుతుండటం రాష్ట్రమంతటా కనిపిస్తోంది. ఇక, పండుగల సమయంలో ఎన్నికలంటే చికెన్, మటన్ వంటివి కూడా ఇంటింటికీ పంపిణీ జరుగుతోంది. ఓ పార్టీ నాయకుడు ఓటుకు రూ. అయిదు వేలో, పదివేలో ఇస్తున్నాడంటే.. మరో పార్టీ నాయకుడు దానికి రెట్టింపు డబ్బును పంచడం, గెలిచిన తర్వాత వాళ్లకు చేసే మేలు గురించి వ్యక్తిగత హామీలు ఇవ్వడం వంటివి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. మరికొందరి విషయంలో చీరలు, గడియారాలు వంటి వస్తువులను ఓటర్లను బట్టి ఇంటింటికీ పంచడం తప్పనిసరి తంతుగా మారిపోయింది. అంతేకాదు....వీటన్నింటినీ తోసిరాజని.. కాస్త డబ్బున్న అభ్యర్థులైతే బంగారం, వెండి పంచడం కూడా పోలింగ్ సమయంలో భాగమై పోయింది.

ఈ పరిణామాలను గత కొన్ని ఎన్నికల నుంచి క్షుణ్ణంగా గమనిస్తోన్న ఎన్నికల కమిషన్, ఎన్నికలు పారదర్శకంగా, ప్రలోభాలకు అతీతంగా జరిగేలా అలాంటి వాటికి చెక్‌పెట్టే పనికి పూనుకుంది. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. ఊరూ-వాడా.. పల్లె-పట్నం అనే తేడా లేకుండా అన్ని రహదారులపైనా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పోలీసులు, ప్రత్యేక బలగాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. వచ్చీ పోయే వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రత్యేక బలగాలకు తోడు.. కేంద్ర ప్రత్యేక బలగాలు కూడా ఈ విధుల్లో పాలు పంచుకుంటున్నాయి. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో నగదుతో పాటు.. బంగారం, వెండి కూడా పట్టుబడుతున్నాయి. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సమీకరిస్తున్న వివిధ రకాల వస్తువులు కూడా భారీగా దొరుకుతున్నాయి. వీటి విలువ రూ. కోట్లలోనే ఉంటోంది. అలాగే, కొన్ని ప్రాంతాల్లో స్థానికులు, ఇన్ఫార్మర్ల నుంచి వస్తున్న సమాచారంతో చేస్తున్న దాడుల్లో భారీ మొత్తంలో డబ్బులు, సొత్తు, వస్తువులు స్వాధీనం చేసుకుంటున్నారు. సరైన పత్రాలు లేని బంగారం, వెండిని సీజ్ చేస్తున్నారు.



ఇలా.. పట్టుబడుతున్న బంగారం, నగదు చూసి కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి నెలకొంది. వాటిని చూసి పోలీసులు, భద్రతా దళాల అధికారులు అవాక్కవు తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుబడిన మొత్తం సొత్తుకంటే కేవలం పది రోజుల్లోనే రెట్టింపు సొత్తు పట్టుబడటం రికార్డుగా చెబుతున్నారు ఎన్నికల కమిషన్ అధికారులు.

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కేవలం తొలి పదిరోజుల్లోనే ఏకంగా రూ. 243 కోట్ల విలువైన సొత్తు తనిఖీల్లో పట్టుబడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తంగా రూ.137 కోట్ల సొత్తు పట్టుబడింది. తాజా ఎన్నికల సమయంలో కేవలం పదిరోజు ల్లోనే అంతకంటే రెట్టింపు సొత్తు తనిఖీల్లో పట్టు బడడం విస్తుగొలుపుతోంది. రాజకీయ పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉండటంతో గెలుపుకోసం ఎంతయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయం ఈ లెక్కలు చూస్తేనే అర్థమవుతోంది. భద్రతా దళాలు, పోలీసుల తనిఖీల్లో కొందరు మాత్రమే పట్టుబడుతున్నారని, వారికి చిక్కుతున్న సొత్తు చాలా తక్కువని, వారికి దొరక్కుండా దొడ్డిదారిన తరలిస్తున్న కానుకలు, సొత్తు, నగదు పదుల రెట్లు ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. అంటే రాజకీయ పార్టీలు,

సుజాత గోపగోని, 6302164068



# మహా 'ప్రియం' గురూ!

నాయకులు, అభ్యర్థులు ఓటర్లకు ఏ స్థాయిలో డబ్బు, మద్యం, డ్రగ్స్, తాయిలాలను ఎరగా వేసేందుకు సిద్ధమవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.


తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అక్టోబర్ 9వ తేదీ నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అప్పటినుండి రాష్ట్ర సరిహద్దుల వద్ద, జాతీయ రహదారులపై ఎక్కడిక్కడ చెక్ పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నారు. లక్షలు, కోట్ల రూపాయల నగదును ఎలాంటి పత్రాలు, ఆధారం లేకుండా తరలిస్తున్న సొమ్మును వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో ఈ పదిరోజుల్లో అంటే అక్టోబర్ 9వ తేదీ నుండి 19వ తేదీ వరకు రూ.243 కోట్ల 76 లక్షల 19వేల 296 రూపాయల సొత్తు పట్టుబడినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

డబ్బు, మద్యం, బంగారం కలిపి మొత్తం రూ.243.76 కోట్ల విలువ చేసే సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. రూ.87 కోట్ల 92 లక్షల నగదు, రూ.10 కోట్ల 21 లక్షల విలువ చేసే మద్యం, రూ.120 కోట్ల విలువ చేసే బంగారం, వెండి, వజ్రాలు పట్టుబడ్డాయి. రూ. 2 కోట్ల 60 లక్షల 57 వేల విలువ చేసే మద్యం సీసాలతో పాటు రూ. 3 కోట్ల 42 లక్షల 84 వేల 275 విలువచేసే గంజాయి సీజ్ చేశారు. ఇక, రూ.70 లక్షల 4 వేల 500 రూపాయలు విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ ప్రకటించింది. కేవలం అక్టోబర్ 18వ తేదీ ఉదయం మరునాడు ఉదయం వరకు, అంటే 24గంటల్లోనే ఏకంగా 83 కిలోల బంగారం పట్టుబడింది.

ఇలా పోలీసులకు పట్టుబడ్డ కానుకలు, నగదు ప్రాంతాల వారీగా చూస్తే..నల్గొండ జిల్లాలోని జాతీయ రహదారిపై ఓ లాజిస్టిక్ సంస్థకు చెందిన వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలుతున్న రూ. 26 కోట్ల విలువగల 40 కిలోల బంగారం, 190 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేరోజు రాత్రి హైదరాబాద్ నారాయణగూడలో ఓ వాహనంలో తరలిస్తున్న 13.5 కిలోల బంగారం, చైతన్యపురిలో ఓ వ్యక్తి దగ్గర నుంచి పత్రాలు లేని రూ. 97 లక్షల పట్టుబడ్డాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని జక్కన్నపల్లి పెట్రోల్ బంక్ వద్ద, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సోదాల్లో రూ.లక్షన్నర నుంచి భారీ మొత్తంలో లెక్క తెలియని సొత్తు పట్టుబడింది, పడుతూనే ఉంది. పోలీసులకు పట్టుబడుతున్న సొత్తులో ఎక్కువగా బంగారం, వెండి ఉంటోంది. ఇక నగదుతో పాటు మద్యం, మత్తు పదార్థాలను కూడా పోలీసులు స్వాధీనం చేసు కుంటున్నారు. చీరలు, వంటసామాగ్రి, నిత్యావసర సరుకులు, ల్యాప్ టాప్, ట్యాబ్లెట్లు, సెల్ ఫోన్లు వంటివి ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసుకుం టుండగా పట్టుబడుతున్నాయి.

అయితే, ఎవరయినా వ్యక్తిగత పనులపై నగదు, బంగారం తీసుకెళుతుంటే వాటికి సంబంధించిన సరైన పత్రాలు వెంటపెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. రూ.50 వేలకు మించిన నగదు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతూ పట్టుబడితే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తు న్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



# విశాఖ నుంచి పాలన..

**విశాఖలో పాలనకు వైసీపీ ప్రభుత్వం ఎనలేని దూకుడును ప్రదర్శిస్తోంది. రాష్ట్ర రాజధాని అంశంపై తుది తీర్పు వచ్చే వరకు విశాఖ నుంచి పాలించరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించినా, ఈ అంశం సుప్రీం కోర్టులో విచారణలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అమరావతి రాజధాని రైతులను కవ్విస్తూ, ప్రజలకు ఆగ్రహం కలిగిస్తూ, రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ సమాజంలో అశాంతికి కారణమౌతోంది. డిసెంబరులో విశాఖ నుంచే పాలన ప్రారంభమవుతుందని, అధికారులంతా కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారని, తన నివాసం కూడా ఇక్కడకే మారుతుందని ముఖ్యమంత్రే చెప్పి ప్రజలను రెచ్చగొట్టడం దేనికి సంకేతం? అసలు తమను శాంతిగా ఉండనిచ్చే ఉద్దేశ్యం ఈ ముఖ్యమంత్రికి లేనట్లుందని ప్రజలంటున్నారు. ఎప్పుడూ ఏదొక విషయంలో ఏదొక వరాన్ని ఇబ్బంది పెట్టడం, సమస్యలు సృష్టించడం నాలుగున్నరేళ్లుగా చూస్తున్నదే. ఎన్నికలు సమీపిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇంకా తమ చిత్తం వచ్చినట్లు ప్రవర్తిస్తూనే ఉంది.**

రాజధానిని అమరావతి నుంచి విశాఖ తరలింపుపై ప్రభుత్వం ఇంత పట్టుపట్టడానికి కారణాలను లోతుగా పరిశీలిస్తే అమరావతిని అణచివేసి, విశాఖలో సృష్టించుకున్న సంపదకు విలువ పెంచుకోవడం అనేవి ప్రధానమైన అంశాలుగా కనిపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అమరావతి రాజధానిగా ఉంటే అక్కడ భూముల ధరలు పెరుగుతాయి. దానివల్ల ప్రభుత్వ పెద్దలకు గాని, అధికార పార్టీ నేతలకు గాని పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. అందుకే ఒక పథకం ప్రకారం విశాఖను ఆక్రమించి, భూములు కబ్జా చేసి అక్కడ రాజధానిని ఏర్పాటు చేస్తే భూముల విలువతో పాటు తమ సంపద కూడా పెరుగుతుందనే ఆలోచనలో ఉన్నట్లు స్థానికులు, రాజకీయ పార్టీలు బహిరంగంగా ఆరోపిస్తున్నాయి.

**నాడు మద్దతు**

అమరావతి రాజధానికి ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహనరెడ్డి అసెంబ్లీ సాక్షిగా మద్దతు పలికారు. రాజధాని నిర్మాణానికి కనీసం 30 వేల ఎకరాలు అవసరమని సభలో చెప్పారు. అమరావతి ప్రాంతం లోనే ఇల్లు, కార్యాలయం కూడా నిర్మించుకున్నారు. దీనిని 2019 ఎన్నికల్లో హైలెట్ చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లారు. అంతేగాకుండా వైసీపీ అధికారంలోకి వస్తే అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మిస్తామని కూడా జగన్ హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడికి ఏపీలో సొంత ఇల్లు లేదని, తమ పార్టీ అధినేత రాజధాని ప్రాంతంలో సొంత ఇల్లు కట్టుకున్నారని వైసీపీ ముఖ్యనేతలు కూడా విస్తృత ప్రచారం చేశారు. ప్రజలను ఇంత బాగా నమ్మించిన వైసీపీ నేతలు, అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారని నాలుగున్నరేళ్ల పరిస్థితిని బట్టి అర్థం చేసుకోవచ్చు. నాలుగున్న రేళ్లుగా అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఒక్క అంగుళం కూడా కదలకుండా చేశారు. రీటెండరింగ్ పేరుతో పనులను ఎక్కడివక్కడే నిలిపివేశారు. ఆ తర్వాత... అభివృద్ధి కేంద్రీకృత మవుతుందని, అమరావతి ముంపు ప్రాంతమని, ఇక్కడ నిర్మాణాలు ఖర్చుతో కూడుకున్నవని, అది ఎడారి ప్రాంతమని, శ్మశానమని, 'కమ్మరా'వతి అని మంత్రివర్గం, వైసీపీ నాయకులు అందరూ కలసి రకరకాల దుష్ప్రచారం చేశారు. సమగ్రాభివృద్ధి పేరుతో మూడు రాజధానులను తెరపైకి తెచ్చారు. విచిత్రమేమిటంటే వెనుకబాటుకు గురైన ఉత్తరాంధ్ర పేరు చెప్పి... హైదరాబాద్ తర్వాత అభివృద్ధిలో రెండోస్థానంలో ఉన్న విశాఖను పాలనా రాజధానిగా ఎంపిక చేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఉచితంగా భూములిచ్చిన 28 వేల మంది రైతులను రోడ్డున పడేశారు. వారికి గత నాలుగున్నర సంవత్సరాలుగా నరకం చూపిస్తున్నారు. న్యాయం చేయాలని కోరుతున్న వారిపై వందల సంఖ్యలో



కేసులు బనాయించారు. నానా విధాలుగా వారిని హింసించారు. చివరకు వారు పాదయాత్రలు చేయాలని ప్రయత్నించినా అనేక ఆటంకాలు కల్పించారు. మూడు రాజధానుల ఏర్పాటు ప్రకటనతో రాజధాని రైతులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు వారికే అనుకూలంగా తీర్పు నిచ్చింది. వైసీపీ ప్రభుత్వం ప్రధాన కార్యాలయాలను విశాఖకు తరలించరాదని ఉత్తర్వులిచ్చింది. దాంతో ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా, సుప్రీం కోర్టు స్టే ఇవ్వలేదు. కేసు మాత్రం విచారణలో ఉంది. కాని రాజధానిని విశాఖకు తరలిస్తామని ప్రభుత్వం మరలమరల బహిరంగంగా ప్రకటిస్తూ, కోర్టు ఆదేశాన్ని ధిక్కరించేలా సవాల్ విసురుతోంది.

**కుట్రను బయటపెట్టిన కాగ్**

ఒక పక్క రాజధాని కోసం ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రారంభం కాగా దానిని అణచివేయాలను కుంటున్నది ప్రపంచంలోనే ఒక్క వైసీపీ ప్రభుత్వమే. అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందడం వైసీపీ ప్రభుత్వానికి ఇష్టం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను ఎలాగైనా నిలిపివేసేందుకు చేస్తున్న ప్రయత్నం ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇలాంటి ప్రభుత్వాన్ని ఏ రాజనీతి సిద్ధాంతంలోనూ వివరించ లేదని పేర్కొంటున్నారు. రాజధాని అమరావతిని రాష్ట్ర ప్రభుత్వం ఎలా దెబ్బతీసిందో భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదిక ద్వారా బయటపెట్టడం ప్రపంచానికి తెలిసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజధాని పనుల్ని నిలిపివేయడంతో.. అప్పటికే అక్కడ మౌలిక వసతులపై ఖర్చుపెట్టిన రూ. వేల కోట్లు వృథా అయినట్టు తెలిపింది. రాజధాని నిర్మాణానికి సాయం చేయాలని కేంద్రాన్ని వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా అడగలేదు సరికదా, గత ప్రభుత్వ హయాంలో పంపిన డీపీఆర్‌లలో కొన్ని సవరణలు చేసి పంపాలని కేంద్రప్రభుత్వం 2019 మేలో సూచించినా స్పందించ లేదు. చివరకు నీతి ఆయోగ్ గుర్తుచేస్తే 2022 జూన్ స్పందించింది.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాజధాని నిర్మా ణానికి కేంద్రం నుంచి తదుపరి సాయం అందలేదని

టీఎన్ భూషణ్



# స్వపక్షంలోనే విముఖత

కాగ్ పేర్కొంది. భూ సమీకరణ కోసం చేసిన రూ.వేల కోట్ల ఖర్చు నిరుపయోగంగా మారిందని, ఇప్పటికే వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నిష్ఫలంగా మారాయని పేర్కొంది. రాజధానికి అవసరమైన భూమిలో 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రానున్న కాలంలో భారీ ఆర్థిక భారం పడనుందని పేర్కొంది. 2019 నుంచి నిర్ణయించిన ప్రణాళిక కోసం కనీసం బడ్జెట్ సహకారం అందించేందుకు కూడా ప్రయత్నం జరగలేదని పేర్కొంది. రూ.33,476 కోట్లు రుణంగా సమీకరించుకోవాల్సి ఉండగా, కేవలం రూ. 8,540 కోట్లు మాత్రమే సమీకరించుకున్నారని పేర్కొంది. రాజధాని నగర అభివృద్ధిపై తయారుచేసిన 55 ప్యాకేజి పనులు పూర్తి చేసేందుకు రూ.28,048 కోట్లు కావాలని, వీటి భూసమీకరణకు రూ. 2,245 కోట్లు సీఆర్‌డీఏ వ్యయం చేసిందని, ఇలా సేకరించిన భూమి అంతా నిరుపయోగంగా పడిఉందని వివరించింది.

**విశాఖపై అవ్యాజ ప్రేమ ఎందుకు?**

విశాల సముద్ర తీర ప్రాంతం, సహజసిద్ధ ప్రకృతి అందాలతో పాటు ఖనిజ వనరులు అపారంగా ఉన్నందునే విశాఖపై వైసీపీ నాయత్వానికి అవ్యాజ ప్రేమ ఏర్పడిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. పాలనా రాజధాని నిర్ణయం వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉందని విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పెద్దలు, వైసీపీ ముఖ్యనేతల బినామీలు విశాఖలో తిష్ఠ వేశారని ప్రచారం జరుగుతోంది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఆయన కుమార్తె, అల్లుడు అక్కడ భూములు కొనుగోలు చేశారని, హోటల్ వ్యాపారం ప్రారంభించారని అంటున్నారు. విజయసాయిరెడ్డి కుమార్తె విశాఖలో డీమ్డ్ వర్సిటీని స్థాపించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. వైసీపీ కీలక నేతలంతా నగరం చుట్టుపక్కల స్థిరాస్తులు సంపాదించారని జనం బాహాటంగానే అంటున్నారు. విశాఖ తమకు సంపన్న గనిగా మారుతున్న నేపథ్యంలోనే పరిపాలనా రాజధానిని చేసి విశాఖకు తరలిపోయేందుకు వైసీపీ అధినేత తహతహలాడుతున్నారని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇక విశాఖవాసులు మాత్రం నాలుగేళ్లుగా కబ్జాలు, ఇళ్ల విధ్వంసంతో బెంబేలెత్తు తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన అంటేనే హడలి పోతున్నారు. ఎక్కడికక్కడ రోడ్లు మూసివేత, ట్రాఫిక్ ఆంక్షలతో సతమతమవు తున్నారు.

**వైసీపీలో ఆందోళన**

విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం సందర్భంగా సీఎం చేసిన కీలక వ్యాఖ్యలు అధికార పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కోర్టు తీర్పునకు విరుద్ధంగా పాలనా కేంద్రాన్ని మార్పు చేయడం వల్ల పార్టీకి లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల శాపాలతో విశాఖ నుంచి పాలన ప్రారంభిస్తే ఉత్తరాంధ్ర ప్రజలు మాత్రం ఎలా సంతోషిస్తారని వారు వ్యాఖ్యానిస్తున్నారు. నాలుగున్నరేళ్లపాటు అమరావతి నుంచి పాలన సాగించి ఆ ప్రాంతం ఎంత వరకు అభివృద్ధి చేసారో అందరికీ తెల్సి కూడా ఎన్నికల ముందు విశాఖకు పాలనా కేంద్రం మార్పు చేయడం వల్ల రెంటికీ చెడ్డ రేవడి కావడం తప్ప, పార్టీకి అదనంగా ఏమీ ఒరగదని నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వైసీపీ ప్రభుత్వం నిలువరించలేక పోయిందని ఉత్తరాంధ్ర ప్రజల్లో ఆగ్రహం బలంగా ఉంది.


అలాగే విభజన అంశాల్లో పొందుపర్చిన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు సాధించలేక పోయారన్న అసంతృప్తి కూడా తీవ్రంగా ఉంది. ఇక గత ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న అదానీ డేటా సెంటర్, లూలూ గ్రూపు వంటి పరిశ్రమలు రాజకీయ కక్షపూరిత చర్యలతో విశాఖ నుంచి తరలిపోయాయి. భోగాపురం విమానాశ్రయం, పురుషోత్తపట్నం ఎత్తిపోతలు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వివిధ సాగునీటి పథకాలన్నీ నిధుల లేమితో నత్తనడకన సాగు తున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా ప్రజలు ఆశించని, అవసరం లేని విశాఖ నుంచి పాలన ఎవరికి కావాలి? దానివల్ల ఎవరికి ఉపయోగమని వైసీపీ నేతల మధ్యే చర్చ జరుగుతుంది. అభివృద్ధి గురించి కాకుండా విధ్వంసం గురించి ఆలోచించే ఇలాంటి పార్టీలో కొనసాగాలా? వద్దా? అనే ఆలోచనలో కూడా కొందరున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి తదుపరి సాయం అందలేదని కాగ్ పేర్కొంది. భూ సమీకరణ కోసం చేసిన రూ.వేల కోట్ల ఖర్చు నిరుపయోగంగా మారిందని, ఇప్పటికే వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నిష్ఫలంగా మారాయని పేర్కొంది. రాజధానికి అవసరమైన భూమిలో 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రానున్న కాలంలో భారీ ఆర్థిక భారం పడనుందని పేర్కొంది.



❋ రామాయణంలోని పాత్రలు ❋



# జీవన విజ్ఞాన సర్వస్వం రామాయణం

మనం ఇంతకాలం రామాయణంలోని పాత్రలను తెలుసుకున్నాం. ఆ కావ్యాన్ని అందించిన వాల్మీకి గురించి కూడా తెలుసుకున్నాం. ఇంత చేసి వాల్మీకి రామాయణం చదవకపోతే ఏమైంది? అనుకోవద్దు. వాల్మీకం చదవకపోతే ఓ విలువల మార్గం శాశ్వతంగా మూసుకుపోతుంది. రామాయణం అంటేనే రాముడు నడిచిన దారి. మనకు ఆ దారిని చూపిన రామాయణం నిజంగానే చాలా గొప్ప కావ్యం! ఏడుకాండలు, ఐదువందల అధ్యాయాలు, ఇరవై నాలుగు వేల శ్లోకాల సమాహారం.

రామాయణం పేరుకు రామకథే కానీ... నదులూ, పర్వతాలూ, అడవులూ, వివిధ దేశాలూ, అనేకానేక లోకాలూ కథాక్రమంలో ప్రస్తావనకు వచ్చాయి. భిన్న జాతుల మనుషుల్నీ, వృక్షాల్నీ, పశుపక్ష్యాదుల్ని పరిచయం చేశాడు వాల్మీకి. ఎంతోమంది రాజులు తారసపడతారు. వారి వంశాలూ తెలుస్తాయి. అలా రామాయణంలో చరిత్ర ఉంది, భూగోళం ఉంది, జీవ జంతుశాస్త్రాలు ఉన్నాయి. ఇక మంచిచెడుల విషయానికొస్తే ఇది అచ్చమైన విలువల వాచకం. యుద్ధ వ్యూహాలూ ఉన్నాయి. వాటిని నేటి రాజకీయాలకు, 'పొలిటికల్ సైన్స్'కో, 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్'కో అన్వయించుకోవచ్చు. మొత్తంగా రామాయణం సమగ్ర విజ్ఞాన సర్వస్వం!

వాల్మీకి మహర్షి రామాయణాన్ని రావణ సంహారానికో, శ్రీరామపట్టాభిషేకానికో పరిమితం చేయలేదు. సకల వేదాల సారాన్నీ, ఉపనిషత్తుల రహస్యాల్నీ ఒదుపుగా ఇమిడ్చాడు. వ్యక్తిధర్మం, రాజధర్మం, పుత్రధర్మం... అన్నింటికీ మించి మానవ ధర్మం – రామకథలో అంతర్లీనం. క్షణికమైన మోహాలూ, పైపై మెరుగులూ జీవితాల్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తాయో హృదయాలకు హత్తుకునేలా వివరించాడు వాల్మీకి. ఎంతో విజ్ఞురాలై కూడా బంగారు వన్నెతో మెరిసిపోతున్న లేడిని చూడగానే సీత

ఆధ్యాత్మికం

# రుచితో పాటు ఆరోగ్యదాయిని 'చిక్కుడు'

❋ పెరటి బంగారం ❋

పెరటి బంగారంలో ప్రముఖంగా పేర్కొనవలసింది చిక్కుడుకాయ. ఒకసారి విత్తనం నాటి ఇంటిపైకి పాకిచ్చామంటే చాలు... శీతకాలంలో విరివిగా కాపు కాసి ఇంటిల్లిపాదికీ కూరను ఇస్తుంది. ఇంపుగా కనిపించే ఈ కాయలను రకరకాలుగా వండుకోవచ్చు. కణుపు చిక్కుడుకాయ రుచిలోనే కాదు శరీరానికి పోషకాలను అందించడంలో కూడా ప్రముఖ పాత్ర వహిస్తుంది. దీనిలో ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్ వంటి ఖనిజాలు, విటమిన్ సి ఉంటుంది. ముఖ్యంగా వీటి ల్లోని యాంటీ ఆక్సిడెంట్లు హృద్రోగాలు, క్యాన్సర్లు... వంటి వాటిని దూరం చేస్తాయి.



చిక్కుడు కాయల్ని వంకాయలతో, టమోటాతో కలిపి తీసుకోవచ్చు. వీటి వల్ల జీర్ణసమస్యలు, డయేరియా వంటివి తగ్గడంతో పాటు మధుమేహం, కొలస్ట్రాల్ వంటివి తగ్గుముఖం పడతాయి. బరువు తగ్గాలనుకునేవారికి ఇవి మంచి ఔషధంలా పని చేస్తాయి. వీటిని తినడం వల్ల ఆకలి బాగా తగ్గుతుంది. వీటిలోని విటమిన్ బి1 మెదడు పనితీరులో అత్యంత కీలకమైన ఎసిటైల్ కోలీన్ అనే న్యూరో ట్రాన్స్ మిటర్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. విటమిన్ బి1 గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

**దోర్బల పూర్ణిమాస్వాతి**

మనసు వశం తప్పింది. ఆ మాయలేడిని కోరి కష్టాలు తెచ్చుకుంది. మహా పండితుడైన రావణుడు సైతం బంగరు బొమ్మలా ఉన్న సీతమ్మను చూసీ చూడగానే మనసు పారేసుకున్నాడు, మోహావేశానికి గురయ్యాడు. నిభాయించుకోలేని ఓ చిన్న బలహీనతే సీతను రాముడికి దూరం చేసింది, రావణుడిని ధర్మానికి దూరం చేసిందని సరిపోలుస్తాడు వాల్మీకి. నేటికాలపు అమాయక సీతమ్మలకూ, దురహంకారులైన దశ కంఠులకూ పరోక్షంగా హెచ్చరిక చేశాడు. 'తీయని మాటలు చెప్పేవాళ్లు ఎక్కడైనా ఉంటారు. కఠిన వాస్తవాలు వివరించి మరీ హెచ్చరించేవాళ్లు చాలా అరుదు. దయచేసి సమస్య తీవ్రతను అర్థం చేసుకో' అంటూ జరగబోయే తీవ్ర పరిణామాల్ని తోడబుట్టిన విభీషణుడు, ఇల్లాలు మండోదరి, ఆహారనిద్ర ప్రియుడైన పెద్ద తమ్ముడు కుంభకర్ణుడు సైతం హెచ్చరిస్తారు. అయినా అహంభావి రావణుడు పట్టించుకోలేదు కాబట్టే తన పతనానికి తానే కారకుడయ్యాడంటూ విలువలను గురించి చాటి చెప్పింది రామాయణం.

రామాయణానికి పరిపూర్ణ వ్యక్తిగా మార్చే శక్తి ఉంది. ఆ స్ఫూర్తి జీవితాంతం వెన్నంటి నిలుస్తుంది. దానిని చదివి, తమకు తాము అన్వయించుకుంటే, చిన్నచిన్న కష్టాలకే ఆత్మహత్య ఆలోచనలు రావు. ఒకటి రెండు అపోహలతోనే బంధాలు బీటలువారవు. ఆస్తిపాస్తుల కోసం అన్నదమ్ములు తగవులాడరు. దశరథ తనయుడు రాముడు ఎన్ని కష్టాలు అనుభవించాడో, ఎన్ని పరీక్షలు ఎదుర్కొన్నాడో స్ఫురణకు వస్తుంది. రాముడు తనను తాను దేవుడిగా చెప్పుకోలేదు. అలా ప్రవర్తించనూ లేదు. దశరథ పుత్రుడిగానే లోకానికి పరిచయం చేసుకున్నాడు. కాకపోతే రాముడు ధర్మాన్ని నమ్మాడు, దానినే ఆచరించాడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనిపించుకున్నాడు. అదే ఆయనను దేవుడిని చేసింది. అందుకే ఆదికావ్యమైన వాల్మీకి రామాయణం లాంటి గ్రంథం ఇంకోటి లేదు. లోకంలోని వివిధ ధర్మాలు, లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించిన గ్రంథం ఎక్కడా లేదు. ఇహపరాల్లో సుఖించాలనుకునేవారికి రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం. ★

వీటిలోని కాపర్, మెదడు ఆరోగ్యానికి అవసరమైన డోపమైన్, గ్యాలక్టోజ్.. వంటి రసాయనాల విడుదలకు తోడ్పడుతుంది. ఇవి శరీరంలోని కొన్నిరకాల యాంటీ ఆక్సిడెంట్ల ఉత్పత్తికి కారణమవుతాయి. చిక్కుడు కాయలు వృద్ధాప్యం వల్ల వచ్చే అనేక వ్యాధుల్నీ నివారిస్తాయని తేలింది.

సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడులో పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నిరోధించడంలో సహాయపడతాయి. అందుకే దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి చిక్కుడు మంచి ఔషధంలా పని చేస్తుంది. నిద్రలేమితో బాధపడేవాళ్లకీ చిక్కుడుకాయల్లో లభించే మాంగనీస్ ఉపశమనం కలిగిస్తుంది. వీటిలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి ఎంతగానో దోహదపడతాయి. ముఖ్యంగా మానసిక ఆందోళనను తగ్గిస్తాయి. అలాగే వీటిల్లోని పొటాషియం కండరాల వృద్ధికి, పని తీరుకి తోడ్పడుతుంది.

చిక్కుడు కాయతో ఊరగాయ కూడా పెట్టుకోవచ్చు. ఉట్టి చిక్కుడు గింజలని ఉడకబెట్టి లేదా వేయించి ఉప్పుకారం చల్లుకుని తినవచ్చు. ఏ విధంగా తిన్నా సరే, మనకు ఎంతో ఇష్టమైన చిక్కుడుకాయ మనకు తెలియకుండానే ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ★

❊ తాత్వి'కత' ❊

# హైరానా కాదు... ఆలోచన ప్రధానం



ఒక మత్స్యకారుడు ప్రతి రోజూ సముద్రంలో చేపలు పట్టి, వాటిని విక్రయించిన డబ్బుతో కుటుంబం నడిపేవాడు. కానీ ఎంత కష్టపడినా జీవితంలో అతనికి ఆనందం లేకుండా పోతోంది.

ఒకరోజు అతను ఒక యువకుడిని కలిసి, పరిచయం పెంచుకున్నాడు. అతని ఆదాయం, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నాడు. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నా అతనెప్పుడూ నవ్వుతూ పలకరించేవాడు.

ఓరోజు రాత్రి మత్స్యకారుడికి నిద్రపట్టలేదు. అతను తన మిత్రుడి గురించి ఆలోచించాడు. 'మిత్రుడికి ఆదాయం తక్కువ. సమస్యలు ఎక్కువ. కానీ అతను సంతోషంగా ఉన్నాడు. అతనెప్పుడూ ఆందోళనపడుతున్నట్లు కనిపించేవాడు కాదు' అనుకున్నాడు. అతనికిది ఎలా సాధ్యమైంది అనే సందేహం ఆ జాలరిని సతమతం చేయసాగింది. ఈ నేపథ్యంలో ఓమారు ఆ ఊరికి ఒక సన్యాసి వచ్చాడు. తనను కలిసిన గ్రామస్తుల సమస్యలకు ఆయన పరిష్కారం చెప్తున్నట్లు తెలుసుకున్న మత్స్యకారుడు కూడా ఆయనకు తన కష్టాన్నంతా వివరించి, సలహా కోరాడు.

సన్యాసి ఒక చిరునవ్వు నవ్వాడు. దీంతో జాలరికి కోపం వచ్చింది.

'ఏంటీ నువ్వేదో దారి చూపించి సమస్యను పరిష్కరిస్తావనుకుంటే ఏమీ చెప్పకుండా నవ్వుతున్నావు?' అన్నాడు.

'రేపు రా' అన్నాడు సన్యాసి. మరుసటి రోజు జాలరి సన్యాసి దగ్గరకు వెళ్లాడు.

సన్యాసి అతనిని చూడగానే ఓ చిన్న నవ్వు నవ్వాడు.

అయితే ఈసారి జాలరి కోపం తెచ్చుకోకుండా ధైర్యాన్ని తృప్తి కూడగట్టుకుని "అయ్యా... నా సమస్యలు చెప్పాను. మీరు పరిష్కారం చెప్పకుండా నవ్వుతున్నారేంటీ. దీని అర్థం ఏమిటి?" అడిగాడు.

అప్పుడు ఆ సన్యాసి "నువ్వు నీ ఆదాయాన్ని తక్కువగా అంచనా వేసుకున్నావు. కానీ అదే సమయంలో నువ్వు నీకు వచ్చే సమస్యలను భూతద్దంలో చూసి ఎక్కువగా ఆలోచిస్తున్నావు. నిజానికి ప్రపంచంలో సమస్యలు లేని మనుషులంటూ ఉండరు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. అయితే తమకొచ్చిన ఆదాయమే చాలనుకునేవారున్నారు. ఉన్నదానితోనే తృప్తిగా జీవించేవారే మంచివారు. నిలకడైన వారు. కానీ కోరికలు ఉండటం తప్పు కాదు. కానీ మనకెంత వస్తోంది' అని ఆలోచించాలి. ఆశే అత్యాశ గానో దురాశగానో మారితేనే ప్రమాదం. అప్పుడు ఎంత గడించినా సరిపోదు. దాంతో 'నాకే ఎందుకు ఇన్ని కష్టాలు వస్తున్నాయ'ని బాధపడతారు. సమస్యలు మనస్సును ఆక్రమిస్తే అందులోంచి బయటపడే మార్గాన్ని చూసుకోవాలి. అలాకాక అందులోనే ఉండిపోతే ప్రతి చిన్నవాటికీ డీలాపడి హైరానపడి నవ్వడం మరచిపోతారు. నాకు అటువంటి వారి విషయం గుర్తుకు వచ్చింది. దాంతో నవ్వొచ్చింది. అంతే తప్ప నిన్ను హేళన చేయడానికి కాదు. ఏ సమస్య వచ్చినా చిరునవ్వుతో దానిని దాటడానికి ప్రయత్నించడం అలవరచుకో. అప్పుడు ఈ జీవితం అందంగా అనిపిస్తుంది" అన్నాడు.

దాంతో జాలరి మనసు తేలికపడింది. చిరునవ్వుతో సన్యాసికి నమస్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ★

అమ్మా-నాన్నలు కలిసి రావటం చూసింది స్వప్న.

అదే ఉద్వేగం. శ్రీనివాస్ కొద్దిసేపు తేరుకోలేక పోయాడు. గోవింద్‌ని పలకరించినా అతనిలో అపరాధ భావన వుంది. ఇంతకు ముందు జరిగిన గొడవ గుర్తుకు వస్తోంది.

"అమ్మా-నాన్నలను విడాకులు తీసుకోమని నేనేనా బలవంతం చేశాను" అని స్వప్న కుళ్లికుళ్లి ఏడుస్తోంది.

"ఎందుకురా... ఎందుకింత దుఃఖం. అవన్నీ నిన్నటి రోజులు" అంటూ గోవింద్ ఓదార్చుతున్నాడు.

రాజేశ్వరి శ్వేతను దగ్గరికి తీసుకుంది.

"తీర్థయాత్రలు మంచివే. కానీ అంతకు మించిన ఆనందం, తృప్తి అందరూ కలవటంలో వుందని నీకూ, ఆద్యకు ఎలా తెలిసిందే" అంటోంది చెవిలో.

* * *

రామకృష్ణ వసుంధరకీ, రమేష్ కి ఫోన్ చేసాడు.

''మన సరయూ, రసజ్ఞలు మనందరం కలుసుకుంటున్న సందర్భాన్ని గ్రాండ్‌గా చేసుకుందాం అన్నారు. అది విజయవాడలో జరుగుతోంది. మీరు తప్పకుండా రావాలి. మీ నాన్న ఇంకెంత కాలం వుంటాడో తెలియదు. ఒక్కసారి చూడాలని వుంది. ఎప్పుడెప్పుడు చూస్తానా అన్న ఆత్రుత వుంది. అమ్మ మాట్లాడు తుంది" అని తులసికి యిచ్చాడు.

"మీ కోసం అందరం ఎదురు చూస్తుంటాం" అందామె. తర్వాత భువనేశ్వరి-ప్రభాత్‌లతో ఇద్దరూ మాట్లాడారు.

* * *

అలా ఆ కుటుంబాల మహా కలయిక మహోత్సవం ప్రారంభం అయింది. రసజ్ఞ-సరయూ వచ్చిన దగ్గర్నుండి ఆద్య-శ్వేతలను వదలటం లేదు. అన్నింటా ఆ నలుగురే!

కబుర్లే కబుర్లు. ప్రెస్‌ని చూస్తున్నారు. అక్కడ పని చేస్తున్న వారందరితో మాట్లాడుతున్నారు.

స్వప్న, అఖిలలు హారికనీ, భువనేశ్వరిని పరిచయం చేసుకున్నారు. ఆదర్శ్, రిత్విక్, శ్రీనివాస్‌లు కలుపుగోలుగా మాట్లాడుకుంటున్నారు.

కృష్ణదాస్ ఒంటరిగానే వచ్చాడు.

విశ్వం ఆలస్యంగా వచ్చాడు.



ఎండిపై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

24



# మహా సంకల్పం








పి. చంద్రశేఖర ఆజాద్

9246573575


“ఒక్కడివే వచ్చావేంటి విశ్వం” అన్నాడు గోవింద్.

“మా అమ్మాయి స్వామీజీ దగ్గరకు వెళ్లింది. నా భార్య ఆరోగ్యం బాగుండలేదు. మా అబ్బాయి చనిపోయిన దగ్గర్నుండి ఇంతవరకు కోలుకోలేదు గోవింద్” అన్నాడాయన.

రామకృష్ణతో రాహుల్ ఏదో మాట్లాడుతున్నాడు.

తులసి కళ్లు మాత్రం వసుంధర, రమేష్‌ల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రభాత్ గోవింద్‌తో ఏదో చెబుతున్నాడు.

అప్పుడు రామకృష్ణ తులసి దగ్గరకు వచ్చాడు.

ఆమె ముఖంలో గూడు కట్టుకున్న దిగులుని గమనించాడు.

అప్పుడు సరయూ పక్కకి వచ్చింది.

అమ్మకి, నాన్నకి ఫోన్ చేస్తూనే వుంది.

స్విచ్ఛాఫ్!

తన కళ్లు చిన్నవిగా మారుతున్నాయి.

గోవింద్ దూరం నుండి అన్నీ గమనిస్తున్నాడు.

కార్యక్రమం మొదలయింది.

నలుగురు యువతులు అమ్మమ్మల్నీ-తాతల్నీ ఘనంగా సన్మానించుకున్నారు.

భోజనాలు మొదలయ్యాయి.

తులసి భోజనం చేయలేదు.

వసుంధర, రమేష్‌ల కోసం చూస్తూనే వుంది.

రాత్రి కరుగుతూనే వుంది.

* * *

రామకృష్ణ-రిత్విక్‌లు ఎదురెదురుగా వున్నారు.

ఆయన దీర్ఘమైన ఆలోచనలో వున్నాడు. అతని ముఖంలో బాధ వుందా?

ఇన్ని సంవత్సరాల జీవితానుభవం నుండి వచ్చిన ఓ పరిణతి తాలూకు ప్రకంపనలు వున్నాయా అనే విశ్లేషణలో రిత్విక్ వున్నాడు.

ఆయన అప్పుడు మాట్లాడటం మొదలు పెట్టాడు.

“జీవితం ఎప్పుడూ ఓ అసంపూర్ణ కావ్యమే అనుకుంటాను రిత్విక్” అన్నాడు.

“అవును సర్. కాలం మనకు తెలియకుండానే కదులుతుంటుంది. మనం నిశ్శబ్దం గురించి మాట్లాడుతుంటాం. నిజానికి మనం గ్రహించలేం గాని ప్రకృతిలో నిశ్శబ్దం అంటూ వుండదు. అది నిరంతరం శబ్దాల్తో వుంటుంది. నిశ్శబ్దం అనేది ఓ మానసికస్థితి. అది మనసు కలిగించే ఓ భ్రమ, వాస్తవం. అయితే కాలాన్ని మించిన నిశ్శబ్దం ఇంకోటి వుంటుందా అనిపిస్తుంటుంది”.

ఆయన తలూపాడు.

“మనం ప్రపంచాన్ని జయించగలం రిత్విక్. కుటుంబాన్ని కాదు. అది ప్రతి మనిషికీ ఏదోక రోజు అనుభవంలోకి వస్తుంది. అందుకే అలెగ్జాండర్ నుండి ఎవరు జీవితం చూసినా మనకు కొన్ని పాఠాలు తెలుస్తాయి. ఇప్పుడు నాకు చాలా మాట్లాడాలని వుంది. నాకు అర్థం అయింది ఒకటే... మనం మనుషుల్ని మార్చగలం అనుకోవటంలో తాత్కాలిక తృప్తి మాత్రమే వుంది. మనం విజయం ఇచ్చే మత్తులో వుంటాం. మన పక్కనే వైఫల్యం వుంటుంది. అది మనం దృష్టిలోకి తీసుకోం”.

“అవును సర్”.

“అందుకే ఈ ప్రపంచంలో ఇన్ని రకాల సిద్ధాంతాలు. తత్వాలు మనం బతుకుతున్న తీరు. చిన్నప్పటి నుంచి నేను పుష్కరాలను చూసాను. పవిత్ర సంగమాలను చూసాను. పెళ్లిళ్లు, ఎడబాట్లు, మృత్యువు, ఇలా ఎన్నో, ఎన్నెన్నో... అందరం కలవాలనుకుంటాం. ఎవరో ఒకరు మిస్ అవుతుంటారు. తిరిగి ఓ కొత్త ఆలోచన. ఓ కొత్త ముగింపు. ఓ కొత్త ప్రారంభం. ఇప్పుడు నదుల్ని అనుసంధానం చేస్తామంటున్నారు. అందుకు కావలసింది డబ్బు మాత్రమే కాదు. అందుకే కొన్ని పూర్తి కావటానికి దీర్ఘకాలం పడుతుంది. అదే అవసరం అయితే కొన్ని నెలల్లోనే పూర్తి అవుతాయి. నేను నా పిల్లల గురించి మాట్లాడటం లేదు. ప్రపంచపోకడ గురించి మాట్లాడుతున్నాను”.

రిత్విక్ తలూపాడు.

“నిధి చాల సుఖమా-దేవుని సన్నిధా అంటారు. అలాగే దేవుడ్ని నమ్మని వారుంటారు. వారికి కూడా ఇలాంటి సంశయాలు వస్తుంటాయి. ఏది సరైనది. ఏది శాశ్వతం అనేది తేల్చుకోవటం కష్టంగా వుంటుంది”.

“అవును సర్”.

"అవన్నీ వదిలేద్దాం. నేను నా కథని చెప్పాలి. అందుకని వారానికి రెండు రోజులు నాకు ఇవ్వు. అవసరం అనుకుంటే నీ దగ్గరికి నేను వస్తాను. అలాగే నువ్వు వద్దువు గాని. మనం కాస్త ఆలస్యంగా కొన్ని పనులు చేస్తున్నాం. మనం అనుకున్న పత్రికని రెగ్యులర్‌గా తీసుకురాలేకపోవచ్చు. సంవత్సరానికి రెండు ఎడిషన్లు రావాలి. అది కొనసాగాలి. అలాంటి ఏర్పాట్లు చేద్దాం. ఈ ప్రపంచానికి ఏదో చేయాలని తాపత్రయపడుతుంటాం. అది తప్పు కాదు. ఎవరో ఒకరు నిరంతరం ఏదొకటి మాట్లాడుతుండాలి. ఏదొకటి చేయాలి. మనదయినది అంటూ వుండదు. అలా అని లేకుండాను పోదు. మనుషులు ఏదో ఒక పాయింట్ దగ్గర ఆగుతారు. కాలం మాత్రం కాదు. అది కూడా ఎక్కడో ఓ చోట తాత్కాలికంగా ఆగుతుంది. ఆగాలి".

రిత్విక్ తలూపుతున్నాడు.

"కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుందాం. తిరిగి మనం పని మొదలు పెడదాం. ఈలోగా నీ పనులు పూర్తి చేసుకుంటూ వుండు".

"అలాగే సర్. నేను ఒకటి అడుగుతాను".

ఆయన చిన్నగా తలూపారు.

"మీ అమ్మాయి వసుంధర, రమేష్ గార్లని మీరు కలుస్తున్నారా?"

ఆయన మౌనంగా వుండిపోయారు కొంతసేపు. ఆ తర్వాత...

"కలవాలని లేదు. కలవకూడదని లేదు. వసుంధర నా కూతురు. తనని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావటానికి ఇద్దరు మనవరాళ్లు ప్రయత్నం చేస్తారు. వారితో నేనూ, తులసి వుంటాం. పిల్లలు వారి మనసుని గెలుస్తారా అంటే ఏమో. వారి జీవితం పూర్తికాలేదు. ఉద్వేగపూరితమైన సంఘటనలు అప్పుడప్పుడు వస్తాయి. మనం ఎప్పుడూ మనుషులు

"ఏదొక రోజు నేను విరమించాలి. ఎప్పుడు చేయవలసిన పని అప్పుడు చేయాలి. నా శ్రీమతి ఆరోగ్యం అంతంత మాత్రాన వుంది. అందుకే నేను పూర్తి చేయవలసిన మా విషాదకావ్యం ఆమె బతికి వుండగానే తనకు చూపించాలి. ఒక్క నెలలో పుస్తకం తయారు కావాలి. నువ్వు సహకరించాలి రిత్విక్".
"తప్పకుండా" అన్నాడు రిత్విక్.



మారతారనే ఆశతో వుంటాం. అందరికీ మంచి జరుగుతుందనుకుంటాం. అలాంటి ఆశతోనే ఎవరయినా ప్రయాణం చేస్తారు".

"నిజమే రామకృష్ణ గారూ... నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు రిత్విక్.

* * *

గోవింద్ బుద్ధ అడిగాడు రిత్విక్‌ని.

"నీకు అప్పచెప్పిన పని ఆరంభంలో వుంది. మా కథకు ఇలాంటి ముగింపు వుంటుందని నేను అనుకోలేదు. ఇప్పుడు నాకు దిగులు లేదు. ఆద్య, స్వప్నలు నా కలల్ని కొనసాగిస్తారు అని నమ్మకం కలుగుతోంది. ఇక నుండి నువ్వు నీ ప్రపంచంలోకి వెళ్లు. ఏం రాస్తావో నీ ఇష్టం. నేను నిన్ను తిరస్కరించవచ్చు. ఆద్య అలాంటి పని చేస్తుందని నేను అనుకోను".

"ఈ అనుభవం తర్వాత నాలోనూ మార్పు వచ్చింది సర్. ఇప్పుడు ఏం రాయాలో నాకు మరింత స్పష్టంగా అర్థం అవుతోంది. మనం తరచుగా కలుస్తూనే వుంటాం. ఇది మరో ఆరంభం" అన్నాడు రిత్విక్.

* * *

విశ్వం రిత్విక్ ఇంటికి వచ్చాడు.

"మీరు కబురు చేస్తే నేను వచ్చేవాడినిగా విశ్వంగారూ" అన్నాడు.

"మనం పది రోజులు ఈ పోటీ ప్రపంచానికి దూరంగా వెళ్తున్నాం రిత్విక్. ఇక్కడ ఫోన్లుండవు. ఎవరూ మనల్ని డిస్ట్రబ్ చేయరు. చుట్టూ కొండలు, సెలయేర్ల మధ్య మనం వుంటాం".

"మిమ్మల్ని సినిమా వారు వదులుతారా? ఎక్కడున్నా వెతికి పట్టుకుంటారు" నవ్వుతూ అన్నాడు రిత్విక్.

"నేను జ్వరం వచ్చి హాస్పటల్‌లో చేరితే ఏం చేస్తారు?"

భుజాలెగరేశాడు రిత్విక్.

"ఏదొక రోజు నేను విరమించాలి. ఎప్పుడు చేయవలసిన పని అప్పుడు చేయాలి. నా శ్రీమతి ఆరోగ్యం అంతంత మాత్రాన వుంది. అందుకే నేను పూర్తి చేయవలసిన మా విషాదకావ్యం ఆమె బతికి వుండగానే తనకు చూపించాలి. ఒక్క నెలలో పుస్తకం తయారు కావాలి. నువ్వు సహకరించాలి రిత్విక్".

"తప్పకుండా" అన్నాడు రిత్విక్.

* * *

"అప్పుడే మళ్లీ ప్రయాణమా" అంది హారిక.

"తప్పదు. ఇది అత్యవసరమైన కర్తవ్యం" అన్నాడు రిత్విక్.

"మంచిది. మనం కూడా ఇలాంటి ప్రయాణం చేస్తే బాగుంటుంది అనిపిస్తోంది"

"నిజంగానా?"

"మీకు వీలు కుదిరితే".

"తప్పకుండా" అన్నాడు రిత్విక్.

* * *

కొండల మీద గెస్ట్ హౌస్... అప్పుడే కళ్లు ఒత్తుకుంటూ రిత్విక్ బయటకు వచ్చాడు.

విశ్వం గదిలో వున్నాడు.


అతను తనని తాను నిగ్రహించుకుంటున్నాడు.

చల్లటి గాలి రిత్విక్‌ని తాకింది.

ముఖం మీద ఓ నీటి బిందువు చిట్లింది. వాన చినుకులు ఆరంభం అయ్యాయి.

రాయాలి. అలనాటి వాన చినుకుల గురించి ఓ ఆధునిక కావ్యం రాయాలి అనుకున్నాడు.

– సమాప్తం –



డి. అరుణ



# ఐరోపాను ప్రభావితం చేస్తున్న ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం

**మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్, హమాస్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం ఉధృతమవుతున్న కొద్దీ, ఆ ఉద్రిక్తతలు ఐరోపా దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. భారీ ఎత్తున ప్రదర్శనలు, తీవ్రవాద దాడులు ఐరోపా ప్రజలకు, దేశాలకు కంటినిండా కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని తొలుత బహిరంగంగా వ్యతిరేకించిన వ్యక్తి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యువల్ మాక్రాన్. మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న ఘర్షణ ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య కాదని, తీవ్రవాదులకు, ప్రజాస్వామిక విలువలు ఉన్న దేశానికి మధ్య అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు తిరుగులేని మద్దతును ప్రకటిస్తూ, ఆ దేశానికి ప్రతిస్పందించే హక్కు ఉందంటూ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులలో పదమూడు మంది ఫ్రెంచి పౌరులు మరణించగా, పిల్లలు సహా 17మంది కనిపించకుండా పోయారు. కేవలం ఫ్రాన్స్ పౌరులే కాదు, అనేక దేశాలకు చెందిన పౌరులు ఈ ఘటనలో హమాస్ ఉగ్రవాదుల చేతిలో బందీలు కావడమో లేక మరణించడమో జరిగింది.**

ఆయన తన టీవీ సందేశం ద్వారా పాలస్తీనా అనుకూల ర్యాలీలను, ప్రదర్శనలను నిషేధించారు. అంతేకాదు, హమాస్ అనేది తీవ్రవాద సంస్థ అని, అది ఇజ్రాయెల్ విధ్వంసాన్ని, మరణాన్ని కోరుకుంటోందని, ఇంకా చెప్పాలంటే, నేర, కుట్ర పూరితంగా గాజా ప్రజల మరణాన్ని కోరుకుంటోందంటూ, మాక్రాన్ 'ఎక్స్' (మాజీ ట్విట్టర్)లో పోస్ట్ చేసి, తన అభిప్రాయాన్ని సుస్పష్టం చేశారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించాలంటే, ఇజ్రాయెల్‌కు భద్రతాపరమైన హామీలు ఇవ్వడంతోపాటుగా పాలస్తీనా ప్రత్యేక రాష్ట్రాన్ని సృష్టించాలని సూచించారు.



మాక్రాన్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసి 1400 మంది ఇజ్రాయెలీల మరణానికి కారణం కావడంతో, ఇజ్రాయెలీలకు తక్షణమే ఐరోపాలో అనేక దేశాలు సంఘీ భావాన్ని ప్రకటించాయి. అంతే, కొద్ది రోజుల్లోనే వేలాది, లక్షలాదిమందితో పాలస్తీనాకు అనుకూల ర్యాలీలు ఐరోపా నగరాలలో ప్రారంభం అయ్యాయి. హమాస్ దాడులను ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ వారిపై బాంబులను వేయడం వారికి నచ్చలేదు.

వాస్తవానికి ఫ్రాన్స్‌లో అతిపెద్ద సంఖ్యలో అటు యూదులు ఇటు ముస్లింలు ఉన్నారు. పైగా గతంలోనే ఫ్రాన్స్ ఇస్లామిక్ తీవ్రవాదుల ఆగ్రహాన్ని చవి చూసింది. 2015లో ఛార్లీ హెబ్డో పత్రిక ఉదంతం తర్వాత బాటక్లాన్ కాన్సర్ట్ హాల్, నైస్ నగరంలోని చర్చిలో కత్తితో దాడులు, మరు ఏడాది అదే నగరంలో బాసిల్ డేకు వచ్చిన ప్రజాసమూహంపైకి ఒక వ్యక్తి ట్రక్కును తీసుకువెళ్లడంతో 86మంది మరణించిన ఉదంతం ఇప్పటికీ అక్కడి ప్రజల మనసుల్లో మెదులుతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే 2020లో మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన కొన్ని కార్టూన్లను విద్యార్థులకు చూపారన్న సాకుతో, ఆ అధ్యాపకుడిని నడివీధిలో దారుణంగా ఇస్లామిక్ తీవ్రవాదులు హత్య చేయడాన్ని పరాకాష్టగా భావించిన ఫ్రాన్స్, ఇస్లామిక్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా చట్టాన్ని ప్రవేశపెట్టి, దీనిద్వారా మసీదులకు నిధులు అందకుండా చేయడంతో పాటుగా మితవాదులకు భద్రతను కల్పించేందుకు కూడా చర్యలు తీసుకున్నది. ఈ రకంగా ఇస్లామిక్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఐరోపాలో నడుం కట్టింది ఫ్రాన్సే. ఈ క్రమంలోనే హమాస్‌ను తీవ్రవాద సంస్థగా మాక్రాన్ పేర్కొన్నారు.

లండన్, ప్యారిస్, మాడ్రిడ్, రోమ్ వంటి నగరాలలో భారీ ఎత్తున ర్యాలీలు జరుగుతున్నాయి. ఫ్రాన్స్‌లో అయితే లువర్ మ్యూజియం, వివిధ

విమానాశ్రయాల వద్ద ప్రదర్శనలను జరుపుతున్న ఉద్యమకారులను ఫ్రాన్స్ భద్రతా దళాలు బలవంతంగా ఖాళీ చేయించవలసి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఫ్రాన్స్ దేశవ్యాప్తంగా 582 మతపరమైన, సాంస్కృతిక కేంద్రాలకు భద్రతను పెంచవలసి వచ్చింది.

హమాస్ మాజీ నాయకుడు ఒకరు ఆగ్రహాన్ని/ ఉద్వేగాన్ని (డే ఆఫ్ రేజ్) దినాన్ని పాటించాలంటూ ప్రకటించినప్పటి నుంచీ ఐరోపా వ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పిలుపివ్వడంతో, ఫ్రాన్స్, జర్మనీ ఇరు దేశాలూ కూడా పాలస్తీనా అనుకూల ప్రదర్శనలను నిషేధించాయి. ప్రదర్శనలలో అతిపెద్దది లండన్‌లో జరుగగా, ఆ సందర్భంగా ఏర్పడిన ఘర్షణలలో 15మంది వ్యక్తులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఫ్రాన్సులో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలను నిషేధించినప్పటికీ, కోర్టులు ఆ నిషేధాన్ని సమర్థించినప్పటికీ ఉద్యమకారులు మాత్రం వెనక్కి తగ్గేదేలేదంటున్నారు. ఈ ర్యాలీలు ఇప్పుడప్పుడే చల్లారవని విశ్లేషకులు భావిస్తున్నారు.




**ఫ్రాన్స్, బెల్జియం సహా పలుదేశాలలో తీవ్రవాద దాడులు**

ఈ వారంలో ఫ్రాన్స్‌లోనూ, బెల్జియంలోనూ తీవ్రవాద దాడులు జరుగడంతో ఇరు దేశాలూ గరిష్ఠ స్థాయిలో అప్రమత్తతను ప్రకటించాయి. ఉత్తర ఫ్రాన్స్‌లో ముస్లిం వ్యక్తిగా చెప్తున్న ఒకరు పాఠశాలలోకి ప్రవేశించి అక్కడ ఒక టీచర్‌ను పొడిచి చంపడమే కాకుండా, అనేకులపై దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనను ప్రజలు మరువకుండానే, బెల్జియం–స్వీడన్‌ల మధ్య జరుగుతున్న ఫుట్‌బాల్ మ్యాచ్ చూసేందుకు బ్రుస్సెల్స్ వచ్చిన ఇద్దరు స్వీడిష్ జాతీయులను ఒక ఉగ్రవాది తుపాకీతో కాల్చి చంపాడు. దీనితో మ్యాచ్‌ను నిలిపివేయవలసి వచ్చింది. ఈ ఉదంతం కారణంగానే బ్రుస్సెల్స్ న్యాయశాఖ మంత్రి విన్సెంట్ వాన్ క్వికెన్‌బార్న్ రాజీనామా చేయవలసి వచ్చింది. నిందితుడికి అక్కడ ఆశ్రయాన్ని కల్పించేందుకు నిరాకరించినప్పటికీ, అతడు అక్కడే కొనసాగుతూ ఈ ఘటనకి పాల్పడడం వారికి మింగుడు పడని విషయంగా మారింది.

జర్మనీ కూడా హమాస్ అనుకూల ప్రదర్శనలను నిషేధించింది. జర్మనీ అధ్యక్షుడు షోల్జ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, హత్యలను, మానవ హననాన్ని కొనియాడే సంకేతాలు, పదాలు వాడడం, ఇజ్రాయెలీ జెండాను కాల్చి వేయడాన్ని కూడా నిషేధించారు. అలా ఎవరైనా చేస్తూ పట్టుబడితే వారిని శిక్షించడం జరుగుతుందని కూడా ఆయన హెచ్చరించారు. ఈ ప్రకటన చేస్తున్న సందర్భంగానే, గతంలో ఆరు మిలియన్లమంది యూదుల హననంలో తాము వహించిన పాత్రకు నిర్దిష్టమైన బాధ్యత వహించవలసిన అవసరాన్ని కూడా షోల్జ్ పట్టిచూపారు.

ఐరోపాలో జరుగుతున్న దాడులకు ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణతో సంబంధం లేనప్పటికీ, భవిష్యత్తులో దాడులకు ఈ ఉద్వేగపరమైన అంశమే కారణం కావచ్చని విశ్లేషకులు అంటున్నారు. పైగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ ప్రపంచ వ్యాప్తంగా ద్వేషపూరిత నేరాలు (హేట్ క్రైమ్స్) పెరిగాయని నివేదికలు చెప్తున్నాయి.

**పాశ్చాత్య దేశాల వలస విధాన ప్రభావమేనా కారణం?**

ఉదారవాదం పేరుతో అన్నిరకాల సైద్ధాంతిక స్రవంతులను (మితవాదం లేదా రైటిస్టులను మినహా) ప్రోత్సహిస్తాం, కనుక మేం ప్రగతిశీలురం అని భావించిన ఐరోపా దేశాలు ఇప్పుడు కళ్లు తెరుస్తున్నట్టు కనిపిస్తోంది. అన్నింటినీ మించిన ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న ఈ దేశాల పరిస్థితి మింగలేక కక్కలేక అన్నట్టు ఉంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అంతో ఇంతో ప్రత్యక్షంగా వేలెత్తి చూపేందుకు ఈ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అసలు ఈ ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు ఇలా పెరిగి, వేళ్లూనుకోవడానికి ప్రధాన కారణం అమెరికా, ఈ పాశ్చాత్య దేశాలే అని విమర్శించే వాళ్ల మాటల్లో వాస్తవం లేకపోలేదు.

ఇరాక్, సిరియా, లిబియా, ఆఫ్ఘనిస్తాన్.. ఇలా తమ స్వార్థం కోసం ఆ దేశాలపై దాడులు అమెరికా చేసుకుంటూ పోవడం, దానికి నాటో పేరుతో ఐరోపా దేశాలు సహకరించడంతో, తమ దేశాలలో ఏర్పడిన అరాచక పరిస్థితుల కారణంగా అక్కడి నుంచి ప్రజలు ఆశ్రయాన్ని వెతుక్కుంటూ మరొక దేశానికి వెళ్లడం వంటివి జరుగుతున్నాయి. ఈ రకంగా వచ్చిన వారికి ఆశ్రయం ఇవ్వడమనేది మొదటగా జర్మనీ మొదలుపెట్టగా, ఇతర దేశాలు దానిని అనుసరించి, ఇప్పుడు ఫలితాన్ని అనుభవిస్తున్నాయి. తమకు, తమ పిల్లలకు మంచి జీవితాన్ని కోరుకుని పశ్చిమ దేశాలకు చేరుకుంటున్నామని చెప్తున్న వారిలో 99శాతం ఇస్లామిక్ ప్రజలు మళ్లీ తమదైన రొంపిలోకి దిగిపోతున్నారుట. తమ మతపరమైన నమ్మకాల కారణంగా, ఇతరులను శత్రువులుగా భావించడం వల్లనే వారూ ఆ దేశాలలో ఇమడలేక పోతున్నారని, ఇతరులు కూడా వారిని కలుపుకోలేక పోతున్నారని కొన్ని అధ్యయన సంస్థలు చెప్తున్నాయి. అందులో నిజం లేకపోలేదు, ఈ ప్రపంచాన్ని మొత్తాన్నీ ముస్లింమయం చేయాలన్నది అతివాద ఇస్లామిస్టుల ప్రయత్నం. అందుకే, వారు అల్పసంఖ్యలో ఉన్నప్పుడు ఎంతో వినయంగానూ, తమ సంఖ్య పెరిగీ పెరగగానే తిరుగుబాట్లకు పాల్పడుతుంటారు. ఈ వైఖరి ఒక్కదేశానికి పరిమిత మైంది కాదు. లండన్‌లో గత ఏడాది కాలంలో జరిగిన ఘటనలను ఒక్కసారి పరికిస్తే మనకు విషయం సులువుగా అర్థమైపోతుంది. లెస్టర్‌లో జరిగిన ఒక్క ఘటన చాలు వారి వైఖరిని పట్టి చూపడానికి.

**యూరోపియన్ యూనియన్ చర్యలు**

ఒకవైపు రష్యాపై ఉక్రెయిన్ యుద్ధానికి నాటో సేనలను, తమ ఆయుధాలను సరఫరా చేసిన ఐరోపా దేశాలు రష్యా తీసుకున్న చర్యలతో ఇప్పటికే కుదేలయ్యాయి. అనేక దేశాలు ఆర్థికంగా క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవడం ప్రారంభం అయ్యింది. ఇప్పుడు మరో యుద్ధాన్ని సమర్థించడం అంటే అది వారి పుండు మీద వారు కారం చల్లుకున్నట్టే. అందుకే ఈ యుద్ధం ప్రభావం తమ దేశంపై ఉండకుండా ఉండేందుకు యూరోపియన్ యూనియన్ చర్యలను ప్రారంభించింది. ముఖ్యంగా బెర్లిన్‌లోని సినగాగ్‌లో బాంబుదాడి, బెల్జియం, ఫ్రాన్స్‌లలో తీవ్రవాదులు

చేసిన హత్యల కారణంగా ఆ ప్రాంతమంతా అప్రమత్తమయింది.

ప్రస్తుతం ఇయుకు రొటేటింగ్ అధ్యక్షత వహిస్తున్న స్పెయిన్ నిర్ణయాలు తీసుకోవడాన్ని, 27 దేశాల మధ్య సమన్వయ సహకారాలను వేగవంతం చేసేం దుకు తమ సంస్థలను, ఐరాస లేక యుఎస్ వంటి ప్రధాన భాగస్వాములతో సంక్షోభ నిర్వహణ విధానాన్ని సక్రియం చేసింది. యూదు వ్యతిరేక దాడులు, ఆన్‌లైన్‌లో తీవ్రవాదం, ఉగ్రవాదులు ఎన్‌క్రిప్ట్ చేసిన సందేశాలను ఉపయోగించడం పట్ల ఆందోళనను వ్యక్తం చేస్తూ, ప్రజలకు ముప్పుగా పరిణమించే వ్యక్తులను ఇయుకి చెందిన అధికారులంతా త్వరితగతిన వెనక్కి పంపే పనిని వేగవంతం చేయవలసిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

అన్ని దేశాలూ కూడా భద్రతను పెంచాలంటూ పిలుపునిస్తున్న నేపథ్యంలో, ఐరోపా ఖండంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశాన్నే కాక సమావేశమయ్యే హక్కును కూడా అణగదొక్కినట్టవుతుందని భావిస్తున్న వారు లేకపోలేదు. ఈ యుద్ధం నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరగకుండా అదుపులో ఉంచేందుకు ఇటలీ సరిహద్దులలో తనిఖీలను ప్రారంభించింది. తమకు కూడా తీవ్రవాద ముప్పు ఉందన్న కారణంగా డెన్మార్క్, స్వీడెన్‌లు కూడా అదే పనిని చేపడుతు న్నాయి. ఫ్రాన్స్ అయితే, అంతర్గత ముప్పులను, సరిహద్దుల వద్ద పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ తనిఖీలను మే 2024వరకూ కొనసాగించాలని భావిస్తోంది.

తమ దేశాలలో జరిగిన దాడుల వెనుక ఇద్దరు విదేశీయులు ఉన్నారంటూ, ఎప్పటి నుంచో జాప్యం చేస్తున్న ఇయు అస్సైలం (ఆశ్రయం) రూల్స్‌ను అమలు చేయాలని ఫ్రెంచి హోం మంత్రి పేర్కొన్నారు. 'మన సరిహద్దులను నిర్వహించి, ప్రజలను నమోదు చేసి, ఆశ్రయం ఇచ్చే ముందు భద్రతాపరమైన ఇంటర్వ్యూలను యూరోప్ నిర్వహించాలని' ఆయన అన్నారు. వలసదారులు ఐరోపా చేరకుండా నిరోధించేందుకు, ఒకవేళ వారు ప్రవేశిస్తే వెనక్కి పిలిపించేందుకు టర్కీ, టునీసియా లతో ఇయుకి ఒప్పందాలు ఉన్నాయి. కానీ అవి ఏవీ సరిగా పని చేయడం లేదు. ఇతర ఒప్పందాలు, ముఖ్యంగా ఈజిప్టుతో చేసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తమకు ఆశ్రయం కావాలంటూ వచ్చిన నలుగురు వ్యక్తులలో కేవలం ఒక్కరు మాత్రమే ఇంటికి తిరిగి వెడతారని కొన్ని అధ్యయన సంస్థల అంచనా.

ఇదిలా ఉండగా, గాజాలో ఉన్న విదేశీయులను రఫా సరిహద్దు ద్వారా ఈజిప్టులోకి ప్రవేశించడానికి అనుమతించేందుకు ఈజిప్టు, ఇజ్రాయెలు, యునైటెడ్ స్టేట్స్ ఒక అంగీకారానికి రావడంతో, ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవాలన్న తపనతో విదేశీయులే



కాదు పాలస్తీనీయులు కూడా పరుగులు తీశారు. అయితే, ఈ సరిహద్దులను ఎంతకాలం తెరుస్తారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ, శనివారం ఉదయం ఇంధనం మినహా ఆహారం, మందులు వంటి నిత్యావసర వస్తువులను గాజా ప్రాంతానికి బట్వాడా చేశారు. ఇందులో ఇంధనాన్ని మాత్రం చేర్చలేదని ఐడిఎఫ్ అధికార ప్రతినిధి అడ్మిరల్ డేనియల్ హగరీ తెలిపినప్పటికీ, ఆ పని ఎందుకు చేయలేదో వివరించలేదు.

**ఇస్లామిక్ దేశాల అత్యవసర సమావేశం**

ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ – గాజా యుద్ధంపై చర్చించేందుకు ఇస్లామిక్ దేశాల బృందం అత్యవసర, అసాధారణ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయిం చింది. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఐఒసి)లో ఉన్న సభ్య దేశాలు గాజాలో పెరుగుతున్న ఆయుధీకరణను, దానివల్ల సాధారణ పౌరులకు ఏర్పడే ముప్పును చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ యుద్ధం ప్రారంభమైన తరువాత యుఎస్ అధ్యక్షుడు జో బైడెన్, యుకె ప్రధాని రుషీ సునాక్ ఇజ్రాయెల్‌లో పర్యటించడమే కాదు, ఆత్మరక్షణ చేసుకునే హక్కు వారికి ఉందంటూ బహిరంగ ప్రకటనలు చేసిన నేపథ్యంలో ఇస్లామిక్ దేశాలు ఈ సమావేశాన్ని నిర్వహించడం సమంజసమని భావిస్తున్నాయి. జెద్దాలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావలసిందిగా ఈ ఇస్లామిక్ సదస్సుకు ప్రస్తుతం అధ్యక్షత వహించనున్న సౌదీ అరేబియా ఆహ్వానం పంపింది. గాజా, దాని పరిసరాలలో పెరుగుతున్న సైనిక శక్తి, సాధారణ పౌరుల జీవితాలకు ముప్పు కలిగేలా క్షీణిస్తున్న పరిస్థితులను, మొత్తంగా భద్రతా పరిస్థితులను, ప్రాంత స్థిరత్వంపై మంత్రిత్వ స్థాయిలో చర్చించేందుకు ఈ అసాధారణ సమావేశాన్ని ఐఒసి ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్వహిస్తోందంటూ ఒఐసి వెబ్‌సైట్‌లో పెట్టిన ప్రకటన పేర్కొంది.

ఐక్యరాజ్య సమితి తర్వాత నాలుగు ఖండాలలో వ్యాపించిన 57 దేశాల సభ్యత్వాన్ని కలిగిన రెండవ అతిపెద్ద సంస్థ ఒఐసి. అది తనను తాను ముస్లిం ప్రపంచపు సామూహిక గొంతుకగా అభివర్ణించు కుంటుంది. ఇజ్రాయెల్‌తో తమ సంబంధాలను సాధారణీకరించుకునేందుకు చర్చలను సౌదీ అరేబియా నిలిపివేసిన రోజునే ఒఐసి అత్యవసర సమావేశానికి పిలుపు వచ్చింది.

ఇస్లాంలో అత్యంత పవిత్ర క్షేత్రాలు కలిగిన గల్ఫ్ రాజ్యం ఇజ్రాయెల్‌కు ఎప్పుడూ గుర్తింపునివ్వలేదు. అంతేకాక, 2020లో యుఎస్ ఆధ్వర్యంలో చేసుకున్న అబ్రహాం ఆకార్డ్‌లో చేరలేదు. ఈ ఒప్పందం ద్వారా బహ్రైన్, యుఎఇ, మొరాక్కో వంటి దేశాలు ఇజ్రాయెల్‌తో అధికారిక సంబంధాలను ఏర్పరచు కోగలిగాయి. సౌదీ అరేబియా కూడా అదే పంథాలో నడవాలని భావించింది. ఆ క్రమంలోనే ఇజ్రాయెల్ నాయకులను సౌదీ అరేబియాకు ఆహ్వానించి, చర్చలు జరిపింది.

ఈ క్రమంలోనే యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇందుకు కొన్ని షరతులను విధించారు. తాము ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీక రించు కోవాలంటే, వాషింగ్టన్ నుంచి భద్రతా హామీలతో పాటు, పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకునేందుకు తోడ్పాటును కోరారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని ప్రారంభించినప్పటి నుంచీ హమాస్ నియంత్రించే గాజా ప్రాంతంలోని పాలస్తీనీయుల పరిస్థితిపై తన ఆందోళనలను రియాధ్ వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా, ఉత్తర ప్రాంతం నుంచి ఖాళీ చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేయడమే కాక, వేలకొద్దీ దాడులను చేస్తున్న ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తన స్వరాన్ని పెంచింది. ఈ క్రమంలోనే యుద్ధం ప్రారంభమైన తర్వాత, అత్యంత కటువైన భాషలో రక్షణలేని పౌరులపై దాడులు, గాజాలోని పాలస్తీనావారు నిర్వాసితులు కావడాన్ని ఖండించి, విమర్శించారు.

కాగా, మీడియాలో వస్తున్న మరణాల సంఖ్య, అరాచకాల వివరాలూ పాలస్తీనా ప్రచార సాధనలు భూతద్దంలో పెట్టి చూపిస్తున్నాయని అంటున్న విశ్లేషకుల మాటలను కూడా పరిగణనలోకి తీసుకోవలసిందే. ★

# 'పసిడి' మనస్వినికి


**రెండు రాజవంశీయల మధ్య పోరును సహించ ఓలేక, అన్న మృతిని జీర్ణించుకోలేక ఆత్మార్పణ చేసుకుని రెండున్నర శతాబ్దాలకు పైగా కులదైవంగా పూజలందుకుంటున్న యువతి ఒక ప్రాంతానికే ఇలవేల్పుగా మారిన అపూర్వ సందర్భం. ఆమె విజయ నగరం రాజవంశం ఆడపడుచు పైడితల్లి. ఆ రెండు రాజసంస్థానాలు (విజయనగరం, బొబ్బిలి).**

ఫ్రెంచ్ ప్రతినిధి బుస్సీ హైదరాబాద్ సమీపంలో బస చేసినప్పుడు మసూచి సోకి ఆయన సైన్యంలోని చాలామంది చనిపోయారని, ఆర్థిక సంక్షోభంలో పడిన ఆయనను విజయరామరాజు గజపతి ఆదుకున్నారని చరిత్ర చెబుతోంది. అప్పటికే శక్తిమంతంగా ఉన్న బొబ్బిలి సంస్థానం ఫ్రెంచి పాలకులకు కప్పం చెల్లించ నిరాకరించడం బుస్సీకి కంటగింపైంది. వారిపై పగ సాధింపునకు విజయ రామరాజును ఆయుధంగా చేసుకోవాలని వ్యూహం పన్నిన బుస్సీ రెండు సంస్థానాల మధ్య వైరం పెంచాడు.

పైడిమాంబ దేవీ ఉపాసకురాలు. బుస్సీ కుట్రలకు లొంగి తన అన్న బొబ్బిలిపై కదనానికి దిగడంతో కలత చెందిన పైడిమాంబ యుద్ధం వద్దని వారించింది. విజయరామరాజు విజేతగా తిరిగి వస్తూ దారిలో తాండ్రపాపారాయుడి ప్రతీకార జ్వాలకు ఆహుతయ్యాడు. అన్నకు ప్రమాదం పొంచి ఉందని దీక్షాబలంతో గ్రహించిన ఆమె తమ రాజ వంశానికి సన్నిహితుడు పతివాడ అప్పలనాయుడు సహాయంతో గుర్రపుబగ్గీపై బొబ్బిలి బయలుదేరింది. విజయ నగరం కోట దాటి పెద్ద చెరువును సమీపించే సరికి అన్న మరణ సమాచారం (జనవరి 26, 1757) చెవిన పడడంతో తట్టుకోలేక ఆ చెరువులో దూకి ఆత్మార్పణ చేసుకున్నారు. దేవీ ఉపాసకురాలైన పైడిమాంబ దైవత్వం పొంది పైడితల్లి అమ్మవారుగా వెలిసిందని కథనం. అనంతరం పతివాడకు కలలో కనిపించిన ఆమె చెరువులోని తన విగ్రహాన్ని వెలికి తీయించాలని చెప్పగా, విజయదశమి తరువాతి మంగళవారం నాడు దానిని వెలికితీసి, పూసపాటి రాజవంశీయులు అక్కడే గుడి కట్టించారు. విగ్రహాన్ని వెలికి తీయించిన పతివాడ అప్పలనాయుడు ఆ ఆలయానికి ప్రథమ పూజారిగా వ్యవహరించారు. నాటి నుంచి రెండున్నర శతాబ్దాలకు పైగా విజయదశమి తర్వాతి మంగళవారం నాడు సిరిమానోత్సవం నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంతం అప్పట్లో దట్టమైన అడవిగా ఉండడంతో 'వనం గుడి' అని పేరు వచ్చింది. విజయనగరం కోట సమీపంలోని మూడు లాంతర్ల కూడలి వద్ద 1924లో మరో గుడి కట్టించారు.

**తొలేళ్ల ఉత్సవం**

సిరిమాను ఉత్సవానికి ముందు రోజు 'తొలేళ్ల' ఉత్సవం నిర్వహిస్తారు. తొలకరి ముందు భూమిని దున్నిన రోజును 'తొలి ఏరు' అంటారని, అదే 'తొలేళ్ల'గా మారిందని చెబుతారు. ఆ రోజున ఆలయ ధర్మకర్తలు,



**తెలుగునాట తరతరాలుగా వస్తున్న పండుగలు, వ్రతాలు సరదాలకు లోగిళ్లుగా సంతోషానందాలకు తెరచిన వాకిళ్లుగా ఉంటూ, ఆధునికత ఎంతగా విస్తరించినా తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నాయి. సంస్కృతిని ఊతంగా చేసుకొని ప్రవహించే జీవనదుల్లాంటివి కనుకనే వాటి ఉనికికి ఏ నాటికీ ముప్పు ఉండదనిపిస్తుంది. అలాంటి పండుగల్లో ప్రత్యేకంగా ఆడపిల్లలకోసం పుట్టిన పండుగ అట్లతద్దె. ప్రతి పండుగ వెనుక జీవకోటికి ఉపయోగపడే చక్కటి సందేశం ఉంటుంది. ప్రకృతితో అనుసంధానమైన అట్ల తదియ అలాంటిదే. ఏటా ఆశ్వీయుజ బహుళ తదియ నాడు జరుపుకునే దీనికి చంద్రోదయ ఉమావ్రతం, అశూన్యశయన వ్రతమనీ పంచాంగాలు పేర్కొంటాయి. అయితే, గ్రామీణులు ప్రధానంగా జరుపుకునే ఇది 'అట్ల తద్ది'గానే ప్రసిద్ధి. 'తద్ది, తద్దె' పదాలు సమానార్థకాలే. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా అంటుంటారు. ఈ రెండు పదాలకు మూలం మాత్రం తదియే. ఈ మాసంలోనే బతుకమ్మ పండుగ తరువాత వెంటనే వచ్చేది అట్లతదియ.**

# ఆటలపాటల 'అట్ల తద్దె'



బాలికల నుంచి పండు ముత్తైదువల దాకా ఆనందోత్సాహాలతో జరుపుకునే వేడుక. 'చంద్రోదయ ఉమావ్రతం' ఆచరించే కన్యలకు మంచి భర్తలు వస్తారని, వివాహితలకు సుదీర్ఘకాలం సౌభాగ్యం సమకూరి జీవితాలు సుఖవంతంగా సాగుతాయని నమ్మకంతో అన్ని సామాజిక వర్గాల వారూ దీనిని జరుపుకుంటారు. అందుకే 'అష్టాదశ వర్ణాలకు అట్లతద్దె' అనే నానుడి బహుళ ప్రచారంలో ఉంది. ఆ రోజు పగలంతా ఆటపాటలన్నీ అయ్యాక అమ్మవారికి చంద్రోదయ సమయాన పెట్టే నైవేద్యంలో ప్రత్యేకంగా అట్లు ఉంటాయి కనుక 'అట్లతద్దె'గా మారిందని చెబుతారు.

ఆనాటి వేకువజామున తలస్నానాలు చేసి చద్ది తింటారు. గోంగూరపచ్చడి, నువ్వులపొడి, పెరుగు పచ్చడి, ఉల్లిపాయలు, ఇతర కాయగూరలు వేసిన పులుసు శాకాలుగా ఉంటాయి. మరి కొన్నిచోట్ల కందిపచ్చడి, పొట్లకాయకూర, పొట్లకాయ పెరుగు పచ్చడి, గోంగూర ఉంటాయి. ఈ



పూసపాటి వంశీయులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పిస్తారు. ఘటాలను ఊరేగింపుగా కోట దగ్గరకు తెచ్చి, కోటశక్తికి పూజలు చేసిన తర్వాత వాటిని గుడికి చేరుస్తారు. ఆ రోజున రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తారు. వాటిని నాటితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం.

**జాలరి వల.. అంజలి రథం**

చెరువు గర్భం నుంచి అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీయడంలో స్థానిక జాలర్ల సహాయం విశేషమైనదిగా చరిత్ర చెబుతోంది. నాటి నుంచి జాలర్లు సిరిమా నోత్సవంలో ప్రముఖంగా పాల్గొంటూ వస్తున్నారు. విగ్రహం వెలికితీతకు వల ఉపయోగించినందున దానిని ఉత్సవంలో ఉంచుతారు.

ఈ ఉత్సంలో తెల్ల ఏనుగు మరో ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. సంస్థానాధీశులు భద్రగజాన్ని అధిరోహించి సిరిమాను ముందు నడిచేవారు. దానిని భక్తులు ఐరావతంగా పరిగణించేవారు. 1956 తరువాత నుంచి ఏనుగు ఆకారంలో రూపొందించిన బండిని వినియోగిస్తున్నారు.

**'సిరిమానోత్సవం' విశిష్టత**

పైడిమాంబ జాతరలో 'సిరిమానోత్సవం' తలమానిక సన్నివేశం. విజయదశమి తరువాత వచ్చే మంగళవారం నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సిరిమానును అధిరోహించే ప్రధాన పూజారిని పైడి తల్లమ్మగా పరిగణిస్తారు. అందుకే కలికి తురాయితో తలపాగా, నుదుట బొట్టు, కుడిచేతిలో నిమ్మకాయలు, ఎడమ చేతిలో విసనకర్ర, బొడ్డులో కత్తితో వచ్చే ఆయన పాదాలను పసుపు నీళ్లతో కడుగుతూ ఆహ్వానిస్తారు. చిన్నారులను నేలపై పడుకోపెడతారు. ఆయన వారిని దాటుకుంటూ వెళితే చిన్నారులకు కీడు ఉంటే తొలగిపోయి మంచి జరుగుతుందని తల్లిదండ్రుల విశ్వాసం. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు సిరిమాను ఆలయానికి చేరుతుంది. దానికి పూజాదికాలు జరిపిన తరువాత పూసపాటి రాజవంశీయులు సిరిమానును లాంఛనంగా లాగి ఊరేగింపును ప్రారంభిస్తారు. సిరిమాను అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు మూడుసార్లు నడుస్తుంది. గజపతుల ఆడపడుచులు కోటబురుజు నుంచి ఉత్సవాన్ని వీక్షించి అమ్మవారికి నీరాజనాలు అర్పిస్తారు.

కళింగాంధ్రతో పాటు సరిహద్దు రాష్ట్రాల భక్తులతో పూజలందుకుంటున్న బంగారు ('పైడి') తల్లి. ఆమెకు ఏటా నిర్వహించే 'సిరిమాను' ఉత్సవం సందర్భంగా విద్యల నగరం భక్తజన సంద్ర మవుతుంది. వృత్తి, ఉపాధి కోసం దూరప్రాంతాలకు వలసి వెళ్లినవారు కూడా ఈ ఉత్సవానికి తరలి వస్తారు కుల, మత,వర్ణ, వర్గాలకు అతీతంగా సర్వులూ ఆమెను కొలుస్తారు. ★



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

ఆహార పదార్థాలు ప్రాంతాలు వారీగా ఒక్కొక్క చోట ఒక్కోలా ఉన్నా, అవన్నీ స్త్రీల ఆరోగ్యానికి ఉపకరించేవి కావడం విశేషం. భోజనం తర్వాత ఆకు, వక్క, సున్నంతోనే కాకుండా వివిధ రకాల సుగంధద్రవ్యాలతో తాంబూలం వేసుకోవటం తప్పని సరి.

చద్ది ఆరగింపుతోనే సరదాలన్నీ ఒక్కొక్కటిగా ప్రారంభ మవుతాయి. ముందుగా చేతులకు గోరింటాకు పెట్టు కొంటారు. గోరు, అంటు.. గోరుకు అంటుకొనే రంగును కలిగించే కనుక గోరింటాకు అయింది. దీనివల్ల గోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీనికే 'నఖ రంజని' అనే పేరు ఉంది. గోరింటాకు ఆరోగ్య పరిరక్షణకు పనికొచ్చే మంచి వనమూలిక అని ఆయుర్వేదం చెబుతుంది. ఈ పండుగలో కనిపించే గోరింటాకు, తాంబూలాలకు అవినాభావ సంబంధ ప్రత్యేకతలు ఉన్నాయి. గోరింట పెట్టుకున్న అరచెయ్యి, తాంబూలం సేవించిన నోరు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడు వస్తాడన్నది సరసంతో కూడిన 'ఓ నమ్మకం'. సాధారణంగా భోజనానంతరం ఒకసారి తాంబూలం వేసుకోవడం పరిపాటి. కానీ అట్ల తద్దెనాడు, పగలంతా ఆరారగా తాంబూలాలు నములు తూనే ఉంటారు. వేకువ జామున తీసుకున్న చద్ది తరువాత పగలంతా ఉపవాసం ఉంటూ చంద్రోదయం అయ్యాక వ్రతాన్ని పూర్తి చేసుకొని ముత్తైదువులకు వాయనాలిచ్చి, భోజనం పెట్టిన తర్వాతే తాము భుజించాలి. ఈలోగా నోరు ఎండి పోకుండా సుగంధ పరిమళభరిత తాంబూల సేవనం కొనసాగుతూ ఉంటుంది. అయితే కొందరు ఉపవాసదీక్షలో తాంబూల సేవనం నిషిద్ధంగా భావిస్తారు. అంటే వారి వారి ఆరోగ్య పరిస్థితులను బట్టి తాంబూల స్వీకరణ ఆధారపడి ఉంటుందన్న మాట.

పగలంతా ఆటపాటలతో, ఉయ్యాలలూగుతూ, సాయంత్రానికి ఉమాదేవి వ్రతం జరుపుకుంటారు. అమ్మవారికి సమర్పించే నైవేద్యంలో ఆధ్యాత్మిక, జ్యోతిష శాస్త్ర సంబంధ అంశాలతో పాటు ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. మినుములు రాహువుకు, బియ్యం చంద్రుడికి సంబంధించిన ధాన్యాలు కనుక, వాటితో తయారయ్యే అట్లను నైవేద్యంగా సమర్పించి, ముత్తైదువులకు వాయనాలుగా ఇస్తారు. దీనివల్ల ఆయా గ్రహదోషాలు నశించి వాయనాలిచ్చిన వారు పిల్లాపాపలతో, సుఖ సంసారం సాగిస్తారని నమ్మకం.

**అట్లతద్దె నోము**

శివుడిని పతిగా పొందేందుకు పార్వతీదేవి ఈ వ్రతాన్ని ఆచరించిందని, దేవర్షి నారదుడు ఈ వ్రతానికి పౌరోహిత్యం వహించాడనే పురాణగాథ ప్రచారంలో ఉంది. యోగ్యుడైన వారు భర్తలుగా రావాలని కోరుతూ కన్యలు ఈ నోమును ఆచరించడం అనుశ్రుతంగా వస్తోంది. ఈ వ్రతంలో పది సంఖ్యకు ప్రాధాన్యం ఉంది. గౌరీదేవికి పది అట్లను నైవేద్యంగా పెట్టి, ముత్తైదువులకు పది పండ్లు వాయనంగా ఇస్తారు. అలాగే పది రకాల పదార్థాలను భుజిస్తారు. పదిసార్లు ఊయలలూగుతారు. ఒకసారి మొదలస్తు పెట్టిన నోమును పదేళ్ల పాటు కొనసాగిం చాలన్నది నియమం.

బతుకమ్మ పాటల్లో చోటుచేసుకునే పురాణ, సామాజికాంశాలే అట్లతద్దె పాటల్లోనూ కనిపిస్తాయి. ఉదాహరణకు 'రాముడంతటి వాడె రట్టుపడ్డాడు/ మానవుల కెట్లమ్మ మాటపడకుండ/దేవి సీతమ్మ కూడ జననిందపడెను/మానవుల కెట్లమ్మ మాటపడకుండ' అనే పాట సీతారాములకు కూడా నిందలు తప్ప లేదని, అవతార పురుషులే మాట పడక తప్పనప్పుడు మనషులమెంత? అయినా అలాంటివాటిని అధిగ మిస్తూ సాగిపోవాలనే సందేశం దాగి ఉంది.

వేకువ జామున తలస్నానం నుంచి సాయంత్రం ఉమాదేవి వ్రతపరిసమాప్తి సందర్భంగా వాయనాల వితరణ వరకు నియమబద్ధంగా, కచ్చితంగా నిర్వ హించాలని వ్రత గ్రంథాలు చెబుతున్నాయి. ★



మన పండుగలు,ఉత్సవాలు జాతి సంస్కృతికి, జాతీయ జీవనానికి ప్రతీకలు, స్ఫూర్తిదాయకాలు. లోక కల్యాణం కోసం మన రుషులు, మహనీయులు రుతుధర్మం, నక్షత్ర గమనాన్ని బట్టి పర్వదినాలను స్థిరపరిచారు. మనిషి ఆరోగ్యంగా, ఆహ్లాదంగా మనుగడ సాగించేందుకు రుతువుల వారీగా పాటించవలసిన విధివిధానాలతో వాటిని నిర్దేశించారు. వాటిలో ప్రముఖమైన దీపావళి వేడుకలను ప్రపంచవ్యాప్తంగా సుమారు 90 కోట్ల మంది ప్రజలు వివిధ పద్ధతుల్లో జరుపుకుంటారు. కానీ, ఇందుకు సంబంధించి నిషేధాలు, అభ్యంతరాలు మన దేశానికే పరిమితం కావడం విచిత్ర పరిణామం.

# దేశవాళీ బా



చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగలలోని తాత్త్వికత సమాజానికి సానుకూల దృక్పథాన్ని ఇస్తుంది. నైతిక విలువలను బోధిస్తుంది. ఐక్యతను పెంపొందిస్తుంది. అయితే వాటిని పక్కనపెట్టి హిందూ పండగలపై దాడే ప్రధాన లక్ష్యంగా కొన్ని శక్తులు పనిచేస్తున్నాయి. విదేశీయులతో పాటు కొన్ని స్వదేశీశక్తులకు వాటిని విమర్శించడం, వాటి నిర్వహణను తప్పు పట్టడం పరిపాటిగా మారింది. కులం, మతం, వయసు, లింగభేదాలకు అతీతంగా అత్యంత ఉత్సాహంగా జరుపుకునే పండుగలలో వినాయక చవితి, దీపావళి ప్రధానమైనవి. ఇవి సామాజిక సమరసతను పెంపొందించడంతో పాటు మన మంతా ఒక్కటే అనే జాతీయ భావనను పాదుకొల్పుతాయి.

అది అలా ఉంటే మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి మన పండుగలే రథచక్రాలు. ప్రతి పండుగ వెనుక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆర్థిక వ్యవస్థ ఉంది. పండుగ నిర్వహణలో జరిగే ఆర్థిక లావాదేవీలు స్థూలంగా దేశ ఆర్థిక ప్రగతి దిశను మారుస్తాయి. అయితే దానిని గుర్తించలేకపోవడం, గుర్తించినా ఆదరించి, ఆచరించకపోవడాన్ని లోపంగా చెప్పవచ్చు. కానీ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' విధానంతో పరిస్థితిలో కొంత మార్పు కనిపిస్తోంది. రాఖీల దగ్గర నుంచి దీపావళి సందర్భంగా కాల్చే బాణసంచా దాకా విదేశీ దిగుమతులపై ఆధార పడిన సంగతి తెలిసిందే. రెండేళ్ల క్రితం వరకు రాఖీల కోసం చైనా పైన ఎక్కువగా ఆధారపడి అక్కడి నుంచి కనీసం రూ. 4 వేల కోట్ల విలువ గల సరకును దిగుమతి చేసుకునేవాళ్లం. ఇటీవలి చైనా వస్తువుల్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దేశీయంగానే రాఖీల ఉత్పత్తి, వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ మంచి పరిణామం ఇతర పండుగల సామగ్రిలో విషయంలోనూ రావాలి.

వినాయక చవితి, దీపావళి లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ ఆర్థిక ఆలంబన కల్పిస్తున్నాయి. ఒక అధ్యయనం ప్రకారం, వినాయక నవరాత్రి వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా సుమారు రూ.20 వేల కోట్లు చెలామణి జరుగుతోంది. ఇది ఏటా ఇరవై శాతం వరకు పెరుగుతుందని అసోచామ్ సంస్థ తన సర్వేలో పేర్కొంది. ఈ లెక్కన కేవలం దీపావళి సంర్భంగా ఆ రెండు రోజులే కాకుండా, కార్తిక మాసమంతా, ఇతర సమయాల్లో మోద విషాద సందర్భాలలో కాల్చే బాణసంచా విక్రయాలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవచ్చు. దానిని సొమ్ము చేసుకునేందుకు చైనా తీవ్రంగా ప్రయత్నించేది. బాణసంచాను అనైతికంగా తయారు చేసి, మన దేశంలోకి చట్టం విరుద్ధంగా ప్రవేశపెట్టేది. శివకాశి (తమిళనాడు) వంటి ప్రసిద్ధ బాణసంచా తయారీ కేంద్రాల ఉత్పత్తులు విదేశాలకు సరఫరా అవుతున్నప్పటికీ 'పొరుగింటి పుల్లకూర రుచి' సామెతలా ఇక్కడి వారు విదేశీ సరకు వైపే మొగ్గు చూపేవారు. ఒక్క శివకాశీ కేంద్రంగా ఏటా కనీసం రూ.10 వేల కోట్ల విలువగల బాణసంచా తయారవుతున్నా చైనా సరకుకు గిరికీ తగ్గక పోవడం గమనార్హం (కోవిడ్–19 తరువాత కొంత మార్పు వచ్చిందంటున్నారు). కేవలం మందుగుండు సామగ్రే కాకుండా

జాగృతి డెస్క్



# ణసంచా భేష్

ప్రమిదలు, చిచ్చుబుడ్లు లాంటి వాటిని తయారుచేసే దేశీయ చేతివృత్తుల వారు నష్టపోతున్నారు. వివిధ రకాల ప్రమిదలు, చిచ్చుబుడ్ల వంటివి అందంగా తయారు చేసే కుంభాకారులకు కొదవ లేదు. అయితే వారికి పనులు దక్కడం లేదు. కృత్రిమ ప్రమిదలు, కొవ్వొత్తుల వంటి దేశీయేతర వస్తువుల పట్ల మోజు పెరుగుతోంది. ఒకప్పటి దేశవాళీ బాణసంచా తయారీ మూలనపడింది. ఇతర ఉత్పత్తుల మాదిరి గానే బాణసంచా తయారీ కార్పొరేట్ సంస్థలకు వెళ్లకముందు వాటిని స్థానికంగానే తయారుచేసేవారు. మన చెంతనే, మన చేతనే తయారైన వాటిని ఉపయోగిస్తే ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదంచేసిన వారమవుతామని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**దీపావళిపై దాడి**

భారత్ పండుగలకు, ఉత్సవాలకు నెలవు. అవి హిందూ జీవన విధానంలో భాగం. కానీ అవి ఒక్కొక్కటి ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. ఇంకా చెప్పాలంటే కోల్పోయేటట్టు చేస్తున్నారని, వాటి నిర్వహణ ప్రమాదంలో పడిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. లౌకిక రాజ్యంగా చెప్పుకునే చోట, పండుగల విషయంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీపావళి సందర్భంగా కాలుష్యం పేరుతో దాడి అందుకు పెద్ద ఉదాహరణ. దీపావళి అంటే 'దీపాల వరుస' అని అర్థం ఉన్నా బాణసంచా కాల్చనిదే ఈ సంబరాలకు నిండుదనం రాదు. కాని, ఇది పర్యావరణానికి ముప్పు పేరిట బాణసంచా వాడకం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

దీపావళే కాదు... హిందువుల పండుగ వస్తున్నదంటే పర్యావరణ ఉద్యమకారులకు ఎక్కడలేని అభ్యంతరాలు గుర్తుకొస్తాయని, ప్రతి పండుగ నేపథ్యాన్ని తప్పు పట్టడమే పనిగా కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

దీపావళి సమయంలో గాలినాణ్యత అధ్వాన్నంగా తయారవుతుంది. బాణసంచా కాల్చటం వల్ల కళ్ల సమస్యలు, దగ్గు రావడం, ధ్వని స్థాయి పెరగటం, మూత్రంలో ధాతువులస్థాయి పెరగటం వంటి ప్రతికూలమైన ప్రభావాలు ఉన్నమాట నిజమే అయినా, గణాంకపరంగా చూస్తే అవేమంత పరిగణనలోకి తీసుకోగలిగిన స్థాయిలో లేవని నిపుణులు అంటున్నారు. 'కాలుష్యనియంత్రణ మండలి పేర్కొన్నట్టు దీపావళి సమయంలో కాలుష్య స్థాయి పెరగటం యథార్థమే, కానీ దీపావళేతర సమయాల్లో కూడా కాలుష్యం పెరుగుతోంది, కొన్నిసార్లు రెట్టింపు స్థాయికి చేరుతోంది' అని సుప్రీంకోర్టు నియమించిన కమిటీ సభ్యులు డాక్టర్ అరవింద్ కుమార్, గౌరీమా లేఖీ అభిప్రాయపడ్డారు.

ఏటికేడాది సంతోష, విషాద సందర్భాలు, ఇతర విశేష కార్యక్రమాల సందర్భంగా దేశవ్యాప్తంగా కాల్చే బాణసంచాతో లేని కాలుష్యం, ఆశ్వీయుజ అమావాస్య రాత్రి కేవలం మూడు, నాలుగు గంటల పాటు కాల్చే దానితో వస్తోందంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేయడం విస్తుగొలుపుతోందని నిపుణులు అంటున్నారు. కేవలం దీపావళి బాణసంచా కారణంగానే ఢిల్లీ నగరం కాలుష్యంతో సతమతమైందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆ కాలుష్యానికి దీపావళి టపాసుల వల్ల వెలువడిన పొగ కారణం కాదని, కాన్పూర్ ఐఐటీ స్పష్టం చేసినా బాణసంచాను నిషేధించారు. 'బాణసంచాను అడ్డం పెట్టుకుని దీపావళి నాడు ఇలా ఆంక్షలు విధించడం హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది. అమెరికాలో స్వాతంత్ర్య దినం (జూలై 4) సందర్భంగా తగులబెట్టే బాణసంచా గురించి అక్కడి హిందూ వ్యతిరేకులు మాట్లాడరు? ప్రపంచంలోనే అత్యధికంగా బాణసంచా వినియోగించే సంస్థగా 'వాల్ట్ డిస్నీ' రికార్డులకెక్కింది. ఏటా జనవరి 1వ తేదీన భారీస్థాయిలో కాల్చే మందుగుండు సామగ్రి గురించీ పెదవి విప్పరు. భారత్‌లో దీపావళి కారణంగా దేశమంతా ఉక్కిరిబిక్కిరి అవుతోందని అంతర్జాతీయ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారు' అనే వ్యాఖ్యానాలు వినిపించాయి.

కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయి కనుక బాణసంచాను నిషేధించాలనే నినాదం ఊపందుకుంటుండగా, బాణసంచాలో మేలు చేసే అంశాలు ఉన్నాయనే వాదనా వినిపిస్తోంది. వర్షరుతువులో పెరిగే క్రిమికీటకాదులు టపాసుల వల్ల వెలువడే విషవాయువు బారినపడి చనిపోతాయని, తద్వారా, పరిసరాల్లోని వాతావరణం పరిశుభ్రమవుతుందని, రానున్న శీతకాలంలో స్వచ్ఛ వాతావరణానికి ఇది ఎంతో దోహదకారిగా ఉంటుందని అంటున్నారు. ★



**కేవలం మందుగుండు సామగ్రే కాకుండా ప్రమిదలు, చిచ్చుబుడ్లు లాంటి వాటిని తయారుచేసే దేశీయ చేతివృత్తుల వారు నష్టపోతున్నారు. వివిధ రకాల ప్రమిదలు, చిచ్చుబుడ్ల వంటివి అందంగా తయారు చేసే కుంభాకారులకు కొదవ లేదు. అయితే వారికి పనులు దక్కడం లేదు. కృత్రిమ ప్రమిదలు, కొవ్వొత్తుల వంటి దేశీయేతర వస్తువుల పట్ల మోజు పెరుగుతోంది. ఒకప్పటి దేశవాళీ బాణసంచా తయారీ మూలనపడింది.**

**'వినాశకాలే విపరీత బుద్ధి' అంటారు పెద్దలు. తమిళనాట ద్రావిడ భావజాలం దాదాపు చివరి దశ కొచ్చిందనే చెప్పాలి. తి.ము.క అనే 'ద్రావిడ మున్నేట్ర కళగం' పార్టీ ఇందుకు కారణం. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేతకానితనం, అవినీతిలో మునిగి తేలుతున్న మంత్రులు, అందిన మేరకు దోచుకుంటున్న కుటుంబ సభ్యులు, బహిర్గతమవుతున్న ద్రవిడ భావజాలపు నిజరూపం తమిళనాట చర్చనీయాంశాలయ్యాయి.**

# అస్తమిస్తున్న ద్రవిడ

ప్రజాదరణ తగ్గినా, అంతర్గత సమస్యలొచ్చినా, విపత్కర పరిస్థితులు ఎదురైనా తి.ము.క వెంటనే ప్రయోగించే ఆయుధాలు– హిందూ లేదా సనాతన ధర్మం గురించి కారుకూతలు కూయడం, ఆర్య ద్రవిడ వాదాన్ని తెరపైకి తేవడం, ఉత్తరాది వారిని శత్రువులుగా చిత్రీకరించడం, హిందీని రుద్దుతున్నారని ఆరోపించడం.కాకపోతే శ్రీలంక తమిళుల సమస్య.

ఈ సెప్టెంబరు 3న చెన్నైలో జరిగిన 'సనాతన ఒలిప్పు మానాడు'లో సనాతన ధర్మ నిర్మూలన సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను మనం ఈ నేపథ్యంలోనే చూడాలి. స్థానికులు, అనుయాయుల కోసం ఈ వ్యాఖ్యలను చేసిన ఉదయనిధి, తరువాతి పరిణామాలను ఊహించి ఉండడు. దేశమంతా ఈ వ్యాఖ్యలపై సునామిలా వ్యతిరేకత వచ్చింది. పొరుగు రాష్ట్రంలో వేళ్లూనుకొని ఉన్న ద్రవిడ రాజకీయాల గురించి అడపాదడపా వినటం తప్పితే, మనలో చాలామందికి దీనిపట్ల లోతైన అవగాహన లేదు.

**ద్రవిడ పార్టీల పుట్టుక, పెరుగుదల**

మన పురాణేతిహాసాల ప్రకారం 'ద్రావిడం' అనేది ఒక భౌగోళిక ప్రదేశాన్ని సూచిస్తుంది. ఆది శంకరులవారు తనను 'ద్రావిడ శిశువు'గా పరిచయం చేసుకొన్నారు. కానీ ద్రావిడం అనేది ఒక ప్రత్యేక జాతి అని ద్రవిడవాదుల వాదన. ఆర్య, ద్రవిడ సిద్ధాంతాన్ని అంబేద్కర్ అంతటి వాడే తిరస్కరించినా వీరికి పట్టదు. 'ఆర్యన్ ఇన్వేజన్ థియరీ' ఆధారంగానే రాజకీయాలు నడిపిస్తారు. అది అబద్ధమని ఒప్పుకుంటే తమ ఉనికికే ప్రమాదం.

ద్రవిడ సిద్ధాంతానికి 'పెరియార్' అని ప్రాచుర్యం పొందిన ఈరోడ్ వేంకటప్ప రామస్వామి నాయకర్ (ఈ.వే.రా) మూలపురుషుడని చెప్పవచ్చు. ఈ.వే.రా 1944లో 'ద్రవిడర్ కళగం' అనే సంస్థను స్థాపించాడు. తి.క అని స్థానికులు పిలిచే 'ద్రవిడర్ కళగం' ఒక సాంఘికోద్యమ సంస్థ. ఇది ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనదు. ప్రత్యేక ద్రవిడ దేశ స్థాపన తొలినాళ్లలో ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. నాయకర్ తొలుత భారత జాతీయ కాంగ్రెస్‌లోనూ, జస్టిస్ పార్టీలోనూ పనిచేసి, తరువాత తి.క ను స్థాపించాడు. సమాజ శ్రేయస్సు, కుల నిర్మూలన, మద్యపాన నిషేధం కోసం పని చేసినా, వీరి భావజాలం ఆంగ్లేయుల పాలనకు అనుకూలంగా ఉండేది. బ్రాహ్మణుల పట్ల వ్యతిరేకత, కాంగ్రెస్ వ్యతిరేకత, మితిమీరిన హేతువాదం, భారతీయ సంప్రదాయాల పట్ల చులకన భావం, హిందీ వ్యతిరేకత, ఉత్తర భారతీయుల పట్ల ద్వేషం దీని సిద్ధాంతం. ఇప్పుడంటే తమిళ భాషను ఏమైనా అంటే భగ్గుమంటారు గాని, నాయకర్ పలు సందర్భాలలో ఆ భాషను 'కాట్టుమిరండి భాషై' (అనాగరీకుల భాష) అని వర్ణించి, ఆంగ్లం నేర్చుకొమ్మని ప్రోత్సహించేవాడు. నాయకర్‌కు తమిళ సాహిత్యం అన్నా చులకనే. తోల్–కాప్పియం, తిరుక్కురళ్, కంబ రామాయణం, పెరియ పురాణం వంటి గొప్ప గ్రంథాల గురించి చాల నీచంగా మాట్లాడాడు. ఈ సంస్థ నడిపే 'విడుదలై', 'కుడి అరసు' పత్రికలలో ఈ విషయాలన్నీ ప్రచురించేవారు.

ఆగస్టు 15న దేశమంతటా సంబరాలు జరుపుకుంటే, కొంతమంది తి.క వాళ్లు శోకదినంగా అభివర్ణించారు. ప్రత్యేక ద్రవిడనాడు కోరికను ఒప్పుకోనందున, నాయకర్ ఈ నిర్ణయం తీసుకొన్నాడు. ఐతే అన్నాదురై, ఇతర నాయకులు దీనితో ఏకీభవించలేదు. ఉమ్మడి మద్రాసు ప్రెసిడెన్సీ రోజుల్లో మొదలైన ద్రవిడ జైత్రయాత్ర తమిళనాడు ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిందే తప్ప, దక్షిణాది రాష్ట్రాలు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ఆదరణ పొందలేదు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, తుళు వంటివి ద్రావిడ భాషలనీ, అందుచేత దక్షిణాది రాష్ట్రాలు ద్రవిడ దేశం పేరుతో విడిపోవాలని కూడా ప్రచార ప్రయత్నాలు జరిగాయి.

సిద్ధాంతపరమైన పలు విభేదాల కారణంగా, 70వ ఏట కూతురు వయస్కురాలైన మణియమ్మైను నాయకర్ వివాహం చేసుకోవడం వలన, సి.ఎన్. అన్నాదురై నాయకత్వంలో 'ద్రవిడ మున్నేట్ర కళగం' పేరుతో తి.ము.క పార్టీ ఏర్పడింది. కరుణానిధి, ఎం.జి.ఆర్, నెడుంజెళియన్ వంటి వారు అన్నాదురైను సమర్థించారు. తి.ము.క పార్టీ ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనాలని నిర్ణయించుకొంది. ప్రజల ఓట్లు పొందాలంటే అందరినీ కలుపుకొని పోవాలి కదా. 'దేవుడే లేడు. దేవుణ్ణి నమ్మే వాడు మూర్ఖుడు' అనే తి.క నినాదాన్ని పక్కన బెట్టి 'ఒకే కులం.ఒక్కడే దేవుడు' అని తి.ము.క కొత్త పాట మొదలెట్టింది. ప్రజలు ఈ మాయకు లోబడ్డారు. పార్టీ ఏర్పడిన పద్దెనిమిది సంవత్సరాలకు అంటే 1967లో తి.ము.క పార్టీ తమిళనాట అధికారంలోకి వచ్చింది. అన్నాదురై ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టాడు. అనారోగ్యంతో ఫిబ్రవరి,1969లో అన్నాదురై మరణించాడు. పార్టీలో అతడికంటే సీనియర్లు ఉన్నప్పటికీ, కరుణానిధి చక్రం తిప్పి ముఖ్యమంత్రి కాగలిగాడు. పార్టీని కుటుంబ పార్టీగా మార్చేసుకొన్నాడు. ఈ రోజు తి.ము.క పార్టీ అంటే అది కరుణానిధి కుటుంబపు ప్రైవేటు ఆస్తి.

1971 ఎన్నికలలో గెలిచి మళ్లీ ముఖ్య మంత్రి అయినప్పటికీ, కరుణానిధికి ఎంజీఆర్ నుండి అసమ్మతి ఎదురైంది. మంచి స్నేహితులైనప్పటికీ ఇద్దరికీ అధికార కాంక్ష ఎక్కువే. నటుడుగా ఎంజీఆర్



పాపులారిటీ కరుణానిధికి కంటిగింపుగా ఉండేది. అన్నాదురైదీ ఇదే ధోరణి. అయితే వీరికి ఎంజీఆర్ తెచ్చే ఓట్లు మాత్రం కావాలి. పార్టీనుండి సస్పెండ్ అయిన ఎంజీఆర్ అక్టోబర్ 1972లో అ.తి.ము.క –'అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం' స్థాపించాడు. ఎమర్జెన్సీ కాలంలో 'ఆలిండియా అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం' అయింది. 1977 జూన్‌లో జరిగిన ఎన్నికలలో అ.తి.ము.క అధికారంలో కొచ్చింది. ఎంజీఆర్ ముఖ్యమంత్రి అయ్యాడు. 1980 లోను, 1984లోను ఎన్నికల్లో గెలిచి ఎం.జి.ఆర్ తన పదవిని నిలబెట్టుకున్నాడు. అనారోగ్యం కారణంగా తన 70వ ఏట, డిసెంబర్ 1987లో మరణించాడు. అప్పటి వరకు కరుణానిధి ప్రతిపక్ష నాయకుడే. 1989 నుంచి ఎన్నికలలో అధికారం చేతులు మారే ధోరణి వచ్చింది. ఎంజిఆర్ మరణం తర్వాత అధికారం జయలలిత చేతుల్లోకి వచ్చింది. 2016 లో మాత్రం జయలలిత వరుసగా రెండోసారి నెగ్గి, ముఖ్యమంత్రి అయ్యింది. కొద్దిరోజులకే అనారోగ్యంతో డిసెంబర్ 2016లో


# సూర్యుడు?

మరణించారు. కరుణానిధి కూడా ఆగస్టు 2018లో కన్నుమూశారు. అతని కుమారుడు ఎం.కె. స్టాలిన్ పార్టీ పగ్గాలు చేపట్టి, మే 2021 ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాడు. తమిళనాడుకు అవస్థలు మొదలయ్యాయి.

ద్రవిడ పార్టీల చరిత్రలో ఇవి రెండు ముఖ్యమైనవి. మరికొన్ని చిల్లర పార్టీలు పుట్టాయి, అంతరించిపోయాయి. లేదా పేరుకు మాత్రమే ఉన్నాయి. ఇందులో వై.కో.(వయ్యాపురి గోపాలస్వామి) 'మరుమలర్చి ద్రావిడ మున్నేట్ర కళగం' (మ.తి.ము.క) ఒకటి. వైకో ప్రతి ఎన్నికలలోను పొత్తు పెట్టుకొనే పార్టీలు మారుస్తాడు. ప్రస్తుతం తి.ము.కతో పొత్తులో ఉన్నాడు. తమిళ పులులతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అంటారు.

**ద్వంద్వ ప్రమాణాలు**

ద్రవిడవాదుల ప్రత్యేక లక్షణం వాక్చాతుర్యం. సందర్భానికి తగినట్టు మాట్లాడగలరు, ఒప్పించగలరు. అవసరమైతే సభ్యత, సంస్కారాలను గాలికొదిలి పచ్చి బూతులు కూడా మాట్లాడి ఎదుటి వారి నోరు మూయిస్తారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలున్న ప్రదేశాలలో, ఉదాహరణకు శ్రీరంగం, కాంచి మఠం వంటి వాటి వద్ద ద్రవిడార్ కళగం నాయకర్ శిలా విగ్రహాలను ప్రతిష్టించింది. శిలాఫలకాలలో నాస్తిక బోధనలు రాయించేవారు. దేవుడు లేడన్న ద్రవిడ ప్రబోధాలు హిందూ దేవాలయాలకే పరిమితం. మసీదులు, చర్చిలు


రామస్వామి నాయకర్


అన్నాదురై


ఎం.జి.ఆర్

ఇందుకు మినహాయింపు. ఈ నాస్తికవాదులు పొరపాటున కూడా ఇస్లాం, క్రైస్తవాల గురించి నోరెత్తరు. చాలామంది తెలిసో తెలియకో నాయకర్‌ను అంబేద్కర్‌తో పోలుస్తుంటారు. ఇది తప్పు. ఎలా జీవించాలో అంబేద్కర్ నుండి నేర్చుకోవాలి. ఎలా బ్రతకకూడదో నాయకర్‌ను చూసి తెలుసుకోవాలి.

తి.క.లో ప్రజాస్వామ్యం కనపడదు. నాయకర్ తరువాత అతడి భార్య మణియమ్మై 1973లో అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టింది. 1978లో ఆమె మరణించిన తరువాత కె.వీరమణి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, ఇప్పటికీ కొనసాగుతున్నాడు. తి.క. ఇప్పుడు నామమాత్రంగా ఉంది. వీరమణి తరువాత అతడి కుమారుడు అన్బురాజ్ కోసం రంగం సిద్ధమైంది. గతంలో సంపాదించుకొన్న ఆస్తులు కాపాడుకొంటూ కాలం నెట్టుకొస్తున్నారు వీరమణి. ఏ ద్రవిడ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ నాయకులతో సఖ్యత పెంచుకోవడం, ఆ పార్టీకి తగినట్టుగా మాట్లాడటం వీరమణికి అలవాటే. కరుణానిధికి ఆంతరంగికుడైనప్పటికీ, జయలలితను 'సామాజిక న్యాయం కాపాడిన వీరవనిత' అని అభివర్ణించి, ఆమె దయకు పాత్రుడైనాడు. ఊరంతటికీ దేవుడు లేడని చెబుతాడు వీరమణి. 2019లో ఇతడి ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇతడి కుమారుడు, కోడలు కాంచిపురంలోని "అత్తి వరద రాజ పెరుమాళ్" గుడిలో పూజలు చేయించారు. కోలుకొని ఆయన ఆ హిందూ దేవుణ్ణే మళ్లీ తిట్టాలి కదా!

ఇక తి.ము.క విషయానికొస్తే, వితండవాదం చేయడంలో వారి సృజనాత్మత హద్దులు లేనిదే. మచ్చుకి కొన్ని.

– సనాతనాన్ని అంతమొందించాలని ఉదయనిధి అంటాడు. కానీ 2021 ఎన్నికల ముందు అబ్బా, కొడుకులిద్దరూ గుళ్లకు, గోపురాలకు తిరిగి వేలాయుధాన్ని కూడా చేత పట్టుకున్నారు. ఇక స్టాలిన్ భార్య దుర్గ వెళ్లని గుడి లేదు. మొక్కని దేవుడు లేడు. ఉదయనిధి స్టాలిన్, తన భార్య క్రైస్తవురాలు కాబట్టి, తాను కూడా క్రైస్తవుడనని చెప్పుకున్నాడు.

– స్టాలిన్ అల్లుడు శబరీసన్ గత ఆగస్టు 2022లో తిరుచెందూర్ గుడిలో 'శత్రు నాశ యజ్ఞం' నిర్వహించాడు.

– ఇదే కరుణానిధి అతని కుటుంబం సభ్యులు పుట్టపర్తి సాయిబాబాను దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. జనవరి 2007లో సాయిబాబాని అభ్యర్థించి ఇంటికి పిలిపించుకొని మరీ అయన భక్తులయ్యారు. ఈ భక్తికి ఇంకో కారణం ఉంది. పుట్టపర్తి సాయిబాబా తమిళనాడులో త్రాగునీటి సరఫరాకు దాదాపు రూ. 200 కోట్లు విరాళంగా ఇచ్చారని విషయం తెలిసిన వారు చెప్తుంటారు. ఏ ధర్మమైతే సాయం చేసి రక్షించిందో, దానినే తిట్టడము తి.ము.క కే చెల్లింది.

– కరుణానిధి కూతురు కనిమొళి రాజ్యసభ ఎం.పి. దేశంలోని వివిధ ప్రదేశాలలో రక్షణ వ్యవస్థ గురించి అధ్యయనం చేయడానికి ఏర్పడింది. ఆ కమిటీలో కనిమొళి సభ్యురాలు. వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో ఒక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కమిటీ తిరుమలకు వచ్చినప్పుడు కనిమొళి స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలను స్వీకరించింది. టీటీడీ ఇచ్చిన చీరను సంతోషంగా తీసుకొంది. ఇది జరిగింది నవంబర్ 2012లో. విషయం ఇక్కడితో ఆగలేదు. జనవరి 2018లో తిరుచ్చిలో జరిగిన 'ప్రపంచ నాస్తిక మహాసభ'లో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసింది. సెక్యూరిటీ గురించి హేళనగా మాట్లాడింది. తనను తాను రక్షించుకోలేని దేవుడు భక్తులను ఎలా కాపాడుతాడు? అని ప్రశ్నించింది. ఈ వ్యాఖ్యలు చేసినందుకు ఆవిడపై సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లోను, కరీంనగర్ లోను కేసులు నమోదు చేశారు. ఇంత కుసంస్కారం ఉన్న వీళ్లు నాయకులవడం మన ఖర్మ.

అవినీతి విషయానికొస్తే, ద్రావిడ పార్టీలూ దొందూ దొందే.. నాయకులూ ఒకరికొకరు తీసిపోరు. 'సైంటిఫిక్ కరప్షన్' చేయడంలో కరుణానిధి కుటుంబాన్ని మించినవారు లేరని పరిశీలకులు అంటారు. సర్కారియా కమిషన్ రిపోర్ట్ చదివితే మనకు వీరి కార్యాచరణ విధానం తెలుస్తుంది. ఈ మధ్యనే సెంథిల్ బాలాజీ గురించి మనం చూశాం! ఇతగాడు పలు పార్టీలలో తిరిగి ఈ మధ్యనే తి.ము.కలో చేరి మంత్రయ్యాడు. ఇతడు

అ.తి.ము.క లో ఉన్నప్పుడు విమర్శించిన స్టాలిన్, తన పార్టీలో చేర్చుకోవడమే కాదు, మంత్రిమండలిలో ముఖ్యమైన శాఖలను కట్టబెట్టాడు. చివరకు పాత కేసులు కారణంగా కోర్టు ఆదేశాల మేరకు ఇప్పుడు జైలులో ఉన్నాడు.

**మారుతున్న సమాజం,**
**మార్పు కోరుతున్న ప్రజలు**

60 ఏళ్ల తరువాత ద్రవిడ సిద్ధాంతాలకు కాలం చెల్లింది. తమిళ ప్రజలు మేల్కొని మార్పు కోరుతున్నారు. కొత్తతరం యువత ద్రవిడవాదం పట్ల ఆసక్తి చూపటం లేదు. భ్రమలన్నీ తొలగిపోయాయి. ప్రత్యామ్నాయం దొరికితే, దానిని అందిపుచ్చుకోవడానికి తమిళ సమాజం ఆయత్తమవుతోంది. ద్రవిడవాదాన్ని త్రోసిపుచ్చే పార్టీలు ఇప్పుడు తమిళనాట వేళ్లూను కొంటున్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పవలసినవి 'భారతీయ జనతా పార్టీ' (బి.జె .పి), 'నామ్ తమిళర్ కచ్చి' (ఎన్.టి.కె.).


కరుణానిధి


ఎం.కె. స్టాలిన్


ఉదయనిధి

కాంగ్రెస్ పార్టీ పేరుకు మాత్రమే జాతీయ పార్టీ. 1967లో అధికారం కోల్పోయిన తరువాత, అది రెండు ద్రవిడ పార్టీలకూ తోక పార్టీగా వ్యవహరించిందే తప్ప, ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా నిలబడలేక పోయింది. కమ్యూనిస్ట్ పార్టీలదీ అదే దారి. తి.ము.క ఇచ్చే విరాళాలతో నెట్టుకొస్తున్నారు. వీటి రెండు నాల్కల ధోరణి పట్ల సామాన్య ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ఆ మధ్య 2020 లో తి.ము.క వాళ్లు 'హిందీ తెరియాదు పోడా' అనే కాప్షన్‌తో టీ-షర్ట్స్ ముద్రించి పంచారు. మోలీవుడ్ హీరోలు కొందరు కూడా ఈ టీ-షర్ట్స్ వేసుకొని ఊరేగారు. ఇందులో ఉదయనిధి ఒకడు. ఇదే ఉదయనిధికి చెందిన 'రెడ్ జైంట్ ఫిలిమ్స్' ఆమీర్ ఖాన్ 'లాల్ సింగ్ చద్దా' సినిమాకు తమిళనాట డిస్ట్రిబ్యూటర్. ఈ సినిమా ప్రమోషన్ కోసం ఉదయనిధి వేయని గంతులంటూ లేవు. ఈ మధ్యనే విడుదలైన షారుఖ్ ఖాన్ సినిమా 'జవాన్'ను కూడా ఈ సంస్థే పంపిణీ చేసింది. 2020లో 'హిందీ తెరియాదు పోడా' అన్న పార్టీ, ఇవ్వాళ తమ ఐటీ వింగ్‌లో పనిచేయటానికి హిందీ తెలిసిన వారు కావాలంటూ ప్రకటన జారీ చేసింది. స్టాలిన్‌కు ప్రధానమంత్రి అవ్వాలన్న కోరిక, హిందీ పట్ల వారికున్న ద్వేషాన్ని తుడిచిపెట్టేసింది. దీనికి ముఖ్య కారణం ఫరూక్ అబ్దుల్లా. ఈ మధ్య జరిగిన ఐ.ఎన్.డి.ఐ.కూటమి సమావేశంలో ఎంకే స్టాలిన్‌కు కూడా ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందని అనేశాడు. ఆ మాటతో స్టాలిన్ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాడని అంటున్నారు. ఈ ప్రణాళికలో భాగంగానే తన కొడుకు ఉదయనిధికి తమిళనాడు పగ్గాలు చేపట్టడానికి తర్ఫీదు ఇస్తున్నట్లు భోగట్టా. దేశవ్యాప్తంగా స్టాలిన్ ప్రభ పెంచడానికి, ఈ మధ్య తమిళనాడు ప్రభుత్వం అమర్ ఉజాలా, దైనిక్ జగరణ్ వంటి హిందీ పత్రికలలో ప్రకటనలు ఇవ్వడం మొదలెట్టింది.

ఇంకో ముఖ్య విషయం. ముఖ్య ద్రావిడ నాయకులందరికీ విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రాథమిక స్థాయి పాఠశాలల నుండి మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల వరకు వీరు లేని విద్యారంగ మంటూ లేదు. వీటిలో సి.బి.ఎస్.ఈ. లేదా ఐ.సి.ఎస్.ఈ సిలబస్ బోధిస్తారు. 'త్రీ లాంగ్వేజ్ ఫార్ములా' కింద హిందీ తప్పనిసరి. తమిళ భాషకు ఉద్ధరణకు వీరు ప్రత్యేకంగా చేసిందంటూ ఏమీలేదు. సోషల్ మీడియాలో ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిసిపోతున్నాయి. మాటల గారడీతో ఇక ప్రజలను మభ్యపెట్టడం కష్టం.

ప్రజలు పార్టీలను అధికారం నుండి తొలగించినా, నాయకులు పార్టీ మారి తిరిగి అధికారం చెలాయిస్తున్నారు. ఇప్పుడున్న స్టాలిన్ మంత్రిగణంలో 8మంది మంత్రులు, అ.తి.ము.క నుండి వచ్చినవారే. వీరికి ముఖ్యమైన శాఖలు ఇచ్చారు. ప్రతి జిల్లాలో కొంతమంది శక్తిమంతులున్నారు. తరతరాలుగా వారు, వారి పిల్లలు మాత్రమే ఎంపీ లేదా ఎంఎల్ఏలు. దొర్రై మురుగన్ ప్రస్తుతం నీటి పారుదల శాఖా మంత్రి. మంత్రి వర్గంలో ఇతడే అందరికంటే సీనియర్. వెల్లూర్ జిల్లాలో ఇతడు మకుటం లేని మహారాజు. కాట్పాడి నియోజకవర్గం నుండి 1971 నుండి 2021 వరకు 12 సార్లు వరుసగా పోటీ చేసి 10సార్లు గెలిచాడు. ఇతడి కుమారుడు కథిర్ ఆనంద్ వెల్లూర్ నియోజక వర్గం నుండి 2019లో ఎంపీగా గెలిచాడు. తిరుచ్చి జిల్లాలో కే.ఎన్. నెహ్రూ, తిరుచ్చి శివ, దిండిగల్ జిల్లా నుండి ఐ.పెరియసామి, మదురై నుండి పళనివెల్ త్యాగరాజన్ లేదా స్టాలిన్ సోదరుడు అళగిరి, విల్లుపురం జిల్లా నుండి కే.పొన్ముడి, విరుధ్‌నగర్ నుండి తంగం తెన్నరసును, శ్రీపెరంబుదూర్ ఎంపీ టి.ఆర్.బాలు ఇంకొన్ని ఉదాహరణలు. ఒక 20 కుటుంబాలు తమిళనాడు రాజకీయాల్ని శాసిస్తూ, అధికారం చెలాయిస్తున్నాయి. ఇక అ.తి.ము.క నుంచి అయితే తేని జిల్లాలో ఓ.పన్నీరుసెల్వం తిరుగులేని నాయకుడు, అలాగే సేలం జిల్లాలో ఏడప్పడి పళనిసామికి పట్టు ఉంది. ఈ నాయకులందరికీ ఆదర్శం కరుణానిది. పార్టీలోను, ప్రభుత్వంలోను ఈ కుటుంబ సభ్యులదే హవా. ఏ పదవీ లేకపోయినా, స్టాలిన్ అల్లుడు శబరీశన్ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటాడని, కావలసిన వాళ్లను కీలక పదవులలో నియమించుకున్నాడని చెప్పుకుంటారు. కరుణానిధికి మేనల్లుడు స్వర్గీయ మురసోలి మారన్. ఇతని కుమారులే కళానిధి మారన్, దయానిధి మారన్. ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వంలో దయానిధి మారన్ మంత్రి, ప్రస్తుతం ఎంపీ. కరుణానిధి మరొక కుమారుడు ఎం.కే. అళగిరి ఒకప్పుడు కేంద్ర మంత్రి. స్టాలిన్‌తో మనస్పర్థల కారణంగా ప్రస్తుతం పార్టీకి దూరంగా ఉంటున్నాడు.

సమాజంలో దురాచారాలకు వర్ణ వ్యవస్థ కారణమని, ఆర్యులైన బ్రాహ్మణులు సనాతన ధర్మాన్ని తెచ్చారని కట్టు కథలు చెపుతూ ఇన్నాళ్లూ ప్రజలను నమ్మించ గలిగారు. ప్రజలు కూడా నెమ్మదిగా వాస్తవాలను గ్రహించగలుగుతున్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు అని ఊక దంపుడు కబుర్లే కానీ, ఆచరణలో మాత్రం వీరిని మించిన జాత్యహంకారులు కనబడరు. తోల్ తిరుమావళవన్ ' విడుదలై చిరుతై కచ్చి' పార్టీకి చెందిన ఎంపీ. ఆ పార్టీ అధ్యక్షుడు. ప్రస్తుతం ఈ పార్టీ తి.ము.క కూటమిలో ఉంది. మంత్రి రాజకన్నప్పన్‌ను పుట్టినరోజు సందర్భంగా కలవడానికి జులై 2021లో ఎంపీ తిరుమావళవన్ ఆయన ఇంటికి వెళ్లాడు. ఆ సందర్భంగా విడుదలైన ఫోటోలు తమిళనాట సంచలనం సృష్టించాయి. సింహాసనం వంటి కుర్చీలో రాజకన్నప్పన్, అతడి ఎదురుగా చేతులు కట్టుకొని ప్లాస్టిక్ కుర్చీలో కూర్చొని ఉన్న తిరుమావళవన్ చిత్రం చూసిన తరువాత, దళిత సంఘాలు, సంస్థలు తి.ము.కను విమర్శించాయి. దళితుడనే కారణంగానే ఒక ఎంపీని అవమానించారని ఆరోపించాయి. గత జనవరిలో సేలం జిల్లాలోని తిరుమలగిరి గ్రామంలో ఒక దళిత యువకుడు గుడిలోకి ప్రవేశించాడని, తి.ము.క కు చెందిన మాణికం అనే పంచాయతీ అధ్యక్షుడు ఆ యువకుడిని దుర్భాషలాడాడు. ఆ వీడియో బాగా వైరల్ అవడంతో, ఆ నాయకుడిని పార్టీ నుండి సస్పెండ్ చేయాల్సి వచ్చింది. ఇప్పటికి

చాల గ్రామాలలో, దళిత నాయకులకు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో వేదికపైన చోటుండదు. ఒకవేళ చోటు కల్పించినా, ఒక చివర. వేంగై వాసల్ ఉదంతం: వేంగై వాసల్ అనేది పుదుక్కోట్టై జిల్లాలో ఒక చిన్న గ్రామం. గత సంవత్సరం డిసెంబర్ నెలలో, దళితుల కాలనీకి మంచి నీరు అందించే నీటి ట్యాంకులో ఎవరో మానవ మలాన్ని కలిపారు. పోలీస్ కేసు నమోదు చేసి, విచారణ జరుగుతూనే ఉంది. ఇప్పటికీ దోషులెవరో బయట పడలేదు. ఈ ఒక్క ఉదాహరణ చాలు ద్రవిడ ప్రభుత్వాలకు దళితులపైన ఎంత ప్రేమ ఉందో తెలుసుకోవడానికి. స్టాలిన్ మంత్రివర్గంలోని 34 మంత్రులలో, కేవలం ఇద్దరు దళితులు. పార్టీలో కూడా 65 మంది జిల్లా కార్యదర్శులలో ఒక్కడే దళితుడు.


మీడియా, పత్రికా స్వాతంత్రం విషయాలలో కూడా వీరిది రెండు నాల్కల ధోరణే. బద్రి శేషాద్రి జాతీయ భావాలు కల రాజకీయ విశ్లేషకుడు, పబ్లిషర్. జులై 2023లో ఒక ఇంటర్వ్యూలో ప్రధాన న్యాయమూర్తి గురించి చేసిన ప్రస్తావనను ఆధారంగా చేసుకొని, కోర్టు ధిక్కార నేరం క్రింద అరెస్టయినారు. బద్రి శేషాద్రి రెండు రోజులలో బెయిల్ మీద బయటకు వచ్చేశాడు. అలాగే యు-ట్యూబర్‌లు మరిదాస్, కిశోరస్వామి వంటి వారు కూడా తి.ము.క పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు అరెస్టయ్యారు. వీరి అరెస్టుకు చెప్పిన కారణం, వీరివలన వర్గ వైషమ్యాలు పెరిగి, సమాజంలో శాంతిభద్రతలకు సమన్య కలుగుతున్నది. అయితే ద్రవిడ అనుయాయులు ఎన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, దుర్భాషలాడినా పట్టించుకోరు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని గురించి ఎంత నీచంగా మాట్లాడినా, రాసినా చర్యలు ఉండవు. అది పత్రికా స్వాతంత్రం. ప్రదీప్ అనే యువకుడు సోషల్ మీడియాలో స్టాలిన్‌పై కామెడీ మీమ్ వేసినందుకు అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. కార్తీక్ గోపినాథ్ అనే యు-ట్యూబర్, కూల్చి వేసిన హిందూ దేవాలయాలను పునర్నిర్మించడానికి ప్రయత్నం చేస్తే, ప్రజలను మోసంచేసి, సొమ్మును దుర్వినియోగం చేశాడనే నేరం మోపి, 2022లో దాదాపు నెలరోజులు జైల్లో ఉంచారు.

గత 60 ఏళ్ల ద్రవిడ పాలనలో,ఈ రెండేళ్ల స్టాలిన్ పాలన మరీ ఘోరం. స్పష్టమైన కార్యాచరణ పథకం లేదు. పార్టీ సీనియర్ల కంటే అధికారులను ఎక్కువగా నమ్మటం వలన పరిపాలన కుంటుపడింది. పదేళ్ల విరామం తరువాత అధికారం దొరకడంతో, ఇక మళ్లీ అధికారం వస్తుందో రాదో అన్నట్టు అందినంత దోచుకుంటున్నారు. తి.ము.క పార్టీలో స్టాలిన్ తరువాత చెప్పుకోదగ్గ నాయకులెవరు లేరు. ఉదయనిధి రాజకీయాలకంటే సినిమాలపైనే ఎక్కువ మోజుపడుతున్నాడు. రాజకీయాలలో పెద్దగా అనుభవం లేనందువలన పార్టీని ఒక్క తాటిపై నడిపిస్తాడనే నమ్మకం ఎవరికీ లేదు. ఉదయనిధికి ఎక్కడ పోటీ అవుతుందోనని, కనిమొళికి కీలక బాధ్యతలు ఇవ్వకుండా, ఢిల్లీకి పరిమితం చేసేశారు. మారన్ సోదరులు కూడా పరిస్థితులను గమనిస్తూ వారి వ్యాపార సామ్రాజ్యాలను సుస్థిర పరచుకుంటున్నారు. ఈ మధ్యనే పెరిగిన ఐ.టి, ఈ.డి దాడులతో చాలమంది కీలక మంత్రులు జైలుకెళ్లే అవకాశముంది. ఈ పరిస్థితులలో తి.ము.క పార్టీకి రాబోయేవి గడ్డు రోజులే. ఇక అ.తి.ము.క విషయానికి వస్తే, ఏడప్పడి పళనిసామి పార్టీని తన చేతుల్లోనికి తీసుకొన్నా, ఎంతవరకు దానిని నిలబెట్టుకోగలడు అనేది ప్రశ్నర్ధకమే. పన్నీరుసెల్వం, టి.టి.వీ. దినకరన్, శశికళ వంటివారు సమయం కోసం వేచి చూస్తున్నారు.

తమిళ ప్రజల ముందు ఇప్పుడున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? ద్రవిడ పార్టీలను ప్రక్కన పెడితే, కొత్తగా బలపడుతున్న పార్టీలు 'భారతీయ జనతా పార్టీ', 'నామ్ తమిళర్ కచ్చి'. పాటాలి మక్కల్ కచ్చి, విదుదలై చిరుతై కచ్చి, దేశీయ మున్నేట్ర ద్రావిడ కళగం, మరుమలార్చి ద్రావిడ మున్నేట్ర కళగం వంటి పార్టీలు కొన్ని ప్రాంతాలకు పరిమితం. ఇవి పెద్ద పార్టీలతో కలసి ఎన్నికలలో పోటీ చేస్తాయి, స్వంతంగా నిలబడే శక్తి వీటికి లేదు.

నామ్ తమిళర్ కచ్చి (ఎన్. టి. కే) 2010 మే నెలలో స్థాపించారు. ఈ పార్టీని స్థాపించింది సీమాన్ అనే సైమన్ సెబాస్టియన్. నాడార్ సామాజిక వర్గానికి చెందిన ఇతని స్వస్థలం శివగంగై జిల్లాలోని అరనియూర్. బాల్యంలో ఇతడు ద్రవిడ భావజాలానికి ఆకర్షితుడైనవాడే. సినిమా రంగంలో కొద్దికాలం దర్శకునిగా, నటుడిగా అనుభవం ఉంది. సీమాన్‌కు 2008లో ఎల్.టి.టి.ఈ నాయకుడు వేలుపిళ్లై ప్రభాకరన్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి అతడు 'తమిళ దేశీయం' సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. సీమాన్ 2009లో నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ క్రింద రెండు సార్లు అరెస్టయ్యాడు. ఎన్.టి.కే పార్టీ ముఖ్య సిద్ధాంతం, 'తమిళనాడును తమిళులే పాలించాలి'. ఈ పార్టీని 2010లో స్థాపించినప్పటికీ, దీనికి మూలాధారం 'నామ్ తమిళర్ ఇయక్కం' అనే 1958 లో స్థాపించిన సంస్థ. తమిళనాడు, శ్రీలంకలోని కొన్ని ప్రాంతాలతో ప్రత్యేక తమిళదేశం ఏర్పాటు చేయాలనేది ఈ సంస్థ లక్ష్యం. ద్రవిడ పార్టీల వెల్లువలో కనపడకుండా పోయిన ఈ వాదం, తిరిగి 'నామ్ తమిళర్ కచ్చి'గా అవతారం దాల్చింది. ఎన్.టి.కె. పార్టీకి యువతలో ఆదరణ పెరుగుతోంది. 2016 శాసనసభ ఎన్నికలలో 1% ఓట్లు సాధించిన ఈ పార్టీ, 2021 శాసన సభ ఎన్నికలలో దాదాపు 7% ఓట్లు సాధించింది. వీరు తమను భారతీయులుగా కాక, తమిళులుగా చెప్పుకోవడానికి ఇష్టపడతారు. తమిళ ఇతిహాసం, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పూర్తిగా ఆదరించినప్పటికీ, వీరి వేర్పాటువాద ధోరణి ఇబ్బంది కలిగించే విషయమే. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిఘా సంస్థలు ఈ పార్టీ వ్యవహారాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. సీమాన్ నియంతృత్వ పోకడలు, విలాసవంతమైన అలవాట్ల కారణంగా చాలామంది 'సెకండ్ లేయర్' నాయకులు వేరే పార్టీలకు వెళ్లిపోతున్నారు.

బీజేపీ ఈ మధ్యకాలంలో, ముఖ్యంగా అన్నామలై నాయకత్వం చేపట్టిన తరువాత పుంజుకుంది. అగ్రకుల పార్టీగానో, హిందీవాళ్ల పార్టీగానో భావించే రోజులుపోయి,సామాన్యజనం ఆదరిస్తున్నారు. పార్టీ కేంద్ర నాయకత్వం చేపట్టిన "సోషల్ ఇంజనీరింగ్" కసరత్తులు, మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కేంద్ర ప్రభుత్వ స్కీంల గురించి ప్రజలు తెలుసుకొంటున్నారు. తమిళ భాష పట్ల బీజేపీ నాయకులు, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ చూపిస్తున్న అభిమానం, గౌరవం వారి మనసుల్ని గెలుచుకున్నాయి. కాశీ తమిళ్ సంగమం నిర్వహణ, కొత్త పార్లమెంట్ భవనంలో 'సెంగోల్' ప్రతిష్ఠ, చెన్నైలో రెండవ ఎయిర్‌పోర్టుకు కావలసిన నిధుల మంజూరు మొదలైన విషయాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా 'సెంగోల్'ను ప్రతిష్ఠించడానికి తమిళనాడు నుండి మఠాధిపతులను ఆహ్వానించి వారిని గౌరవించిన విధానం తమిళ దేశపు ఆస్తికులకు ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది. కేంద్ర మంత్రివర్గంలో ముగ్గురు తమిళులు ఉండడం (నిర్మల సీతారామన్,ఎస్. జైశంకర్, ఎల్. మురుగన్) మూడు రాష్ట్రాలకు తమిళ నాయకులను గవర్నర్‌లుగా నియంచడము (సి.పి. రాధాకృష్ణన్, గణేశన్, తమిళిసై సౌందరాజన్) బీజేపీకి లాభించే అంశాలే. ఈరోజు మనం చిన్న చిన్న గ్రామాలలో కూడా బీజేపీ జెండాలను చూస్తున్నాం. సోషల్ మీడియాను ఇతర పార్టీల కంటే బీజేపీ చక్కగా ఉపయోగించుకొంటున్నదని చెప్పక తప్పదు. మారిన రాజకీయ సమీకరణాల దృష్ట్యా, బీజేపీ ఇతర చిన్న పార్టీలతో వ్యూహాత్మక కూటమిగా ఏర్పడి పోటీ చేస్తే రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఆశ్చర్యకరమైన, అనుకూల ఫలితాలు వచ్చే అవకాశముంది. ★




**ఎ. రాధాకృష్ణన్**

విశ్రాంత బ్యాంక్ అధికారి



# ఏకకాలంలో 11 రాష్ట్రాలకు 'వందే భారత్' అనుసంధానం

**నగరాల్లో నిరంతర అనుసంధాన సృష్టి చాలా కీలకం. ఈ మేరకు రవాణా రంగాన్ని సత్వర ప్రగతికి ఓ హామీగా భారత్ పరిగణిస్తోంది. తదనుగుణంగా వేగంతోపాటు స్థాయి రీత్యా కూడా ఆధునిక అనుసంధానంలో దూసుకెళుతోంది. ఈ బలమైన అనుసంధానంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబర్ 24న ఒకేసారి 9 వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. ఈ రైళ్లు 11 రాష్ట్రాలకు హైస్పీడ్ అనుసంధానం కల్పించాయి. వందే భారత్ రైలు ఎక్కడికి వెళ్లినా పర్యాటకుల సంఖ్య, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి కాబట్టి కొత్త ఉద్యోగ అవకాశాల సృష్టికీ వీలు కలుగుతుంది.**

దేశంలోని రైలు ప్రయాణికులకు అనుసంధానం మెరుగుతోపాటు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా 9 కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల ప్రారంభంతో వివిధ రాష్ట్రాల మధ్య నడుస్తున్న ఈ రైళ్ల సంఖ్య 34కు చేరింది. తాజాగా 9 రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ– దేశంలో పరస్పర తోడ్పాటుతో నడిచే బహుళరంగ రవాణా అనుసంధానంపైనా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కృషి వెనుక ప్రధాన లక్ష్యం భారత పౌరులకు ప్రయాణ సౌలభ్యం కల్పించడంతోపాటు సమయం ఆదా చేయడమేనని చెప్పారు. ఈ స్ఫూర్తి వందే భారత్ రైళ్లలో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రవేశపెట్టడంలో లక్ష్యం నెరవేరుతోంది. ప్రయాణ సమయాన్ని కనీస స్థాయికి తగ్గించుకోవాలని భావించేవారికి ఈ రైలు చాలా కీలకమైనది. అలాగే మరొక నగరానికి వెళ్లి, కొన్ని గంటల్లో పని ముగించుకుని అదేరోజు తిరిగి రావడానికి ఉపయోగపడుతోంది. కాబట్టే, వందేభారత్‌కు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటిదాకా ఈ రైళ్లలో 1.11 కోట్ల మంది ప్రయాణించగా, నానాటికీ ఈ సంఖ్య పెరుగుతోంది. కొత్తగా ప్రవేశపెడుతున్న రైళ్లు మునుపటికన్నా మరికొంత ఆధునిక సదుపాయాలతో వస్తున్నాయని ప్రధాని తెలిపారు. వందే భారత్ రైలు భారతదేశంలో నవ్యోత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నదని ఆయన అభివర్ణించారు. వందేభారత్ దేశంలోని మూలమూలలనూ కలుపుతుందన్నారు.

దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు భారతీయ రైల్వే అత్యంత నమ్మకమైన తోడుగా ఉంది. అందుకే నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారతీయ రైల్వేల పునరుజ్జీవన ప్రక్రియలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా రైల్వేలకు బడ్జెట్ కేటాయింపులు పెంచింది. ఈ మేరకు 2014తో పోలిస్తే ప్రస్తుత ఏడాదిలో ఎనిమిది రెట్లు అధికంగా కేటాయించింది. రైల్వే లైన్ల డబ్లింగ్, విద్యుదీకరణ, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, కొత్త మార్గాల నిర్మాణం వగైరాలన్నీ శరవేగంగా సాగుతున్నాయి. కొద్దిరోజుల కిందటే దేశవ్యాప్తంగా 500కు పైగా ప్రధాన రైల్వే స్టేషన్లలో పునరుద్ధరణ,

## ప్రగతిని పరుగులు పెట్టించిన 9 వందే భారత్ రైళ్లు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 9 వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఇవి 11 రాష్ట్రాల్లో.. రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బిహార్, పశ్చిమ బంగాల్, కేరళ, ఒడిషా, ఝార్ఖండ్, గుజరాత్‌తో అనుసంధానం పెంచుతాయి.

**కొత్త వందే భారత్ రైళ్లు ప్రారంభమైన మార్గాలివే:**

1. ఉదయ్‌పూర్– జైపూర్ వందే భారత్ ఎక్స్ ప్రెస్
2. తిరునెల్వేలి – మదురై చెన్నై వందే భారత్ ఎక్స్ ప్రెస్
3. హైదరాబాద్ –బెంగళూరు వందే భారత్ ఎక్స్ ప్రెస్
4. విజయవాడ–చెన్నై (రేణిగుంట మీదుగా) వందే భారత్ ఎక్స్ ప్రెస్
5. పాట్నా– హౌరా వందే భారత్ ఎక్స్ ప్రెస్
6. కాసరగోడ్ – తిరువనంతపురం వందే భారత్ ఎక్స్ ప్రెస్
7. రౌర్కెలా–భువనేశ్వర్– పూరీ వందే భారత్ ఎక్స్ ప్రెస్
8. రాంచీ హౌరా వందే భారత్ ఎక్స్ ప్రెస్
9. జామ్నగర్ అహ్మదాబాద్ వందే భారత్ ఎక్స్ ప్రెస్



ఈ తొమ్మిది వందే భారత్ రైళ్లు అత్యధిక వేగంతో ప్రయాణిస్తూ, ప్రయాణికులకు ఎంతో విలువైన సమయాన్ని ఆదా చేస్తున్నాయి.

రౌర్కెలా–భువనేశ్వర్– పూరీ వందే భారత్‌తో పాటు కాసరగోడ్– తిరువనంతపురం మార్గంలో నడిచే ఇతర రైళ్లకన్నా అత్యధిక వేగంతో, అంటే. దాదాపు మూడు గంటల సమయం ఆదా అయ్యేంత వేగంగా పరుగుతీస్తాయి.

హైదరాబాద్ –బెంగళూరు మార్గంలో ఈ రైలు వల్ల 2.5 గంటలకు పైగా సమయం ఆదా అవుతుంది. అలాగే తిరునల్వేలి–మదురై, చెన్నై–మధురై–చెన్నై –ఎక్స్ ప్రెస్ 2 గంటలకు పైగా సమయాన్ని ఆదా చేస్తోంది.

రాంచీ–హౌరా, పాట్నా–హౌరా, జామ్ నగర్–అహ్మదాబాద్ మార్గాల్లోనూ వందే భారత్ ఒక గంటదాకా సమయం ఆదా చేస్తోంది.

ఉదయపూర్ జైపూర్ వందే భారత్ అరగంట ముందుగానే గమ్యం చేరుతుంది.

సుందరీకరణ పనులు ప్రారంభమైనట్లు ప్రధాని ప్రకటించారు. 'అమృత్ కాలం'లో నిర్మితమవుతున్న వీటిని ఇకపై "అమృత స్టేషన్లు"గా వ్యవహరిస్తారు. ఇవి నవభారతానికి సరికొత్త ముఖచిత్రంగా మారనున్నాయి.

కొత్తగా ప్రారంభమైన 9 వందేభారత్ రైళ్లు ప్రధాని దార్శనికతకు అనుగుణంగా దేశంలోని ముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రదేశాలకు అనుసంధానాన్ని మెరుగు పరుస్తాయి. రౌర్కెలా–భువనేశ్వర్–పూరీ మార్గంలోని రైలు, తిరునల్వేలి–మదురై –చెన్నై మార్గంలో ప్రయాణించే రైలు దేశంలో కీలక ఆధ్యాత్మిక పట్టణాలు పూరీ–మదురైలను కలుపుతాయి. అలాగే రేణిగుంట మీదుగా నడిచే విజయవాడ–చెన్నై రైలు తిరుమల పుణ్యక్షేత్రానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది.

**రైల్వే స్టేషన్ల వ్యవస్థాపక దినోత్సవం**

భారతీయ రైల్వే స్టేషన్ల వ్యవస్థాపక దినోత్సవాలు నిర్వహించడం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్, ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్, పుణే సహా అనేక స్టేషన్ల స్థాపన దినోత్సవాలు నిర్వహించింది. కాగా, కోయంబత్తూరు రైల్వే స్టేషన్ ప్రయాణికుల సేవలో 150 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడీ సంప్రదాయం మరింత విస్తరించిన నేపథ్యంలో ప్రజలు కూడా దీనితో అధికంగా మమేకం అవుతున్నారు.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి

# సంచార తెగల బాలికలకు కుమారీ పూజ




**భాగ్యనగర్:** చిక్కడపల్లిలోని సూర్య నగర్‌లో సంచార తెగల చిక్కడపల్లి వీరభద్రీయ (వీరముష్టి) సంఘం దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించింది. అందులో భాగంగా అక్టోబర్ 20వ తేదీన ఆ మండపం వద్ద సంచార తెగల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆ తెగల బాలికలకు కుమారీపూజ కార్యక్రమం నిర్వహించారు. మొండిబండ, బెడ బూడగ జంగం, నక్కల, గంగిరెద్దుల, వీర భద్రీయ (వీర ముష్టి), ఎరుకల తదితర సంచార తెగలకు చెందిన సుమారు 120 బాలికలను పూజించారు. తొమ్మిదేళ్ల వయసులోపు బాలికను సరస్వతీ దేవిగా భావించి అర్చించారు. సంచార తెగేతరులు (ఉన్నత సామాజిక వర్గం) ఆ బాలికల కాళ్లు కడిగి, పసుపు రాసి, ముఖాలను గంధంతో అలంకరించి, పూలతో పూజించారు. హారతులు ఇచ్చారు. నూతన వస్త్రాలు సమర్పించారు. 'కుమారీ'లు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. సామాజిక సమరసత తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరయ్యారు. సంచార తెగల తెలంగాణ కన్వీనర్ సువీర్, సంచార తెగల సంక్షేమ సమితి కన్వీనర్ సిద్ధిరాఘవేంద్ర, సభ్యులు మిట్టపల్లి చిరంజీవి, చెవ్వ చిత్తరంజన్, పొన్నాల నరసింహ, అభయ ఆంజనేయ దేవస్థానం చైర్మన్ పొన్నాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.★




పుస్తక ఆవిష్కరణోత్సవంలో గరుడ ప్రచురణల సంస్థకు చెందిన పాథక్, సునీల్ అంబేకర్, స్మృతి ఇరానీ, పుస్తక రచయిత్రి రష్మీ సామంత్

# ఆక్స్‌ఫర్డ్‌లో ఓ హిందూ విద్యార్థిని పడిన క్షోభ

గొప్ప ఇంటిపేరు. కానీ ఇంట్లో గబ్బిలాల కంపు అని సామెత. ఈ తెలుగు సామెత పేరు ప్రఖ్యాతులు ఉన్న చాలా పాశ్చాత్య దేశాల విశ్వవిద్యాలయాలకు వర్తిస్తుంది. ఎంతో చరిత్ర, చదువుల విషయంలో నైపుణ్యం ఉన్న ఆ విద్యాలయాలు వర్ణ వివక్షకు, జాత్యహంకారానికి కూడా నిలయాలుగా ఉంటున్నాయి. అందులో ఇంగ్లండ్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ఒకటి. ఇక్కడ చదువుకున్న భారతీయ యువతి రష్మీ సామంత్. హిందూత్వవాది ముద్ర వేసి ఈమెను అక్కడి కొందరు ప్రొఫెసర్లు, విద్యార్థులు వేధించారు. విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాతే ఇవన్నీ ఎదుర్కొన్నదామె. ఫలితం ఆమె చదువు వదిలి రావలసి వచ్చింది. ఆ దారుణ అనుభవం, దాని నుంచి బయటపడిన తీరుతెన్నులను, ఇతర అనుభవాలన్నింటినీ క్రోడీకరిస్తూ ఆమె రాసిన పుస్తకమే 'ఏ హిందూ ఇన్ ఆక్స్‌ఫర్డ్'. ఈ పుస్తకాన్ని అక్టోబర్ 4న ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ఆవిష్కరించారు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ, ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.




రష్మీ కర్ణాటకలోని ఉడిపి ప్రాంతానికి చెందిన యువతి. ఆమె ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేరింది. అక్కడి విద్యార్థి సంఘానికి అధ్యక్షురాలిగా కూడా ఎన్నికయింది. అయితే ఆమె తీవ్రమైన వివక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. ఎనర్జీ సిస్టమ్‌లో మాస్టర్ డిగ్రీ చేయడానికి రావలసినదంటూ 2020లో ఆమెకు సమాచారం వచ్చింది. తన కల పండిందని ఆమె ఎంతో ఆనందించింది. అది కొవిడ్ సమయం. అయినా చదువులోను, ఆ చరిత్రాత్మక విద్యాలయం ప్రాంగణంలోను ఎదురైన అనుభవాలను ఆమె సమర్థంగానే ఎదుర్కొన్నది. విద్యార్థి సంఘం ఎన్నికలలో ఆమె పాల్గొన్నప్పుడు ఆమె ఇచ్చిన ఉపన్యాసం కాలగర్భంలో కలసిన కాలనీల గురించే. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘానికి ఎన్నికైన తొలి హిందువుగా కూడా ఖ్యాతిగాంచింది. అయితే ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఒక హిందువు నాయకత్వంలో నడవడానికి సిద్ధంగా లేరు అంటూ కొందరు ఉద్యమం ప్రారంభించారు. ఒక పద్ధతి ప్రకారం ఆమె మీద కొందరు ప్రొఫెసర్లు, విద్యార్థులు దాడి ప్రారంభించారు. అదంతా హిందూత్వం పట్ల ఆమెకు ఉన్న మొగ్గు ప్రాతిపదికగానే చేశారు. ఆఖరికి ఆమెను చంపుతామని బెదిరింపులు కూడా వచ్చాయి.


ఈ దేశ యువతను వలసవాద తత్త్వం నుంచి ఆలోచనల నుంచి విముక్తం చేయవలసిన అవసరం ఉందని సునీల్ అంబేకర్ పిలుపునిచ్చారు. ఉదారవాదం పైన, ఆధునికత పట్ల కొన్ని దేశాలు, కొన్ని సమూహాలు గుత్తాధిపత్యం వహిస్తున్నాయని, కానీ వాళ్ల నిర్వచనాలకీ, సూత్రీకరణలకీ మనం తల ఒగ్గవలసిన అవసరం లేదనీ, మనదైన ధర్మం నుంచి మాత్రమే మనం మన అభిప్రాయాలను ఏర్పరుచుకోవాలని అంబేకర్ పిలుపునిచ్చారు. సనాతనిగా అంటే ఒక హిందూ యువతిగా రష్మీ ఎంతో సాహసోపేతంగా వ్యవహరించగలిగారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రశంసించారు. తన అస్తిత్వంపై జరిగిన దాడిని ఎదుర్కొన్న ఒక యువతి గాథను ఇందులో చదువుతామని ఇరానీ అన్నారు. యుద్ధ సమయంలో లైంగిక అత్యాచారానికి గురైన మహిళ అంతరంగం ఎంత కలత చెందుతుందో అంతే కలతను రష్మీ ఎదుర్కొన్నారని ఇరానీ వ్యాఖ్యానించారు.

వివక్షకు సంబంధించి వైయక్తికమైన అనుభవాలను అక్షరరూపంలో తీసుకురావడం ఎంతో అవసరమని, తనకు ఆ అవకాశం వచ్చిందని ఈ పుస్తకం ప్రచురించిన గరుడ ప్రకాశన్ సంస్థ సహ వ్యవస్థాపకుడు అంకుర్ పాథక్ అన్నారు. రష్మీ గాథ మనందరికీ ప్రేరణ ఇవ్వగలుగుతుందని ఆయన అన్నారు.

ఈ పుస్తకం పాఠకులను ఆపకుండా చదివిస్తుంది. ఉదారవాదులుగా చెప్పుకునే, మేధావులుగా ప్రకటించుకునేవారి హ్రస్వదృష్టి, పేర్గాంచిన విశ్వవిద్యాలయాలలో ఉండే వివక్ష ఇందులో రష్మీ అద్భుతంగా ఆవిష్కరించారు. ★

నరేంద్ర

ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ కార్యకర్తగా, సాధారణ స్వయంసేవక్‌గా సేవా కార్యక్రమాలు ప్రారంభించి అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ నేడు త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డి నిబద్ధతగల నాయకుడుగా పలువురి ప్రశంసలు అందుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా, జాతీయ కార్యదర్శిగా, శాసనసభ్యుడిగా అంకితభావంతో సేవలందించారు. ప్రజలకోసం, పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని నమ్మిన ఆయన త్రిపుర ప్రథమ పౌరుడిగా నియమితులు కావటం పట్ల హర్షామోదాలు వ్యక్తంచేశారు.



## కార్యకర్త నుంచి రాజ్యపాల్ దాకా..

# 'ఇంద్ర' ప్రస్థానం

తొలితరం బీజేపీ నేతల్లో ముఖ్యుడిగా ఎదిగిన ఇంద్రసేనారెడ్డి, నాలుగున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నిబద్ధతకు, నిరాడంబరతకు నిలువెత్తు సంతకం అనడంలో సందేహంలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా (ప్రస్తుతం సూర్యాపేట) తుంగతుర్తి నియోజకవర్గంలోని గానుగబండ గ్రామంలో 1953 జనవరి 1న జన్మించారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 1972లో గణిత శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేశారు. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ నుంచి 1975లో ఎం.ఫిల్ పూర్తి చేశారు.

1974లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో దౌర్జన్యం, హింసాయుత పద్ధతుల్లో గెలవాలని నక్సలైట్లు రాడికల్ స్టూడెంట్ యూనియన్ రూపంలో విశ్వప్రయత్నాలు చేసి, పరాజయాన్ని తట్టుకోలేక మారణకాండ సాగించిన తరుణంలో ఆత్మరక్షణకు ఎదురు తిరగాల్సి వచ్చింది. జార్జిరెడ్డి హత్య నేపథ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో ఏబీవీపీ కార్యకలాపాలు సాగించేందుకు భయపడుతున్న సమయంలో ధైర్యంగా తిరిగిన కొద్దిమంది నాయకుల్లో ఇంద్రసేనారెడ్డి ఒకరు. అది సహింపలేక ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు వెంకటరమణి కత్తితో జరిపిన హత్యాయత్నం నుండి ప్రాణాలతో బయటపడ్డారు. మరోసారి, 1990 తర్వాత మలక్‌పేట ఇంటి బాల్కానీలోనే దుండగులు దాడి జరిపి, ఉరి తీసే ప్రయత్నం చేశారు. ఇలాంటి ఎన్నో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొని, నిబ్బరంతో నిలబడ్డారు.

ఏబీవీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేశారు. లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, ఆయన ఏర్పాటు చేసిన చాత్ర సంఘర్ష సమితి తెలంగాణ అధ్యక్షునిగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ సమయంలో తొలుత రహస్య జీవనం గడిపి విద్యార్థి ప్రతిఘటన ఉద్యమానికి నేతృత్వం వహించారు. ఆ తర్వాత, మీసా క్రింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లారు. 1977లో జనతా పార్టీ ద్వారా రాజకీయ జీవితం ప్రారంభించి, జనతా యువమోర్చ రాష్ట్ర తొలి అధ్యక్షునిగా పనిచేశారు. బీజేపీలో ప్రారంభం నుండి కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. బీజేవైఎం రాష్ట్ర తొలి అధ్యక్షునిగా, జాతీయ కార్యదర్శిగా సేవలు అందించారు.

1983లో మలక్‌పేట నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నాటి హోం మంత్రి ప్రభాకరరెడ్డిపై విజయం సాధించి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985లో అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుపై సుమారు 17,791 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 1999లో మూడోసారి గెలిచిన ఇంద్రసేనా రెడ్డి పార్టీ శాసనసభ పక్ష నేతగా వ్యవహరించారు.

1996, 2004లో లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ నియోజకవర్గం నుంచి, 2009 మల్కాజ్‌గిరి, 2014లో భువనగిరి లోకసభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా (2003–2006 ) వ్యవహరించారు. 2007లో పార్టీ జాతీయ కార్య దర్శిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన పార్టీ జాతీయ కార్యవర్గంలో కొనసాగుతున్నారు.

**తెలంగాణపై ప్రకటన ఇప్పించిన ఘనత**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో బీజేపీ నిర్ణయాత్మక పాత్ర వహించడం తెలిసిందే. తెలంగాణకు అనుకూలంగా పార్టీ కీలక నిర్ణయం తీసుకోవడంలో ఇంద్రసేనా రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. 2005లో పార్టీ అప్పటి జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తమ పార్టీ కట్టుబడి ఉందని తొలిసారిగా ప్రకటన చేశారు. ఆ ప్రకటన వెలువడడానికి అప్పటి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఇంద్రసేనా రెడ్డి ప్రధాన భూమిక వహించారు.

ముక్కుసూటి మనిషిగా, వివిధ కీలక అంశాలపై నిక్కచ్చిగా వ్యవహరించే నేతగా గుర్తింపు ఉన్న ఇంద్రసేనారెడ్డి పార్టీ తీసుకున్న పలు కీలక నిర్ణయాల్లో తన వంతు పాత్ర పోషించారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే నాయకుడిగా ముద్రవేసుకున్నారు. ఎప్పుడూ పార్టీ ప్రయోజనాలను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరిస్తుంటారు. రాగద్వేషాలకు అతీతంగా పార్టీకోసం ఎవరితోనైనా కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చేవారు. పదవులతో సంబంధం లేకుండా ఉద్రిక్త పరిస్థితులు ఎదుర్కొంటూ, పార్టీ కార్యకర్తలు ఇబ్బందులలో ఉన్నారన్నా, ప్రత్యర్థుల నుంచి దాడులు ఎదుర్కొంటున్నారన్నా ముందూ, వెనుక చూడకుండా పరిగెత్తడం ఆయన నైజం. ఒకటి, రెండు సందర్భాలలో పరిస్థితులు పోలీసు కాల్పుల వరకు దారితీసినా వెనుకడుగు వేయలేదు. క్రమశిక్షణ కలిగిన పార్టీలో, క్రమశిక్షణ కలిగిన సైనికుడిగానే ఆయన పనిచేస్తూ వచ్చారు. ఎప్పుడూ పదవులకోసం పాకులాడలేదు.

ఏ పదవిలో ఉన్నా హంగు, ఆర్భాటం లేకుండా సాధారణ కార్యకర్తగా వ్యవహరిస్తూ, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారు. భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పుడు కార్లలో తిరగాల్సి వస్తున్నా, చాలాకాలం స్కూటర్‌పైనే నియోజకవర్గంలో తిరుగుతూ ఉండేవారు. ఆయన మూడు సార్లు ప్రాతినిధ్యం వహించిన మలక్ పేట ఇప్పుడు నాలుగు నియోజక వర్గాలుగా మారింది. ఇప్పటికీ ఆ ప్రాంతంలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాలలో ఏబీవీపీ కాలం నుండి కలిసి పనిచేసిన కార్యకర్తలు అందరితో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ★

## కథానిక

స్టేన్లీమిల్లర్, చికాగో నగరంలో ఉంటాడు. అతన్ని గురించి బహుకొద్ది మాత్రమే తెలిసికొని ఉన్నా గణనీయమైన వ్యక్తి. ఆరడుగులు పొడవు; దృఢమైన శరీరం. అందమైన ముఖం. ఉత్సాహాన్ని, ఉద్రేకాన్నీ మిళితం చేసుకున్న కళ్లు. ఎప్పుడూ చిరునవ్వుతోనే ఉంటాడు. 28 సం॥రాలుంటాయి. బ్రహ్మచారి. ప్రభుత్వపు ఆయుధ కర్మాగారంలో ఉద్యోగం. కనుపడని దేశసేవకుల్లో ఒకడు. ఇంకా ఇతనివంటి యువకులు అనేకులు కర్మాగారంలో ఉన్నారు. అధికార్ల ఆజ్ఞలు అక్షరాలా పాటిస్తాడు. నిరాడంబర జీవి. క్రిందటి రాత్రే గొప్ప ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ద్రావకపు జాడీలున్న లారీని గంటకు 80 మైళ్ల వేగంతో నడుపుతూ ఉంటే పన్నెండు గంటల రాత్రి వేళ లారీ ఆకస్మాత్తుగా తిరుగ బడింది. కాని అతడు బ్రతికి బయటపడడం కేవలం అతని అదృష్టమే. పత్రికలీ ఉదంతాన్ని ప్రకటించాయి. ఈతని ముఖచిత్రం కూడా ముద్రించారు. ఈ రోజున అతడు ప్రమాదం నుండి తప్పించుకొన్నందుకు అభినందించడానికి స్నేహితులు వస్తున్నారు.

“మిల్లర్! నీవు చాలా అదృష్టవంతుడవోయ్” అన్నాడు జోన్స్. “కాకపోయినా నైట్రిక్ ఆసిడ్ కర్మాగారానికి చేరవేసేటపుడు ప్రాణాలతో బయట పడ్డవారిలో నీవు గణ్యుడవే” అన్నాడు మరొక మిత్రుడు. క్రమక్రమంగా మిత్రులు హాలును నింపేశారు. మధ్యాహ్నం దాకా సంతోషంతో గడచింది. సాయంత్రం అంతా కలసి ఏదేనా వినోదాన్ని చూడడానికి బయలుదేరాలనుకొన్నారు. స్వతహాగా తనకంత రుచించకపోయినా అందరి స్నేహితుల మాట కాదనలేకపోయాడు. మరి వినోద కార్యకలాపాలేమి వున్నాయా అని పత్రికలు తిరగేశారు. “చికాగోలో కనివిని యెరుగని అపూర్వ నృత్యాలు” అన్న ప్రకటన చూశారు. తప్పకుండా చూడాలనుకున్నారు. అంతా బయలుదేరారు.

ఎనిమిది గంటలకు నాట్యమందిరానికి చేరుకున్నారు. మందిరమంతా క్రిక్కిరిసి వుంది. గంటసేపటిదాకా చిన్న చిన్న సంగీత ప్రదర్శనాలూ, నృత్యాలు సాగాయి. తొమ్మిది గంటల పదిహేను నిమిషాలైంది. “జగద్విఖ్యాతమైన నృత్యభంగిమ; అపూర్వ ప్రతిభాసమ్మిత మిస్ జెస్సికా నూతన నృత్యభంగిమను ప్రేక్షక జనానికి ప్రదర్శిస్తుంది” అని ప్రకటించబడింది. ప్రేక్షకులు అత్యాశతో ఎదురు చూస్తున్నారు.

నేపథ్య సంగీతం ప్రారంభమైంది. ఎన్నో రకాల వాయిద్యాలు క్రొత్త క్రొత్త బాణీలను (Tunes) పాడుతున్నాయి. సంగీతమే ప్రేక్షకులను తన్మయులకు చేయ ప్రారంభించింది. తెరలేచింది, సంగీతం నుంచి రసస్ఫోరకంగా వుంది. వెంటనే రెండు ప్రతిమలు సాక్షాత్తు స్త్రీలే అని భ్రమింప జేసేవి వేదికపైకి వచ్చాయి, ప్రతిమలు యంత్ర సహాయంతో సంగీత స్వరానికి అనుగుణాలుగా తిరుగు తున్నాయి. వెంటనే లైట్లు ఫోకస్ చేయబడ్డాయి. ప్రతిమలు తళతళ మెరిసిపోతున్నాయి. ట్యూను మారింది. లోపలి తెర ప్రక్కకి తప్పుకొంది. మరి నాలుగు ప్రతిమలు వీటిని చేరుకున్నాయి. ఎలా త్రిప్పుతున్నారో వాటిని– విచిత్రంగా తిరుగుతున్నాయి. మళ్లీ తెరమారింది. స్వరపు మార్పుతో, రంగురంగుల బొమ్మలు నాల్గు ప్రవేశించాయి. పట్టు విడవకుండా ప్రేక్షకులు వేదికపై దృష్టి నిలిపి చూస్తున్నారు. సంగీతం, నృత్యం పెనవేసుకొని ఎదటివాళ్లను చిత్ర ప్రతిమలను చేసి బంధించాయి. మళ్లీ ట్యూన్ మారింది తెర తప్పుకొంది. లోపల యెన్ని తెరలున్నాయో! మూడు బొమ్మలు వచ్చాయి. అన్నీ బొమ్మలూ కలిసి తిరుగుతున్నాయి. నృత్య భంగిమలతో – ఇన్ని బొమ్మలు, సంగీతం వీటి మధ్య బొమ్మలను మరపించే అందకత్తె ఎప్పుడు వచ్చిందో ఏమో – క్రమక్రమంగా బొమ్మలు తెరల్లో దాగుంటున్నాయి. స్వరాలు తప్పుకొంటున్నాయి. గడియారపు ముల్లు తిరిగి



# ఎవరికోసం?

### బుద్ధవరపు వెంకటరత్నం

పోతున్నాయి. సమ్మోహనాస్త్రం ప్రయోగించినట్లు ప్రేక్షక జనం అలానే ఉండిపోయారు. బొమ్మలు వెళ్లిపోయాయి. రిబ్బన్ల మెరుపులు మబ్బుల్లో మెరుపుతీగల్లా మాయమయ్యాయి. స్వరాలు ఆగిపోయాయి. వేదికపై లైట్లు ఆరిపోవడం హాల్లో లైట్లు వెలగడం హఠాత్తుగా సంభవించింది. "జెస్సికా నృత్యం అయిపోయింది." అన్నారు తెరలోంచి. ప్రేక్షకులొక్కసారి ఉలిక్కిపడ్డారు. "శహభాష్" "అపూర్వం" ఇంకా ఇంకా ఎన్నో ఆశ్చర్యార్థకాలతో హాలు మారు మ్రోగింది.

ప్రదర్శనం అయిపోయింది. ప్రేక్షకుల్లో పెద్దలు కొందరు జెస్సికాను అభినందించటానికి వేదికమీదకి వెళ్లారు. ఆమె దుస్తులు మార్చుకొంది. రక్తవర్ణపు గౌను ధరించింది, శరీరాన్ని అంటిపెట్టుకొని ఊరువుల దాకా గౌను వున్నది. ఆ రాత్రి దీపపు కాంతితో ఆమె దేహకాంతి మెరసిపోతోంది. ఒక్కరొక్కరే ఆమె కరస్పర్శ చేసుకుని మురిసి పోతున్నారు. దిగ్దర్శకుడు ప్రముఖులను ఆమెకు పరిచయం చేస్తున్నాడు.

"ఇతడు జోన్స్ ప్రభుత్వ వైమానిక శాఖలో ప్రముఖ ఉద్యోగి" అంటూ మిల్లర్ మిత్రుని జెస్సికాకు చూపాడు. "అలాగా!" అంటూ ఆమె కరస్పర్శ చేసింది. అతడిచ్చిన పూలగుత్తి అందుకొంది. "ఆయుధాల కర్మాగారానికి యజమాని శామ్సన్" అని డైరెక్టర్ కర్మాగారాధిపతిని పరిచయం చేశాడు. ఒక్కరొక్కరే కరస్పర్శ చేస్తూ జెస్సికా కళ్లల్లోకి చూసి తప్పుకొంటున్నారు. "ఇదిగో! ఈ యువకుడు మిస్టర్ మిల్లల్ అతిసాహసవంతుడు. కర్మాగారంలో ద్రావకాలశాఖ ఇతని ఆధిపత్యంలో ఉంటుంది" అంటున్నాడు జెస్సికాకు మిల్లర్‌ను చూపుతూ డైరెక్టర్. మిల్లర్‌ను చూస్తూ జెస్సికా డైరెక్టరు మాటలను వినడమే లేదు. ఆమెకు హఠాత్తుగా ఏదో స్ఫురించింది. 'నిన్న నైట్రిక్ ఆసిడ్' ప్రమాదం నుండి తప్పించుకొన్న సాహసికుడేనా?' అంది మిల్లర్‌కు చేతినందిస్తూ "ఆఁ" అంటూ చేతి నందించాడు మిల్లర్. "అరే! చేతిలో పూవులైనా లేవే - ఈమె కివ్వడానికి...." అనుకొని మందంగా చేయి కలిపాడు. అతని



హృదయంలోని ఆరాటం ఆమె గుర్తించలేదు. చేతిలో వెన్నముద్ద కరిగిపోయినట్లు క్షణంలో జెస్సికా కోమల హస్తం చేతి నుండి జారిపోయింది. ఆమె కరస్పర్శ అతనిలో విద్యుత్తును ప్రవహింప జేసింది. వెంటనే మెరసిన తరువాత కారుమేఘంలాగ ఉన్నట్లు అతని హృదయం బిగిసిపోయింది. "ఇందాక నన్ను చూశావా ఆ నృత్యంలో నువ్వు?" మళ్లీ ఆ కారుమేఘంలో ఒక మెరుపు, జెస్సికా ఆతని స్వరాన్ని మరొకమారు వినాలని ఉబలాటపడింది. "లేదు" అని సిగ్గుతో సమాధానమిచ్చాడు. "కాని నిన్ను చూశాను నేను" అంటూ కిలకిల నవ్వింది ఆమె. పన్నీరు చిలికింది చిరునవ్వుతో జెస్సికా. వెన్నెల్లో మల్లిపూవుల్లా ఉన్న ఆమె పలువరసని చూడగలిగాడు మిల్లర్. స్నేహితులు ఒక నిమిషంపాటు ఆశ్చర్యపడ్డారు అంతా వెళ్లిపోయారు. జెస్సికాకు డైరెక్టరు చెక్కు యిచ్చి కారెక్కాడు. జెస్సికా కూడా తన కారులో భవనానికి ప్రయాణిస్తుంది. వెన్నెల రాత్రిలో వేగంగా పోతూన్న కారులో తేలికా వుండే జెస్సికా గాయపడి బరువుగా ఉన్న హృదయాన్ని మోయలేక మోసుకొంటూ ఇంటికి చేరదీసింది.

ఆదివారం, రేపటి నుంచి డ్యూటీ చేసి వారి పేర్ల పట్టికను తయారు చేసుకుంటున్నాడు మిల్లర్. సైనికశాఖలో ఉండే వారంతా మిలిటరీ ఆవరణలో ఉండాలన్న నియమం ఉన్నా ప్రథమ శ్రేణీలో ఉన్న ఉద్యోగి కనుక మిల్లర్ తాను కోరిన నగరంలో మకాం ఏర్పాటు చేసుకొన్నాడు. దినదిన గండం వెయ్యేళ్లా యుష్షు అన్నట్లు తమ పనులు ప్రమాదకరంగా ఉన్నా దేశం కోసం అని పనివాళ్లకు ఉత్తేజపరుస్తుంటాడు మిల్లర్. పని ఘంటలయ్యేటప్పటికి ఇంటి ముందు కారు ఆగిన చప్పుడు అయ్యింది. కొంతసేపటికి నౌఖరు కుర్రవాడు ఒక చీటి తెచ్చాడు. "మిస్, జెస్సికా అపూర్వ నర్తకి" తనకు చూడడానికి వచ్చింది.

"రావచ్చు" అని తెలియపరచాడు. జెస్సికాతో తనకు గల పని? ఆమెకు ఇప్పుడు ఇక్కడకు రావడం దేనికి? రాత్రి తన్ను అందరికంటే అదనంగా ప్రశ్నించిందే. ఆమె భావం ఏమిటో–బల్లమీద ఫాన్ వేగంగా తిరుగుతూ ఆతని హృదయంలో భావాలకు తాళం వేస్తోంది. ఎంతసేపు ఆలోచిస్తున్నాడో – ఎత్తుకోళ్లతో టక్కూ టిక్కూ చప్పుడు చేసుకంటూ వచ్చిన జెస్సికాను గమనించనే లేదు. "మీరేదో ముఖ్యమైన సమస్యను గూర్చి తర్కిస్తున్నారనుకుంటా" కోకిల స్వరంతో మిల్లర్‌ను చకితుణ్ణి చేసింది. క్షమించాలి ఏదో ఆలోచిస్తూ మరచిపోయాను. కూర్చోండి. అంటూ "సోఫా చూపించాడు" అంత మన్నించడం నా పట్ల తగదేమో అంటూ కూర్చొంది. అతని కాగితాలూ పని తొందరా, మాటిమాటికీ టెలిఫోన్ పిలుపులూ – ఇన్ని ఉన్నా విసుగుదల కాని నిరుత్సాహంగాని లేని చిరునవ్వుతో ఉండే ఆతని ముఖం చూసి ఆమె ముగ్ధురాలయ్యింది. "మిల్లర్! నిన్ను నేను, ప్రేమిస్తున్నాను" అంది జెస్సికా అతని ముఖంలోకి చూస్తూ. ఒక్క మారుగా కంపించింది అతనికి ఆపాద మస్తకమూ. రాత్రి నుండి ఉత్పన్నమైన సమస్య అనేక ఉప సమస్యలను సృష్టించి విడిపోయింది. "ఏమంటావ్" అంటూ ఆమె చూపులు ప్రశ్నించాయి. 'నీకు వివాహం కాలేదూ' ఆత్రుతతో ప్రశ్నించాడు. "లేదు" అంది ఆమె. "మీ వయస్సు?" అతడు "ఇరవై రెండు" ఆమె. క్షణకాలం ఇద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. "మీకేమైనా అనుమానమా?" అంది మళ్లీ జెస్సికా. "అబ్బే లేదు" అని తల ఊపాడు. ఇక మళ్లీ ఇద్దరూ మాట్లాడుకోలేదు. కాసేపు ఒకరినొకరు చూసుకొన్నారు.

ఇంతలో ఎవరో స్నేహితులు వచ్చారు. "ఇప్పుడే వస్తా యిక్కడే ఉండండీ అంటూ లేచాడు మిల్లర్. వారూ అతనూ జీప్‌లో ఎక్కి ఎక్కడకో వెళ్లారు. బల్లపై ఉన్న కాగితాలు పరీక్షిస్తోంది. కొన్ని ఆఫీసు విషయాలు. అతడు కూర్చున్న కుర్చీకి చేరువగానే వుంది. ఒక కార్డుపైన మిల్లర్ ముఖచిత్రం వుంది. అందమైన ముఖం, చిరునవ్వు, ఉత్సాహాన్ని ఒలికించే కళ్లు – క్రింద స్టేన్లీ మిల్లర్ జననం 1918– ఆయుధాల కర్మాగారం ప్రథమశ్రేణి ఉద్యోగం– పొడవు – ఇతర వివరాలు – క్రిందుగా జీతం వారానికి 500 డాలర్లు. కార్డు చివర అతని సంతకం చదివేసరికి మళ్లీ ఎవరో వచ్చారు. కర్మాగారం నుంచి వచ్చిన వారిని కూర్చోమని జెస్సికా లోనికి వెళ్లి పటాలనూ, తదితర వస్తువులనూ పరిశీలిస్తోంది. వచ్చిన స్నేహితులు చిన్న ఉద్యోగస్తులు కాబోలు. మిల్లర్ రాకపోవడంతో బాతాఖానీకి దిగారు.

'మిల్లర్ బాబు మహాదొడ్డ ప్రమాదం నుండి బయటపడ్డారు.'

'కాదు మరీ– ద్రావకాల కారు – 80 మైళ్ల వేగం – ఎత్తయిన తూము. క్రిందపడి పగిలిపోయిన ఆ సీసాలలోకి ద్రావకం ఒక్క చుక్కయినా పడకుండా తప్పించుకున్నాడు."

"ఏదైనా ఆయుధాల కర్మాగారంలో ఉద్యోగ మంటే దినదినమూ మృత్యువుతో చెరలాడడమే. ద్రావకాలూ, సామగ్రి ఒకటేమిటీ... అన్నీ ప్రమాదకర వస్తువులే."

"ప్రొద్దున్న వెడితే సాయంత్రం బయటపడే దాకా

చిక్కే వారానికి కనీసం ఐదారుగురు పోతుంటారు".

''యుద్ధ కాలంలో దేశంకోసం ఇలా తోడ్పడుతున్నారు" సంభాషణలో ప్రారంభం నుండీ బరువుగా పడుతున్న భావాల శక్తిని జెస్సికాకు యీ తుదివాక్యం తేలిక నిచ్చింది. ఇంతలోనే మిల్లర్ కొందరు స్నేహితులతో వచ్చాడు. మధ్యాహ్నం దాటిపోయింది. రజల్లా స్నేహితులు రావడం పోవడం జరిగింది. కులాసాగా మాట్లాడుకోడానికి వారికి తీరిక దొరకనేలేదు.

రాత్రి మళ్లీ వచ్చింది జెస్సికా. మిల్లర్ అభిప్రాయాన్ని ముఖాముఖీని తెలుసుకోవాలని ప్రశ్నించింది. "అయితే నీకూ పెళ్లికాలేదటగాదూ–మరెందుకు సందేహం" మిల్లర్ ఆలోచించి అన్నాడు.

"నాది కష్టమయ జీవితం–మిలిటరీ ఉద్యోగం, యుద్ధం రోజులు, అధికారులు కోరిన చోటల్లా పనిచేయాలి" జెస్సికా అడ్డు తగిలింది. "అవన్నీ నాకు తెలుసు– కాని మన ప్రేమకు ఇవి అడ్డురాలేవు. నీవు ఊс అంటే" అంటూ అతని వైపు చూసింది. "సరే" అన్నాడు. "అలాగేతై– మన వాహ్యాళికి సన్నద్ధం

మరునాడే జెస్సికా మెక్సికోకు ప్రయాణమై వెళ్లింది. పనివాళ్లను యధా ప్రకారం నియమించి ఆఫీసుకు వచ్చాడు. ఆఫీసులో ఆవాళ అట్టే పని కనిపించ లేదు. ముఖ్యంగా చూసుకోవలసిన పనులు ముగించుకొని శలవుకు దరఖాస్తు చేసి నగరంలోకి ప్రయాణమయ్యాడు. కొత్త బట్టలూ, క్రీములు, హెయిర్ ఆయిల్సూ కొంటున్నాడు. ఎక్కడ విన్నా జెస్సికా నృత్యం విషయమే వినబడుతోంది. అందరూ ఆమె అందాన్ని ప్రశంసించే వారే. ఒకచోట ఇద్దరు అపరిచితులు తర్కించుకొంటున్నారు. సంభాషణ మిల్లర్ కాళ్లకు అడ్డు తగిలింది; ఆగి వింటున్నారు.

కావాలి. రేపు శలవుకు వ్రాయి. వారం రోజులు శలవు కావాలను. వచ్చే శనివారం సాయంత్రం బయలుదేరాలి. తర్వాత విషయం నేను ఆలోచిస్తాలే" అంటూ లేచి వెళ్లిపోయింది. జెస్సికా వెళ్లిందన్న మాటేగాని మిల్లర్‌కు ఏమీ తోచలేదు. ఆమెను తానూ ప్రేమించాడు. కాని తన జీవితం, ఉద్యోగం – ఇవి తమకు ఎలాంటి కష్టాలను కలిగిస్తాయో అనుకొంటూ తర్కించుకొనసాగాడు.

మరునాడే జెస్సికా మెక్సికోకు ప్రయాణమై వెళ్లింది. పనివాళ్లను యధా ప్రకారం నియమించి ఆఫీసుకు వచ్చాడు. ఆఫీసులో ఆవాళ అట్టే పని కనిపించ లేదు. ముఖ్యంగా చూసుకోవలసిన పనులు ముగించుకొని శలవుకు దరఖాస్తు చేసి నగరంలోకి ప్రయాణమయ్యాడు. కొత్త బట్టలూ, క్రీములు, హెయిర్ ఆయిల్సూ కొంటున్నాడు. ఎక్కడ విన్నా జెస్సికా నృత్యం విషయమే వినబడుతోంది. అందరూ ఆమె అందాన్ని ప్రశంసించే వారే. ఒకచోట ఇద్దరు అపరిచితులు తర్కించుకొంటున్నారు. సంభాషణ మిల్లర్ కాళ్లకు అడ్డు తగిలింది; ఆగి వింటున్నారు.

"మనమంతా చూస్తూనే ఉండగా నగ్ననృత్యం చేసిన ఆ నర్తకి ప్రతిభ అప్రతిమానం."

"ప్రతిమల్లో ప్రతిమైపోయిన ఆమె అందం వర్ణనా తీరం."

"చూపరులను ముగ్ధులను చేయడం అదే."

"మెక్సికో నుంచి వచ్చిన యీ పిల్లను కంట్రాక్టు చేయడం వల్ల డైరెక్టరు ఎంతో అధికంగా లాభం పొందాను."

"కాదూ? ఆమె నృత్యంలో ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది."

''అవివాహితట–కానీ బహు దూబరా చేస్తుందట"– ఆ వ్యక్తి ఇలా అంటూంటే మిల్లర్ వాళ్లకి ఇంకా దగ్గరగా వెళ్లి ఆలకిస్తున్నాడు.

"దూబరా అంటే"

''బాబూ! అంతా ఇంతా కాదురా– అలంకారాలకూ అందచందాలకూ ఆమె రోజుకు కనీసం 50 డాలరులయినా ఖర్చు పెడుతుందట– స్నేహితులూ, విందులూ లెక్కే లేదు."

"అయితే ఏ కోటీశ్వరుడైనా రావాలి ఈ అందకత్తెను కట్టుకోవడానికి – ఓ పాటి వాడైతే సంసారం మూడు రోజుల్లో ఆరిపోతుంది."

"అంతేలే – ఇంతటి అందకత్తెకు అంతటి ధనవంతుడే రావాలి – లేకపోతే జోడీ కుదరొద్దూ" ఇరువురూ సాగిపోయారు. దిగాలుపడ్డ హృదయంతో మిల్లర్ ఇల్లు చేరుకున్నాడు.

యుద్ధం దారుణంగా సాగుతున్న రోజులవడం వల్ల మిల్లర్ వుండే కర్మాగారానికి తీరికలేదు. అస్తమానం టెలిఫోన్లూ, మందు సామాన్లు కావాలని ఆర్డర్లు – ఊపిరి సలపడం లేదు. శలవు మాట ఏమవుతుందో అని యెదురు చూస్తున్నాడు. టెలిఫోన్‌లో ఎవరో పిలుస్తున్నారు. పై అధికార్లు అడుగుతున్నారు "మిల్లర్! నీ దరఖాస్తు వచ్చింది. తప్పకుండా శలవు కావాలా?" మిల్లర్ "అత్యవసరం"

"కారణం తెలుసుకోవచ్చునా?"

"అత్యవసరమైన పని వుంది."

"నీ విషయంలో సందేహంలేదు. మరొకందుకైతే సందేహించేవాణ్ణి కాదు. ఏ రోజున ఏ మొస్తుందో ఎవరెరుగుదురు?"

"ఈ గొడవ ఇలా ఉండేదే. రాత్రింబగళ్లు ఊపిరి సలపడం లేదు గదా. మరో చిన్న విషయానికైతే నేనింత పట్టుపడతానా?"

''మిల్లర్ – నీవు కోపపడవద్దు. శలవు ఇవ్వడానికిపుడు వీల్లేదు."

''అబ్బే కావాల్సిందే'' దబాలున ఫోన్ అదిమేశాడు. పది నిమిషాలనంతరం మళ్లీ పిలుపు వచ్చింది.

"మిల్లర్! నిన్నే – శలవు యిస్తున్నా కాని ఒక్క షరతు."

"ఏమిటదీ?" మోటుగా ప్రశ్న.

ఈ వారంలోనే ఎప్పుడు అర్జంటు కబురు వస్తే అప్పుడే రావాలి."

"అబ్బ! సరేలెండి" విసుగుతో సమాధాన మిచ్చాడు. మరునాడు సాయంత్రానికి ఆ పద్ధతి పైనే శలవు దొరికింది. పనులన్నీ త్వరత్వరగా పూర్తి చేయకున్నాడు. శనివారం ఎప్పుడవుతుందా అని చూస్తున్నాడు.

శనివారం నాడు ఉదయం. విమానాశ్రయానికి జెస్సికాను తీసుకురమ్మని తన నౌకరును పంపాడు. "జెస్సికా విచ్చేశారు. ఎందరు స్నేహితులండి... ఏమి కరస్పర్శలు! ఎన్ని పూలగుత్తులు... జనం గూడా ఎందరో వచ్చారు. వాళ్లను సాగనంపి కారులో యింటికి చేరుకునేసరికి ఆమెకు తల ప్రాణం తోకకు వచ్చింది– "మిమ్మల్ని పనిముగించుకొని మధ్యాహ్నమే వచ్చెయ్యమన్నారు" అన్నాడు నౌకరు.

మిల్లర్ అనుకొన్న వేళకు యిల్లు చేరుకున్నాడు. ఈ వారం రోజులలోనూ ఆ నోటా ఆ నోటా జెస్సికా – మిల్లర్ను పెళ్లాడవచ్చునని పొక్కిపోయింది. కొన్ని పత్రికలు గూడా తమ సందేహాలను ప్రచురించాయి. తమ వారం రోజుల వివాహానికి ఎన్నెన్నో సామానులను సిద్ధపరచింది జెస్సికా. ఆమె ఆనందానికి హద్దుల్లేవు. మరునాటి నుండి ఉండవలసిన నౌకరులనూ, కావలసిన సౌకర్యాలనూ పురమాయిస్తోంది. మిల్లర్ కూడా ఎంతో ఆనందిస్తున్నాడు. ఇద్దరూ ప్రయాణానికీ సిద్ధమయ్యారు. రాత్రి చాలాసేపటివరకూ సంగీతంతోనూ, కులాసా కబుర్లతోనూ కాలం వెళ్లబుచ్చారు.

రాత్రి పన్నెండు గంటలు దాటింది. చల్లని యీదురు గాలి వీస్తోంది. బయట యెవరో మిల్లర్‌ను పిలుస్తున్నారు. "ప్రమాదం త్వరగా రావాలి" – మిల్లర్ తలుపు తీశాడు. ''నీవెందుకొచ్చావు– ఫోను చేయలేకపోయావా?"

"కాదు బాబూ పెద్ద దొరగారు స్వయంగా కారులో వున్నారు. ఇక్కడకు 50 గజాల దూరంలో ఆపేశారు లారీని."

"ఏం జరిగింది."

"ప్రమాదవశాత్తూ ద్రావకం తూలి మీదపడింది. రెండు చుక్కలు కంటిలో పడ్డాయి."

"అయితే వెంటనే పద" అంటూ లోనికి వెళ్లాడు మిల్లర్.

"జెస్సికా! 5 నిమిషాల్లో వస్తాను – ఇప్పుడే కారు నడుపుతూంటే అధికారికి గాయం తగిలిందట."

"అబ్బ పోన్లేద్దూ – వాణ్ణి వెళ్లమను" అంది జెస్సికా విసుక్కుంటూ.

"కాదు మన జీప్‌లో ఆయన్ని వీడు ఆస్పత్రికి చేరుస్తాడు – నేను కార్మా గారంలో దింపి వస్తా లారీని" అంటూ వెళ్లిపోయాడు.

"మిల్లర్ బాబుని పిలవనా అన్నా నేను – కానీ వద్దు రేపటి నుండి అతడు శలవు కోరాడు ఎక్కడికో ప్రయాణమవుతూ వుంటాడు పిలువవద్దు. గంటసేపు పని... మనం పోదాంరా అని ఆయనే వచ్చేశారండి" అన్నాడు నౌఖరు. నౌఖర్ని జీప్‌లో అధికారిని ఆసుపత్రికి తీసుకెళ్ళమని పంపించాడు మిల్లర్ "నీకు పని చెప్పకుండా వుందామనుకున్నా – కానీ తప్పింది కాదు" అంటూ జీప్ ఎక్కాడు అధికారి.

మిల్లర్ కారును నడుపుతున్నాడు. రాత్రి అంతా అతనికి మరునాటి నుండి తాను పొందబోయే ఆనందాన్ని గూర్చిన యోచనే – వేగాన్ని హెచ్చిస్తున్నాడు. ఊహలు ఉప్పొంగుతున్నాయి. అతనిలో – సుందరమైన కెనడా భూములు – విరియబోసిన పండు వెన్నెలలో – గోధుమ పొలాలు – నదీతీరాలు ద్రాక్షతోటలు – జలపాతాలు కొండ కొమ్ములు – లోయలూ – స్నేహితులు తమకిచ్చే స్వాగతాలు – అంతులేని, ఆనందం. జెస్సికా మోవిపై తన పెదవుల నృత్యం. తీరని కోరికలు – ఆలోచనా ప్రవాహంలో కొట్టుకొనిపోతున్నాయి. క్రమంగా 50,60, 70, 80 మైళ్ల వేగం దాటింది. సూచిక 100 సమీపించింది. దాటి పోతోంది కూడా –ఎత్తు పల్లాలలో జాడీలు పప్పు పప్పు అయిపోతాయేమో అనిపిస్తోంది. ఎత్తయిన తూము..సరిగా ఆతూమే – అదే – వారం రోజుల క్రిందట తాను దెబ్బతిన బోయి తప్పించుకొన్నది. దూరాన ఎదుట శరవేగంతో ఏదో లారీలా వుంది వస్తోంది. దారి కోరుతూ హారన్ మ్రోగించాడు. కాని ఆ కారు దారినివ్వడంలేదు. తననే దారిమ్మని అరుస్తోంది – క్రమంగా ఎదుటిలారీ వంతెన ఎక్కింది; మిల్లర్ నూరుమైళ్ల వేగంలో ప్రక్కకు కోశాడు. ఎదుటిలారీ త్రుటిలో దాటిపోయింది. కాని ఆ కోతతో బరువైన మిల్లర్ లారీ వంతెనను తాకింది. క్షణంలో ప్రక్కకు దొర్లిపోయింది.

వెనుకటి స్థలంలోనే పడిపోయాడు. కాని ఇప్పుడు అతనిపైన చితికిపోయిన ద్రావకపు జాడీలతో లారీ పడిపోయింది.

మరుక్షణంలో యీ ప్రపంచానికి దూర మయ్యాడు మిల్లర్.

మరునాడు మిల్లర్ మరణవార్త చికాగో పత్రికల్లో అగ్రస్థానాన్ని పొందింది, అతని ధైర్యాన్నీ, సాహసాన్ని, దేశభక్తినీ ప్రశంసిస్తూ అనేక చిత్రాలతో అతన్ని కీర్తించాయి పత్రికలు. కర్మాగారపు అధికారుల మాట చెప్పనక్కర్లేదు. జెస్సికా పడ్డ బాధ వర్ణనాతీతం.




కొన్ని రోజుల అనంతరం – మిల్లర్ స్మారక నిధిని ప్రోగు చేశారు. అమెరికా ఖండమంతా వేలాది డాలర్లు వసూలు చెయ్యబడ్డాయి. ఆ నిధితో 'మిల్లర్ శిక్షణ శాల' అనే పేరున సైనిక శిక్షణ శాల స్థాపించబడింది. కర్మాగారం ముందరి ఆవరణలో అతని విగ్రహం ప్రతిష్ఠాపించబడింది. "అమెరికా గర్వింపదగ్గ వీరుడు మిల్లర్" అని అధికారులు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఉద్ఘాటిస్తూ, దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని శ్లాఘించారు.

ఆవాళ సాయంకాలం – మిత్రులూ, ప్రముఖులూ, పూలమాలలుంచి మిల్లర్‌కు ఆత్మశాంతినిమ్మని దేవుని ప్రార్థించారు. రాత్రి పడుతూంటే ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు. దుఃఖంతో స్మృతి తప్పి పడిపోయిన జెస్సికా ఆ విగ్రహం చెంత అలాగే ఉండిపోయింది. రాత్రి పన్నెండు గంటలకు తెలిపి వచ్చింది. పూలమాలలను ఒక్కొక్కటే ప్రక్కకు తీసింది. ప్రతిమలో ప్రతిమే అనిపించిన సజీవ ప్రతిమ. తన కోసం అసువులిచ్చిన అతని శిలా విగ్రహాన్ని వెన్నలాంటి చేతులతో నిమిరింది. ఆమెకు నృత్యం చేసిననాటి రాత్రి మిల్లర్ చేసిన – కరస్పర్శ జ్ఞప్తికి వచ్చింది. ఆనాటికి సజీవస్పర్శ – ఆనందంగా వుంది. మరి యీనాటి అతని నున్నని పాలరాతి దేహంతో కాలకూట విషం తాగి వుండి తవ్విన కొద్దీ ఆమె హృదయంలోంచి దుఃఖాన్ని ఒడిలోకి కన్నీటితో గుమ్మరిస్తూంది. ఆపాదమస్తకం నిమిరింది. నాటి రాత్రి తనలోకి ప్రవేశించిన విద్యుత్ప్రవాహం నేటితో ఆగిపోయింది.

అలా నిమురుతూన్న ఆమె హస్తాలు విగ్రహం వున్న దిమ్మదరికి వచ్చాయి. నాలుగువైపులా తాకి చూచింది. ఓ వైపున తప్ప తక్కిన మూడు ప్రక్కలా నున్నగానే వుంది పాలరాయి. నాలుగో ప్రక్క తడివి చూచింది. గరుకుగా మిట్టపల్లాలుగా, పెద్ద పెద్ద గోతుల్లా తగిలింది ఆమెకు. తల ఎత్తింది. బూట్లతో మిల్లర్ పాదాలు చెక్కబడ్డాయి. పాదాల దిగువ పెద్ద అక్షరాలు సువర్ణంతో మెరుస్తున్నాయి. చక్కని డిజైన్లతో మలచబడ్డాయి. ప్రతీ పదాన్నీ చదువుతోంది. "దేశం కోసం" అని పెద్ద అక్షరాలున్నాయి. వాటి.... నాలుగైదు పంక్తుల్లో మిల్లర్‌ను గూర్చి పరిచయం చేస్తాడు శిల్పి. కాని అవి ఆమెలో ఎంతో ఆవేదనను రగుకొల్పాయి. లేచి ఇంటికి బయలుదేరితే ఆమెకు కాళ్లడడం లేదు. వారం రోజుల్లో జన్మించి రూపొంద కుండానే త్రుంచివేయబడ్డ ప్రేమ ఆమెలో ఆవేదనను అధికం చేసింది. ఆ వీరుని ప్రాణపరిత్యాగం "దేశం కోసం" అంటుంది అమెరికా.. "కాదు ప్రేమకోసం" అంటోంది జెస్సికా.

**25.12.1953 జాగృతి వారపత్రిక నుండి వ్యవస్థాపక సంపాదకులు బుద్ధవరపు వెంకటరత్నం గౌరవార్థం..**



కె. రాకా సుధాకర్ రావు

# అరుదైన అధ్యయన గ్రంథం

ఎమర్జెన్సీ స్వతంత్ర భారతా వనిలో ప్రజాస్వామ్యానికి వచ్చిన ఒక మహావిపత్తు. ఎమర్జెన్సీ ఒక్క నాయకురాలి అధికార కాంక్షకు, దేశం మొత్తాన్ని జైలుగా మార్చిన ఒక చీకటి ఘడియ. కానీ 1975 నుంచి 1977 వరకూ 21 నెలల పాటు మౌలిక హక్కులను నియంతృత్వపు పాదపీఠిక కింద తొక్కిపెట్టిన దురదృష్టకరమైన ఘట్టం.

అంతకన్నా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఈ చీకటి ఘడియలపై వెలుగు ప్రసరించే ప్రయత్నం మన దేశంలో చిత్తశుద్ధితో జరగలేదు. ఎమర్జెన్సీ తొలగిన మూడేళ్ల లోపునే మళ్లీ ఇందిరా గాంధీ అధికార పగ్గాలు చేపట్టారు. దీంతో ఎమర్జెన్సీ పాఠ్య పుస్తకాలకు ఎక్కలేదు. పబ్లిక్ డిస్కోర్స్‌కీ చిక్కలేదు. ఎమర్జెన్సీపై పోరాడిన పార్టీల్లో చాలా వరకు అదే ఇందిరతో సయోధ్య చేసుకున్నాయి. పాత కాంగ్రెస్, స్వతంత్ర పార్టీలు జనతా ప్రయోగ వైఫల్యపు ఆపరేషన్ థియేటర్ పైనే ఆఖరిశ్వాస విడిచాయి. ఆ నేతల్లో చాలా మంది మళ్లీ ఇందిరాగాంధీ “పాదో ఓదకం పావనం తీర్థం” అనుకున్నారు. మధు దండవతే, జార్జి ఫెర్నాండెజ్, మధులిమయేల వంటి యోధానయోధులు అస్తమించిన తరువాత, సోషలిస్టు ఉద్యమం అదే నియంతల గుణానుకీర్తనంలో పడిపోయింది. కమ్యూనిస్టుల్లో ఒక పేలిక నియంత ఇందిరాగాంధీ అడుగులకు మడుగులొత్తింది. మరొక వాలిక బీజేపీని అడ్డుకునే వ్యర్థ ప్రయాసలో అదే కాంగ్రెస్ పాదాల చెంతకు చేరి కూర్చుంది.

ఇటు ఎమర్జెన్సీ కుఠారాఘాతాన్ని వీపున సహించి మరీ పోరాడిన జర్నలిజం సైతం తరువాత తరువాత కాంగ్రెస్ ఏలికలతో సర్దుబాట్లు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అందుకే కుల్దీప్ నయ్యర్ “ది జడ్జిమెంట్”, జనార్దన్ ఠాకూర్ “ఆల్ ది ప్రైమ్ మినిస్టర్స్ మెన్”, ఉమా వాసుదేవ్ “టూ ఫేసెస్ ఆఫ్ ఇందిరా గాంధీ”, డీఆర్ మన్కేకర్, కమలా మన్కేకర్ ల “ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ఇందిరాగాంధీ” వంటి పుస్తకాలు, అద్వానీ “ది ప్రిజనర్స్ స్క్రాప్ బుక్”, సుర్జీత్ సింగ్ బర్నాలా పుస్తకం, వాజ్ పేయీ “ఖైదీ కవిరాయ్ కీ కుండలియా” మినహా ఎమర్జెన్సీపై పెద్దగా సాహిత్యమే వెలువడలేదు.

ఎమర్జెన్సీ వ్యతిరేక ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటపు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆరెస్సెస్ మాత్రం ఇంగ్లీష్, హిందీ, ప్రాంతీయ భాషల్లో సాహిత్యాన్ని వెలువరించింది. తెలుగులో కొత్తపల్లి ఘనశ్యామలప్రసాద్ రాసిన శంఖారావం, ప్రజా పోరాటం, భండారు సదాశివరావు రాసిన జన విజయం” వంటి పుస్తకాలు ఈ కోవలోనివే.

అయితే అత్యవసర పరిస్థితిలో తెలుగు దినపత్రికల గురించి అస్సలు ఏ రకమైన సమాచారమూ లేదు. ఇదొక పెద్ద లోటు. ఆ లోటును డా. గోపరాజు నారాయణరావు సిద్ధాంత వ్యాసం “ఆంక్షాపర్వం – అత్యవసర పరిస్థితిలో తెలుగు దినపత్రికల పోరాటం, జంఝూటం” తీరుస్తోంది. ఈ విషయంపై ఇదొక్కటే పరిశోధనా గ్రంథం కావడం ఈ రచన విలువను మరింత పెంచుతోంది.




**ఆంక్షాపర్వం**

**అత్యవసర పరిస్థితిలో తెలుగు దినపత్రికల పోరాటం, జంఝూటం**

**రచయిత:** డా. గోపరాజు నారాయణ రావు,
**వెల:** రూ. 250/-
**ప్రచురణ :** లోపాముద్ర పబ్లికేషన్స్
**ప్రతులకు :** సాహిత్య నికేతన్, 3-4-852, బర్కత్ పురా, హైదరాబాద్,
**ఫోన్ :** 040-27563236

సునిశిత పరిశీలన, నిష్పక్షపాతమైన వస్తునిష్ఠ విశ్లేషణ, నిర్మొగమాటమైన అనుశీలన ఈ రచన ప్రత్యేకతలు. ఈ పుస్తకంలో ఎమర్జెన్సీ పూర్వరంగం గురించి విస్తృతమైన వివరణ ఉండటంతో పాఠకుడికి సందర్భం తెలియడమేకాక, నాటి రాజకీయ పరిస్థితులగురించిన అవగాహన కూడా కలుగుతుంది. రచయిత ఏడు అధ్యాయాల్లో తన అధ్యయన ఫలితాలను వెల్లడించారు. రచయిత అత్యంత నిజాయితీగా ఆ నాడు ముఖ్యంగా తెలుగునాట పత్రికారంగం ప్రజాభిప్రాయాన్ని మలిచే స్థితిలో లేదని అంగీకరిస్తూనే, తెలుగు ప్రజల ఆలోచనల మీద అది ఎలాంటి ముద్ర వేసిందన్న విషయాన్ని విశ్లేషించారు. మొత్తం దేశం కన్నా భిన్నమైన ఫలితాలు తెలుగునాట రావడానికి, పత్రికలధోరణికి ఏదైనా సంబంధం ఉందా అన్న ప్రశ్ననూ వివేచించారు.

పెద్ద పేర్లు, పెద్ద పెద్ద బ్రాండ్లను చూసి బెదిరిపోకుండా, ఎమర్జెన్సీ వ్యతిరేకత అనే పరశువేదిపై వాటి పనితీరును విశ్లేషించడం రచయిత నిజాయితీని, నిక్కచ్చితనాన్ని సూచిస్తుంది. ‘ఆంధ్రప్రభ’ విషయంలో ఆయన బయటపెట్టిన విషయాలు ఈ కోవకు చెందినవే. మూడు, నాలుగు, అయిదవ అధ్యాయాల్లో పత్రికలు వివిధ విషయాలను వార్తాకథనాలుగా అందించిన తీరును, అదే విధంగా ఆంక్షలున్నప్పటికీ అత్యంత సాహసోపేతంగా ఎలా వార్తలను వెలికి తీశాయో వివరించారు. ఉదాహరణకు ‘విశాలాంధ్ర’ మామూలుగా కమ్యూనిస్టుల ఇందిర భక్తి లైన్‌ను పాటిస్తూనే, తెలుగునాట మైనర్లకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేసిన వార్తను రాయడమే కాక, సెన్సార్ కత్తెరనూ తప్పించుకుంది. ఆ సంపాదకీయం “కుటుంబనియంత్రణ కార్యక్రమాలు – లజ్జాకరమైన దుశ్చర్యలు” పేరిట వచ్చింది. అయితే అదే పత్రిక తన సంపాదకీయంలో పత్రికా స్వేచ్ఛను పవిత్రమైన అంశంగా భావించడం అజ్ఞానమని కూడా వ్యాఖ్యానించి స్వామిని భక్తిని చాటుకుంది. వీటన్నిటినీ రచయిత నిర్మొహమాటంగా చర్చిస్తారు.

ఈ పరిశోధన జరిగింది 1990 వ దశకంలో. ఆ తరువాత కాలపు రాజకీయ పరిణామాల సింహావలోకనం చాలా అవసరం. నిజానికి గత 30 ఏళ్లలో దేశ రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించాయి. అత్యవసరపరిస్థితి సందర్భంలోనే వెలుగులోకి వచ్చిన మిత్రోఖిన్ పేపర్స్, కమ్యూనిస్టుల చారిత్రక తప్పిదంపై సురవరం సుధాకర రెడ్డి ఒప్పుకోలు వంటి అంశాలను ‘‘చరిత్రను నిరాకరించలేం” అన్న ఉపసంహారంలో వివరించడం ఈ పరిశోధనా గ్రంథానికి నిండుదనాన్ని తీసుకువచ్చింది.

నాటి పాత్రికేయ, పాత్రికేయేతరుల, ప్రముఖుల ఇంటర్వ్యూలు, పూర్తి నిషేధానికి గురైన పత్రికల వివరాలను కూడా రచయిత అందించారు. ఇందిరా గాంధీ నిషేధించిన పత్రికల జాబితాలో జాగృతి కూడా ఉండటం జాగృతి పాఠకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద ఎమర్జెన్సీలో తెలుగుపత్రికల తీరుతెన్నులపై వెలువరించిన ఈ రచన పాత్రికేయులకు, పరిశోధకులకు, రాజకీయ కార్యకర్తలకు, చైతన్యవంతులైన సామాజిక కార్యకర్తలకు తప్పనిసరి పఠనీయ గ్రంథం. ప్రముఖ సంపాదకుడు డాక్టర్ కె.రామచంద్రమూర్తి ఈ పుస్తకానికి రాసిన ముందుమాట గురించి ప్రస్తావించుకోవాలి. ఈ పుస్తకంలో ఉదహరించిన చాలా ఘట్టాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. అందుకే చాలా విషయాలు వాస్తవికంగా రాశారు. ★

# భళా! భారత హాకీ!





**భారత హాకీ చరిత్రలో మరో స్వర్ణయుగం ప్రారంభమయ్యింది. పాతాళానికి పడిపోయిన భారత హాకీ ప్రస్థానం పడిలేచిన కెరటంలా పారిస్ ఒలింపిక్స్ పతకం దిశగా దూసుకుపోతోంది.**

ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు సాధించడం ద్వారా ఓ వెలుగు వెలిగిన భారత హాకీ జట్టు 1990 దశకం నాటికి పాతాళానికి పడిపోయింది. పలు కారణాలతో ప్రపంచ హాకీ ర్యాంకింగ్స్‌లో దిగజారిపోడమే కాదు... ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలోనూ విఫల మయ్యింది.

### 11వ ర్యాంక్ నుంచి 3వ ర్యాంక్‌కు...

అంతర్జాతీయ హాకీ సమాఖ్య ర్యాంకింగ్స్ ప్రకారం ప్రస్తుతం 3వ ర్యాంకులో ఉన్న భారత్ దశాబ్దకాలం క్రితం 11వ ర్యాంక్‌కు దిగజారి పోయింది. బీజింగ్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలోనూ విఫలమయ్యింది. పాతాళం అంచులకు పడిపోయిన భారత హాకీని తిరిగి నిలబెట్టి అత్యున్నత స్థాయికి చేరేలా చేయటంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య తనవంతు కృషి చేసింది. దానికితోడు హాకీ ప్రేమికుడు నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని ఒడిశా ప్రభుత్వం భారత హాకీని అక్కున చేర్చుకొని ఆర్థికంగా ఊతమిచ్చింది.

### హాకీకి ఒడిశా రూ.100 కోట్లు...

మనదేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. క్రికెట్ కోసం కోట్ల రూపాయలు పట్టుకొని క్యూలో నిలబడే స్పాన్సర్లకు కొదవలేదు. అయితే.. జాతీయ క్రీడ హాకీ పరిస్థితి వేరు. 2018 వరకూ భారత హాకీ స్పాన్సర్‌గా ఉన్న సహారా సైతం ఆర్థిక సమస్యలతో తప్పుకోవడంతో పరిస్థితి దయనీయంగా తయారయ్యింది. అప్పటికే పతనం అంచుల్లో పడిపోయిన హాకీని స్పాన్సర్ చేయడానికి ఏ ఒక్కరూ చొరవ చూపలేదు. చివరకు కేంద్ర ప్రభుత్వం సైతం అంటీముట్టని వైఖరినే ప్రద ర్శించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో ఒడిశా ప్రభుత్వం నేనున్నానంటూ ముందుకు వచ్చి భారత హాకీకి అండగా నిలిచింది. ఐదేళ్లపాటు హాకీ స్పాన్సర్‌గా ఉంటూ నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రూ. వంద కోట్లు ఇవ్వటానికి అవగాహన కుదు ర్చుకుంది. ఈ నిర్ణయం భారత హాకీ పూర్వవైభవానికి ప్రధాన కారణంగా నిలిచింది.

### నాలుగు దశాబ్దాల తర్వాత ఒలింపిక్స్ పతకం...

టోక్యో వేదికగా జరిగిన 2020 ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకం గెలుచుకోవడం ద్వారా 41 సంవత్సరాల నిరీక్షణకు తెరదించింది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో చివరిసారిగా బంగారు పతకం సాధించిన భారత్ ఆ తర్వాత మరో ఒలింపిక్ పతకం కోసం నాలుగు దశాబ్దాలపాటు వేచిచూడాల్సి వచ్చింది. క్రీడాకారుల అంకితభావం, విదేశీ శిక్షకుల శిక్షణకు ఒడిశా ప్రభుత్వ అండదండలు తోడు కావడంతో కేవలం ఐదేళ్ల కాలంలోనే భారత్ ప్రపంచలోని ఐదు అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఆసియాఖండంలోనే అత్యుత్తమ జట్టు ఏదంటే భారత్ అని మాత్రమే చెప్పాలి.

టోక్యో ఒలింపిక్స్ తర్వాత నుంచి ప్రపంచ స్థాయిలో అత్యంత నిలకడగా రాణిస్తున్న జట్లలో భారత్ ఒకటిగా గుర్తింపు సంపాదించుకొంది. చెన్నై వేదికగా ముగిసిన 2023 ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో బంగారు పతకం సాధించింది. అంతటితో ఆగిపో కుండా హాంగ్జు వేదికగా జరిగిన 19వ ఆసియా క్రీడల్లో సైతం భారత్ విశ్వరూపమే ప్రదర్శించింది.

### తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి స్వర్ణం...

ఒలింపిక్స్ హాకీ చరిత్రలో ఎనిమిదిసార్లు బంగారు పతకాలు సాధించిన భారత్.. ఆసియా క్రీడల్లో మాత్రం 2014 వరకూ మూడుసార్లు మాత్రమే విజేతగా నిలువగలిగింది. నాలుగోసారి ఆసియాక్రీడల స్వర్ణం అందుకోవడానికి తొమ్మిది సంవత్సరాలపాటు నిరీక్షించింది.

ఆరుజట్ల పూల్ – ఏ లీగ్ నుంచి నాకౌట్ ఫైనల్ వరకూ భారీ విజయాలు నమోదు చేయగలిగింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియాను 5–3 గోల్స్‌తో ఓడించిన భారత్‌కు ..బంగారు పతకం పోరులో ఎదురేలేకపోయింది. టైటిల్ సమరంలో జపాన్‌ను 5–1తో చిత్తు చేసి బంగారు పతకం అందుకొంది.

### 1966 నుంచి 2023 వరకూ...

1951 నుంచి భారత్ ఆసియా క్రీడల్లో పాల్గొంటూ వచ్చినా... ప్రస్తుత 2023 గేమ్స్ వరకూ నాలుగుసార్లు మాత్రమే చాంపియన్‌గా నిలువ గలిగింది. 1966లో తొలిసారిగా ఆసియాక్రీడల బంగారు పతకం నెగ్గిన భారత్ ఆ తర్వాత 1998, 2014 గేమ్స్‌లో స్వర్ణాలు సాధించింది. 2018 జకార్తా ఆసియాక్రీడల్లో కాంస్య పతకానికి మాత్రమే పరిమితమైన భారత్ కేవలం నాలుగేళ్ల విరామంలోనే తిరిగి బంగారు పతకం అందుకోగలిగింది.

### పారిస్ ఒలింపిక్స్‌కు అలవోకగా....

భారత జట్టు హాంగ్జు ఆసియా క్రీడల విజేతగా నిలవడం ద్వారా వచ్చే ఏడాది పారిస్ వేదికగా జరిగే 2024 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సంపాదించ గలిగింది. ప్రస్తుత అంతర్జాతీయ హాకీలో ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, జర్మనీ లాంటి అగ్రశ్రేణి జట్లకే సవాలు విసురుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏకైకజట్టు భారత్ మాత్రమే. పారిస్ ఒలింపిక్స్‌లో సైతం భారత్ ఇదేజోరు కొనసాగించి బంగారు పతకం సాధించగలిగితే అది మహాద్భుతమే అవుతుంది. పాతాళం నుంచి ఆకాశానికి,11వ ర్యాంక్ నుంచి 3వ ర్యాంక్‌కు ఎదిగిన భారత హాకీ ప్రస్థానాన్ని అపురూప, అసాధారణ విజయగాథ అనటం ఏమాత్రం అతిశయోక్తికాదు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

భారత విమానదళం. దీని కీలక లక్ష్యాలు రెండు. ఒకటి: ఆక్రమణల నుంచి మన గగనతలాన్ని కాపాడటం. మరొకటి: శత్రుసేన మీద వైమానిక సమరం సాగించడం. యుద్ధం అనగానే నాలుగు 'ఆపరేషన్స్' (విజయ్, మేఘదూత్, కాక్టస్, పూమలై) మన ముందు ప్రత్యక్షమవుతాయి. దళంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది. వీరిదంతా వ్యూహాత్మక కార్యాచరణ. ఏవైనా ఉపద్రవాలు సంభవిస్తే, ఎయిర్ లిఫ్ట్ సామర్థ్య వినియోగం కూడ వీరి ప్రధాన బాధ్యత. అనేక సందర్భాల్లో వైద్య విభాగమూ రంగంలోకి దిగుతుంటుంది. అంటే – మెడికల్ సర్వీసెస్. ఈ విధమైన సేవల డైరక్టర్ జనరల్స్‌లో మహిళామణి ఉన్నారు. పేరు: పద్మావతి, స్వస్థలం: తెలుగునాట తిరుపతి.





# సమరసేవలో

పద్మావతి 1944లో నవంబరు నాలుగున పుట్టారు. అటు తర్వాత నివాసం దిల్లీకి మారింది. అక్కడి కళాశాలలోనే చదువుకున్నారు. పాతికేళ్లలోపు వయసులోనే వైమానికి దళంలో చేరారు. అక్కడే సహఅధికారిని పెళ్లాడి పద్మావతీ చందోపాధ్యాయ అయ్యారు. తన విద్యాభ్యాసం నుంచి వివాహ జీవితం వరకు దశలను అవలోకిస్తే...

మధ్య తరగతి కుటుంబంలో జననం. కుటుంబ పరంగా కష్టనష్టాలతోనే సహజీవితం. అంతటి దయనీయతలోనూ చదువంటే మమకారం. వదాన్యుల ఉదారత ఫలితంగా దిల్లీ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువు సాగించారు. పట్టభద్రురాలయ్యాక, పుణెలోని సాయుధసైనిక విభాగంపైన మక్కువ పెంచుకొన్నారు.

సైనిక విభాగానికి సంబంధించిన మెడికల్ కళాశాల అది. అక్కడికి (మహారాష్ట్ర) తెలుగునాట నుంచి వెళ్లి చదవాలంటే, వ్యయ ప్రయాసలు తప్పవు. అందునా, నిరాశ చెందని పద్మావతి వారిని ఏదో విధంగా మెప్పించి ఒప్పించారు.

తల్లి–వ్యాధి బాధితురాలు. ఆస్పత్రికి వెళ్లిరావడం నిత్యకృత్యంగా మారింది. ఆమెను తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడమూ పద్మావతి బాధ్యత. తండ్రి చాలా బాధపడుతుండేవాడు. ఇదంతా అనుభవానికి రావడంతో, ఆమె ఆరోజుల్లోనే నిశ్చయించుకున్నారు తను డాక్టర్ కావాలని !

వ్యాధులూ బాధలూ పెరుగుతున్నాయి. దిక్కుతోచని రీతిలో మధ్యతరగతి కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. అదే గనక కుటుంబంలో ఒక డాక్టరుంటే? ఎంతో ప్రయోజనకరమని ఆమె ఎప్పుడూ అనుకొనేవారు. అదే ఆలోచన కాలక్రమంలో ఆచరణకు దారితీసింది. ముందుగా తను అనుకున్న సంస్థలోనే కాలుపెట్టారు పద్మావతి. ఐదేళ్లపాటు రాత్రింబగళ్లూ ఎంతగానో

# పద్మ 'శ్రీ'




**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**


చదివారు. పరిశోధనలు కొనసాగించారు. అధ్యయనాలు– శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టారు. బయట శిక్షణ తీసుకోవడమనేది ఖర్చుతో కూడిన పని. అందుకే తనకు తానే చదువుకుంటూ, తనకు తానే శిక్షణను ఇచ్చుకొంటూ ముమ్ముందుకు సాగిపోయారు.

అటు తర్వాత ఆమె మకాం బెంగళూరుకు మారిపోయింది. అక్కడే ఎయిర్‌ఫోర్స్ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేపట్టారు. కాలం గడుస్తుండగా, 1971లో అంటే పద్మావతికి 30ఏళ్ల వయసులో యుద్ధ వాతావరణం నెలకొంది. అప్పుడే ఆమెను పంజాబ్‌కు బదిలీచేశారు. పంజాబ్‌లో అది ఎయిర్‌బేస్ స్థావరం. హల్వారా ప్రాంతం అక్కడి వైద్య బృందానికి పద్మావతి నాయకత్వం వహించారు. సమరంలో పాల్గొంటున్న మన సేనకు పలువిధాలుగా వైద్య సహాయ సహకారాలు అందించారు.

ఆమె వృత్తి ప్రయాణం మరిన్ని మలుపులు తిరిగింది. అందులో భాగమా అన్నట్లు, ఏవియేషన్ మెడిసిన్‌లో నిపుణత సాధించారు పద్మావతి. అంతేకాదు, రక్షణ బృందానికి సంబంధించి మరింత శిక్షణనూ అందుకున్నారు. ఈలోగా పదుల సంఖ్యలో పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి, విజయవంతంగా పూర్తిచేశారు. చేతల్లోనే కాకుండా, రాతల్లో కూడా ఆమె నిపుణ. తన అభిప్రాయాలూ అనుభవాల మాలికగా అనేక కథనాలను వెలువరించారు. వైద్యవిధానం... అదీ విమాన సైనిక సిబ్బంది గురించి ఎన్నో మార్పుచేర్పులకు కారకురాలయ్యారు. వాటన్నింటి పర్యవసానంగా ఉన్నతాధికారుల, సహ ఉద్యోగుల ప్రశంసలెన్నింటికో పాత్రురాలయ్యారు.

మన వైమానికి దళంలో ఎయిర్ వైస్ మార్షల్ హోదా కలిగిన తొలి మహిళ పద్మావతి. ఆమె సమయస్ఫూర్తి, అంకితభావం, పరిస్థితులకు దీటుగా పనితీరును పెంపొందించుకునే పద్ధతి ఎందరెందరో ప్రముఖులను ఆకట్టుకున్నాయి. విద్యాధికురాలు, వైద్యకోవిదురాలు, అంతకుమించి సేవా తత్పరురాలు. ఇవన్నీ బందోపాధ్యాయ మదిని పులకింపచేసి, ఆమెతో పరిణయానికి బాటలు వేశాయి. వారిది అన్యోన్య దాంపత్యం.

పద్మావతి బందోపాధ్యాయ దృష్టిలో సమయం, శక్తి చాలా విలువైనవి. వాటిని ఎంత బాగా వినియోగించుకుంటే అంతటి ఉత్తమ ఫలితాలు లభిస్తాయి. ఇందుకు ఉదాహరణ ఆమె జీవితమే! ఆమె – ఏరోస్పేస్ మెడికల్ సొసైటీకి ఎన్నికైన మొదటి వనిత. ఎంతగానో శ్రమించి, అద్భుత ఫలితాలు అందించారు. ప్రత్యేకించి రష్యన్ వైద్య పద్ధతుల మీద అవగాహన పెంచుకున్నారు. సాధికారిత సాధించగలిగారు. వీటి మూలంగానే ఆమె చేతుల్లో 'ఇండో – రష్యా ఫిజియాలజీ' ప్రయోగ అంశం రూపుదిద్దుకొంది. సమగ్ర నివేదిక సమర్పించిన ఘనత సైతం తన ఖాతాలోనే చేరింది. రాష్ట్రపతి చేతులమీదుగా 'పద్మశ్రీ' పురస్కృతి స్వీకరించారు పద్మావతి. శ్రమకోర్చి చదివి, చుట్టుపక్కలవారికి సేవలోనే తరించి, అందులోనూ కళాత్మకతను సృజించిన మేటి మహిళ ఆమె. అందుకనే పద్మశ్రీ బహూకరణం.

పద్మావతి జీవితంలోని మరో విలక్షణత – మూడు నక్షత్రాల ర్యాంకు వరకు పదోన్నతి సాధించడం. ఒకప్పుడు పునీతా అరోరా అటువంటి పదోన్నతి సంపాదించారు. ఆమె తదుపరి... నక్షత్ర పడతి పద్మావతే! దక్షిణ ధ్రువప్రాంతంలో పలు వైజ్ఞానిక శోధనలు నిర్వహించిన విశేషమూ ఆమెదే. డిఫెన్స్ సర్వీసు పరంగా స్టాఫ్‌కాలేజ్ కోర్సులో ప్రతిభ చాటిన విశిష్ట అధికారిణి. ఎంతటి ప్రవీణురాలంటే, న్యూయార్క్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సభ్యురాలయ్యేంత!

అందరూ 'పద్మ' అని పిలుస్తుంటారు. అందులో 'పద్మశ్రీ'ని చేర్చి మెచ్చుకుంటూ ఉంటారు. ఎందరు ఎంతగా ప్రశంసించినా, ఎన్ని విధాలుగా కితాబు లందించినా, చిరునవ్వే ఆమె సమాధానం! 'మీ సర్వీసులో అత్యంత స్మరణీయ కాలం ఏది?' అంటే; 1968–2005 మధ్య అంటుంటారు. అంటే తన పాతికేళ్ల ప్రాయం నుంచి కొన్ని దశాబ్దాల పర్యంతం అన్న మాట.


బందోపాధ్యాయ తనను వీడి శాశ్వతంగా వెళ్లిపోయినా, ఆ జ్ఞాపకాలు ఎన్నటికీ



వీడలేదామెను. ఒకేమాట –ఒకేబాటగా కలసి ఉన్నామని, కలిసే నడిచామని గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఆమె అత్యంత విశిష్ట సేవాపతకం లభించింది. పరమత్వాన్నీ అది జతచేర్చుకుంది. ఎన్ని చేరవచ్చినా, కోరివరించినా నిరాడంబరత్వమే పద్మావతి సహజ స్వభావం.


ఉద్యోగ విరమణ తదుపరి, ఆమె జీవిత శేష భాగమంతా పౌరసేవలోనే! ఎన్నడూ అలసింది లేదు. విసిగి వేసారిందీ లేదు. బాగా చదువుకున్నారు. శ్రద్ధగా ఉద్యోగ బాధ్యత వహించారు. కుటుంబ జీవితంలో మిన్న అనిపించు కున్నారు. మహిళలంతా గర్వించదగిన వ్యక్తిత్వం, మూర్తిమత్వం. ప్రభుత్వ సర్వీసులో ఉన్నా, అక్కడి నుంచి విరమణ జేసినా, సేవాభావాన్నే కనబరుస్తూ వచ్చారామె. సాయుధ దళాల మెప్పును ఎన్నోసార్లు అందుకోగలిగారు. 'మీ జీవిత అనుభవాల రీత్యా, మీరు ఇచ్చే సందేశం ఏమిట'ని విలేకరులు అడిగితే, 'అవకాశం ఇచ్చి చూడండి. ఆకాశంలోనూ దీటుగా నిలుస్తారు మహిళామణులు! సామరస్య సాధన అయినా, సమరంలో ప్రథమమైనా వారితోనే! విజయం వారి వెన్నంటే!' అని జవాబిస్తారు. ★


**పద్మావతి ఏరోస్పేస్ మెడికల్ సొసైటీకి ఎన్నికైన మొదటి వనిత. ఎంతగానో శ్రమించి, అద్భుత ఫలితాలు అందించారు. ప్రత్యేకించి రష్యన్ వైద్య పద్ధతుల మీద అవగాహన పెంచుకున్నారు. సాధికారిత సాధించగలిగారు. వీటి మూలంగానే ఆమె చేతుల్లో 'ఇండో – రష్యా ఫిజియాలజీ' ప్రయోగ అంశం రూపుదిద్దుకొంది. సమగ్ర నివేదిక సమర్పించిన ఘనత సైతం తన ఖాతాలోనే చేరింది. రాష్ట్రపతి చేతులమీదుగా 'పద్మశ్రీ' పురస్కృతి స్వీకరించారు.**

# బాల జాగృతి

## తెలుసుకుందాం — ఉమానంద ఆలయం



అస్సాంలోని బ్రహ్మపుత్ర నది మధ్యలో ఉన్న ఉమానంద ద్వీపం (నెమలి ద్వీపం)లో గల కచారిఘాట్ సమీపంలో ఈ శివాలయం కొలువుదీరింది. శివుడు భయానంద రూపంలో ఇక్కడ నివసించాడని చెబుతారు. ఈ ప్రాంతం ప్రపంచంలోనే అతి చిన్న జనావాస నదీతీర ద్వీపంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని 1694లో గదాధర్ సింఘ రాజు కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. అయితే 1897లో సంభవించిన భూకంపం వల్ల ఇది దెబ్బతింది. అనంతరం ఒక వ్యాపారి దీనిని పునర్నిర్మించారు. అక్కడ సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

## కథ — సత్యనాథుడి సంతృప్తి

మల్లపురాన్ని పాలించే సత్యనాథుడికి నిత్యం ఖజానా నింపడం పైనే ధ్యాస ఉండేది. అన్ని రాజ్యాల్లో కంటే తన ఖజానా నిండుగా ఉండాలనీ, అలా ఉంటే పాలన సులభమవుతుందనీ అనుకునేవాడు సత్యనాథుడు. దానికి తగ్గట్లే పరిపాలన మీద కంటే పన్నులు, ఇతర ఆదాయ మార్గాలపైనే దృష్టి పెట్టేవాడు. అయినా నిత్యం నిధులు సరిపోవడం లేదని అసంతృప్తితో ఉండేవాడు.

ఒక రోజు "ఓ రాజా! ఈ ఏడు పాత్రల్లో ఉన్న వజ్రవైఢూర్యాలతో నీ ఖజానా నిండిపోతుంది. హాయిగా పాలించవచ్చు. కాని దీనిలో నీ ప్రయత్నం లేదనే అసంతృప్తి కలుగ కుండా ఉండాలని ఒక పాత్రలో సగం మాత్రమే ఆభరణాలు ఉన్నాయి. మిగిలినసగం నువ్వు నింపి ఆ మొత్తాన్ని ఖజానాలో వేస్తే అది ఎన్ని తరాలకైనా సరిపోతుంది" అని ఒక దేవత రాజుకు కలలో ప్రత్యక్షమై చెప్పింది.

రాజు వెంటనే మేల్కొని చూశాడు. నిజంగానే అక్కడ ఆరు పాత్రల్లో నిండుగా, మరో పాత్రలో సగానికి కళ్లు మిరుమిట్లు



## పద్యము

మిరెము గింజ చూడ మీద నల్లగనుండు
కొఱికి చూడ లోనఁజుఱు మనును
సజ్జనులగువారి సార మిట్లుండురా
విశ్వదాభిరామ! వినుర వేమ!

**భావం :** మిరియము గింజ పైకి చూచినచో నల్లగా యున్ననూ, కొరికి చూచినచో కారంగా మంటగా ఉండును. ఆ విధంగానే మంచివాడు పైకి చూచుటకు అలంకారములు లేకపోయిననూ, లోపల హృదయం నందు మేధాసంపత్తి నిండియుండును అని భావం.

## శ్లోకము

'సర్వశూన్యా దరిద్రతా'

'అవిద్యా జీవనం శూన్యం
దిక్శూన్యా చేదబాంధవా
పుత్రహీనం గృహం శూన్యం
సర్వశూన్యా దరిద్రతా'

**భావం :** విద్యలేని జీవితం శూన్యం. బంధువులు లేకపోతే దిక్కు ఉండదు. పుత్రులు లేని ఇల్లు శూన్యం. దారిద్ర్యంతో సర్వం శూన్యం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కలిమి | తొందర |
| ప్రకృతి | సూక్ష్మ |
| దూరం | ద్వేషం |
| నెమ్మది | లేమి |
| ప్రేమ | వికృతి |
| స్థూల | దగ్గర |

జవాబులు : కలిమి–లేమి, ప్రకృతి–వికృతి
దూరం–దగ్గర, నెమ్మది–తొందర, ప్రేమ–ద్వేషం
స్థూల–సూక్ష్మ

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### శంకర్‌లాల్ ఘెలాభాయ్ బ్యాంకర్



ప్రముఖ స్వాంతంత్ర్య సమరయోధుడు. మహాత్మాగాంధీ సహచరులలో ఒకరు. 1889లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జన్మించారు. అహ్మదాబాద్‌లో టెక్స్‌టైల్ మిల్లు కార్మికుల సమ్మె, 1918 ఖేడా సత్యాగ్రహం, రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో పాల్గొన్నారు. ఖాదీ, చర్ఖాలను ప్రోత్సహించిన భారతీయ చర్ఖా సంఘానికి కార్యదర్శిగా కూడా ఈయన సేవలందించారు. 1985లో తుదిశ్వాస విడిచారు.



గొలిపే ఆభరణాలు ఉన్నాయి.

రాజు వెంటనే తన ఒంటిమీద ఉన్న ఆభరణాల్ని తీసి ఏడో పాత్రలో వేశాడు. కాని అది నిండలేదు. రాణి నగలు తెప్పించి అందులో వేసి చూశాడు. అయినా ప్రయోజనం లేక పోయింది. ఇలా ఖజానాలో ఉన్న ఆభరణాల్ని ఒక్కొక్కటి తెచ్చి పాత్రలో వేయడం మొదలు పెట్టాడు. ఎన్ని వేసినా ఆ పాత్ర నిండలేదు. ఆస్థాన మంత్రికి విషయం అర్థమై రాజుగారి దగ్గరగా వచ్చి "రాజా! ఆ పాత్ర ఉంది చూశారా? అది మన మనస్సు లాంటిది. దానికి ఎప్పటికీ సంతృప్తి ఉండదు. మీరు ఆ విషయం అర్థం చేసుకుని ఈ వృథా ప్రయత్నం ఆపండి" అని చెప్పాడు. తనలో మార్పు తీసుకురావడానికే తన ఆరాధ్యదైవం ఇలా చేసి ఉంటుందని భావించిన రాజు అప్పట్నుంచి ఖజానా మీద కంటే పాలనపైనే ఎక్కువ దృష్టి పెట్టి జనరంజకంగా పాలన సాగించాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
2. లిబియా దేశ రాజధాని ఏది?
3. నవ్వించే వాయువు ఏది?

జవాబులు : 1. ఏప్రిల్ 7, 2. ట్రిపోలి 3. నైట్రస్ ఆక్సైడ్

## మెదడుకు మేత

నూరు పళ్లు,
ఒకటే పెదవి..
ఏమిటది?

జవాబు : దానిమ్మపండు

## మంచిమాట

మనిషి తన చేతలతో మాత్రమే గొప్పవాడు అవుతాడు, అంతేకాని జన్మత: కాదు..




# వారఫలాలు 30 అక్టోబర్ - 05 నవంబర్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

వీరికి అన్ని విధాలా అనుకూల సమయం. కాంట్రాక్టర్లకు మరింత అనుకూలత. అనుకున్న ఆదాయానికి మించి లభించే వీలుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల నుంచి కీలక సమాచారం రాగలదు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారస్తులకు విస్తరణ యత్నాలు సఫలం. రాజకీయ వేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 4,5 ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు సయానుసారం పూర్తి చేస్తారు. ఆత్మీయులు, శ్రేయోభిలాషులు మీకు చేదోడుగా నిలుస్తారు. చాకచక్యంగా కొన్ని వ్యవహారాలు చక్కదిద్దుతారు. ప్రముఖులతో పరిచయాలు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు సమస్యల నుంచి గట్టెక్కుతారు. ఉద్యోగులకు ప్రమోషన్లు లభిస్తాయి. 30,31 తేదీలలో ధన వ్యయం. బంధువులతో తగాదాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

మీ అంచనాలు కొన్ని నిజం చేసుకుంటారు. పరపతి పెరిగి మరింత ఉత్సాహంగా గడుపుతారు.ఆస్తులు వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగుల నిరీక్షణ ఫలిస్తుంది. ఉద్యోగులకు ఉన్నత హోదాలు రాగల అవకాశం. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు విదేశీ పర్యటనలు. 3,4 తేదీల్లో అనుకోని ప్రయాణాలు.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ కష్టం ఫలించే సమయం. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఆలోచనలు అమలు చేస్తారు. తీర్థయాత్రలు సాగిస్తారు. సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. ఎంతోకాలంగా వేధిస్తున్న ఆరోగ్యసమస్యలు తీరి ఉపశమనం పొందుతారు. ఉద్యోగులకు కొత్త హోదాలు లభిస్తాయి. పారిశ్రామిక,రాజకీయవేత్తలు, పరిశోధకులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 1,2 తేదీలలో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. శివాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఒక కోర్టు వ్యవహారం పరిష్కారదశకు చేరుకుంటుంది. ఆశించిన ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. వివాహాది శుభకార్యాల నిర్వహణపై దృష్టి సారిస్తారు. ఉద్యోగప్రయత్నాలు రాజకీయ, పారిశ్రామికవేత్తలు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 30,31 తేదీలలో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ప్రారంభంలో కొన్ని సమస్యలు చికాకు పరుస్తాయి. అనుకున్న కార్యక్రమాలను కొంత ఆలస్యంగా పూర్తి చేస్తారు. ఆస్తుల వ్యవహారాలు పరిష్కారమవుతాయి. వ్యాపారులు లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 31,1 తేదీలలో ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్యం కొంత ఇబ్బంది. వేంకటేశ్వరస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలు అప్రయత్నంగా పూర్తి కాగలవు. ఆత్మీయులు చేయూత. ఆస్తుల ఒప్పందాలలో ఆటంకాలు తొలగుతాయి. విద్యార్థులు, నిరుద్యోగులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు అవకాశం. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, పరిశోధకులకు ప్రోత్సాహం. 2,3 తేదీల్లో ధనవ్యయం.నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. అనుకున్న ఆదాయం సమకూరుతుంది. కొన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు లాభాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కుతాయి. రాజకీయ వేత్తలు, రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు. 4,5 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. గణేశాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పట్టిన పట్టువీడకుండా పనులు పూర్తి చేస్తారు. సమాజంలో ప్రత్యేకత నిరూపించుకుంటారు. విలువైన వస్తువులు కొంటారు. భూములు, వాహనాలు కొనుగోలు. ఇంటర్వ్యూలు అందుతాయి. వ్యాపారస్తులకు విస్తరణ కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. రాజకీయవేత్తలు, రచయితలు, క్రీడాకారులకు అరుదైన అవకాశాలు. 30,31 తేదీల్లో దూర ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

పట్టుదల, నేర్పుతో ఎంతటి కార్యాన్నైనా పూర్తి చేస్తారు. స్థిరాస్తి విషయంలో ఒడుదొడుకులు తొలగి లబ్ధి పొందుతారు. వ్యాపారులు ఊహించని లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పనిభారం పెరిగినా సమర్థత చాటు కుంటారు. రాజకీయవేత్తలు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 31,1 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. ఆదిత్య హృదయం పఠించండి.


**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కార్యదీక్షాపరులై అనుకున్నది సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. స్వల్ప శారీరక రుగ్మతలు తప్పకపోవచ్చు. విద్యావకాశాలు దక్కే సూచనలు. ఉద్యోగస్తులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలు పురస్కారాలు పొందుతారు. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆదాయానికి మించి ఖర్చులు ఎదురవుతాయి. అనుకున్న కార్యక్రమాలలో కొంత జాప్యం. కుటుంబ సభ్యులతో అకారణంగా విభేదాలు ఏర్పడవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. వ్యాపారస్తులకు స్వల్ప లాభాలు అందుతాయి. ఉద్యోగస్తుల ప్రమోషన్లలో ప్రతిష్టంభన. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు విదేశీ పర్యటనలు వాయిదా. 2,3 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. ఆంజనేయ దండకం పఠించండి. ★

# పదరసం-439



పదరసం – 439

పేరు : ...........................................................................................

చిరునామా:.......................................................................................

...................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 నవంబర్ 13 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## ఆధారాలు

**అడ్డం**


1. శ్రీకృష్ణదేవరాయలు రచించినది (6)
6. చెదరిపోయిన వియోగ దుఃఖం (5)
8. తోచిన ఆలోచన, విధానం (3)
9. కువలయాశ్వుని భార్య (4)
10. పత్రికా భాషలో “చూడటం కోసం” (5)
12. ఇది వచ్చి మద్దెలతో మొరపెట్టుకుందని సామెత (2)
13. అస్థిపంజరం అసంపూర్తిగా ఉంది (2)
16. తిరగబడ్డ ఒక పెద్ద జబ్బు (2)
17. సమ్మక్కసారలమ్మ జాతర జరిగే ప్రాంతం (3)
18. తప్పు మన్నించమని వేడుకోలు (4)
20. చంద్రుడు (2)
22. సత్యభామ వలన భూలోకానికి వచ్చిన పూలచెట్టు (4)
24. ఇది లేకుంటే రుచి తెలీదు, మాట్లాడలేము కూడా (4)
25. మూడడుగులు కోరిన వామనుడు --- అయ్యాడు (5)

**నిలువు**

1. నఖశిఖ పర్యంతం లాంటిది (6)
2. హిందువులకు అత్యంత పవిత్రమైన సరస్సు (7)
3. చిరునవ్వు (4)
4. తెలివి (2)
5. ఆవు అరుపు (2)
7. ఈ ప్రముఖ ఆళ్వారు శ్రీరంగని పరమభక్తుడు (6)
11. పశువుల గుంపుపైకొచ్చింది (2)
14. శ్రీశైలం అడవులలో ఇష్ట --- అమ్మవారి గుడి ఉంది (4)
15. ఎవరైనా పైకి రావాలంటే కావలసినది పైకొచ్చింది (5)
19. పౌరుషానికి పేరున్న ఒక తెలుగు ప్రాంతం (4)
21. కర్ణాటకలోని ఒక ప్రముఖ శైవక్షేత్రం (3)
22. జడకు, నదికి ఉండేది (2)
23. తీగ (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్–27

## పదరసం - 435 సమాధానాలు



**విజేతలు:** కె.ప్రశాంత్, డి.మాధవి ప్రవీణ్, నే. శ్యామ్, కొండేపూడి శంకరరావు, బుషపాక భాగ్యలక్ష్మి, ఉడాలి భాస్కరయ్య, సూర్యప్రభ, పి.సీతామహాలక్ష్మి, జనమంచి ముకుందశర్మ, టి.సుబ్రహ్మణ్యం, వి.పద్మారంగనాథ్, ఆర్.అంజనీదేవి, ఎన్.ఫణిమంజరి, ఆర్.వి.సి.హెచ్.నాగేశ్వరరావు, దాసం లక్ష్మణరావు, ఝాన్సీలక్ష్మి, శ్రీరాముల విజయకుమార్, పొన్నపల్లి సుజాత, కె.అల్లీరాణి, యేమిరెడ్డి సనీత, వై.రాధాకిషన్, వనమాల రామలింగాచారి, చెరుకు మహేశ్వర శర్మ, కె.సీతారావమ్మ, కె.స్వప్న, కె.వి.ఎస్.ఎన్.గణేశ్ కుమార్, ఎ.ప్రదీప్‌కుమార్, బి.ఇందుశేఖర్, కె.సత్యనారాయణ, రామచంద్రమూర్తి, డా.ధన్వంతరి, ఆమంచి స్వప్న, అప్పాశేషశాస్త్రి, దేవలక్ష్మి, నాయని రాములు

**ఈ వారం విజేత : రాయవరపు శేషు, పిఠాపురం**

సి ని మా

**అరుణ**

నందమూరి బాలకృష్ణకు హ్యాట్రిక్ లభించి మూడు దశాబ్దాలు అయిపోయింది. ట్రేడ్ వర్గాలు చెబుతున్న ప్రకారం ఆయనకు ఆఖరి హ్యాట్రిక్ 1993-94లో లభించింది. ఒకేరోజు విడుదలైన 'నిప్పురవ్వ, బంగారుబుల్లోడు' సినిమాలు చక్కని విజయాన్ని అందుకోగా, ఆ తర్వాత యేడాది వచ్చిన 'భైరవ ద్వీపం' ఆయన సినీజీవిత చరిత్రలోనే అపురూప చిత్రంగా నిలిచిపోయింది. మళ్లీ ఇంతకాలానికి బాలకృష్ణ హ్యాట్రిక్ అందుకోవడం విశేషమే. గత యేడాది విడుదలైన 'అఖండ' తర్వాత ఈ సంవత్సరం సంక్రాంతికి వచ్చిన 'వీరసింహారెడ్డి' దసరాకు రిలీజ్ అయిన 'భగవంత్ కేసరి' సక్సెస్‌తో బాలకృష్ణ వరుసగా మూడు విజయాలను అందుకున్నట్టు అయ్యింది.



# బాలకృష్ణకు హ్యాట్రిక్ అందించిన భగవంత్ కేసరి

బాలకృష్ణ, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని ఎంతోకాలంగా వినిపిస్తోంది. రకరకాల కథలను విన్న బాలకృష్ణ... చివరకు 'భగవంత్ కేసరి'కి పచ్చజెండా ఊపారు. ఓ రకంగా ఈ సినిమా షూటింగ్ చకచకా సాగిందనే అనుకోవాలి. సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మించిన ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు. కాజల్ నాయికగా నటించగా, శ్రీలీల కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా టీజర్, ట్రైలర్ మూవీ మీద భారీ అంచనాలు పెరిగేలా చేశాయి. ఈసారి దసరా బరిలో నిలిచిన నాలుగు సినిమాలలో 'భగవంత్ కేసరి' అగ్రస్థానంలో నిలిచింది.

నేలకొండ అటవీ ప్రాంతంలో సి.ఐ.గా పనిచేస్తుంటాడు భగవంత్ కేసరి (బాలకృష్ణ). అడవి బిడ్డల కోసం తన ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉంటాడు. అలాంటి సమయంలో ఓ పిల్లాడిని కాపాడటానికి అడవి దొంగలను ఊచకోత కోస్తాడు. దాంతో వారు తప్పుడు కేసులు బనాయించి భగవంత్ కేసరిని జైలుకు పంపుతారు. అక్కడ ఉండగానే జైలర్ శ్రీకాంత్ (శరత్ కుమార్) దృష్టిలో పడతాడు. భగవంత్ కేసరి గతం గురించి తెలుసుకున్న శ్రీకాంత్ అతనికి సాయం చేస్తాడు. ఆ కృతజ్ఞతతో శ్రీకాంత్ చనిపోయే ముందు అతని కూతురు విజ్జీ (శ్రీలీల)ను పెంచి పెద్ద చేస్తానని, ఆర్మీకి పంపిస్తానని మాట ఇస్తాడు. అందుకోసం భగవంత్ కేసరి ఎలా కృషి చేశాడు? విజ్జీని ఆర్మీకి పంపే క్రమంలో సైక్రియాటిస్ట్ డాక్టర్ కాత్యాయిని (కాజల్ అగర్వాల్) సాయం ఎలా తీసుకున్నాడు? ఊహించని విధంగా విజ్జీ జీవితంలోకి ప్రవేశించి ఆమెను ఇబ్బంది పెట్టిన పారిశ్రామికవేత్త రాహుల్ సంఘ్వీ (అర్జున్ రామ్ పాల్)కి ఎలాంటి గుణపాఠం చెప్పాడు? అనేది మిగతా కథ.


బాలకృష్ణ తన వయసుకు తగ్గ పాత్ర చేయడం విశేషం. ఇప్పటి వరకూ బాలకృష్ణను తెర మీద బోయపాటి శ్రీను మాత్రమే చక్కగా చూపించగలడనే పేరుంది. ఇప్పుడు అనిల్ రావిపూడి సైతం ఆ జాబితాలోకి చేరాడు. సినిమా ప్రారంభం నుండి చివరి వరకూ బాలకృష్ణ ఒకేలా కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక పోలీస్ ఆఫీసర్‌గా బాలకృష్ణ వయసును కొంత తగ్గించే ప్రయత్నం చేశారు. మహిళాసాధికారతకు ఈ సినిమాలో దర్శకుడు పెద్ద పీట వేశారు. బహుశా ఆ కారణంగానే కావచ్చు బాలకృష్ణ, కాజల్ మధ్య వెర్రిమొర్రి పాటలను పెట్టలేదు. వారిద్దరి మధ్య కొన్ని ప్రేమ సన్నివేశాలు పెట్టారు కానీ అవి కూడా ఏమంతగా గొప్పగా లేవు. కాకపోతే... బాలకృష్ణ, శ్రీలీల మధ్య సెంటిమెంట్ సీన్స్‌ను అనిల్ రావిపూడి బాగా తీశాడు. దాంతో సినిమా నిలబడింది.

ఇవాళ ఆడపిల్లలను పెంచడం తల్లిదండ్రులకు పెద్ద టాస్క్‌గా మారింది. బంధుమిత్రులు, సన్నిహితులే చిన్నారులతో అనైతికంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు రోజూ వార్తలలో చూస్తున్నాం. ఆ అంశాన్ని అనిల్ రావిపూడి 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' అంటూ బాలకృష్ణతో చెప్పించడం ఇప్పించడం బాగుంది. ఇదే సంఘటనను కొందరు దర్శకులు అత్యంత జుగుప్సతో చూపుతుంటే...అనిల్ రావిపూడి మాత్రం సున్నితంగా డీల్ చేశారు. అందుకు అతన్ని అభినందించాలి. నిజానికి 'భగవంత్ కేసరి' కథలో కొత్తదనం ఏమీ లేదు. రొటీన్ డ్రామానే. అయితే... కథనం ఆసక్తికరంగా ఉంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల పనితనం కారణంగా ఇది ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా నిలిచింది. బాలకృష్ణ అభిమానులను సంతృప్తి పర్చడానికి పోరాట సన్నివేశాలను కాస్తంత అతిగానే చిత్రీకరించారు. దానిని భరించకతప్పదు.


నటీనటుల విషయానికి వస్తే... బాలకృష్ణ, కాజల్, శ్రీలీల తమ పాత్రలను సమర్థవంతంగా పోషించారు. కాజల్ తల్లిగా నటించిన డబ్బింగ్ జానకి చేతిలో మందు గ్లాస్ పెట్టి అనిల్ రావిపూడి తన మార్క్ చూపించే ప్రయత్నం చేశాడు. ఇక ఇతర ప్రధాన పాత్రలను అర్జున్ రామ్ పాల్, 'ఆడుకాలమ్' నరేన్, శరత్ కుమార్, రవిశంకర్, జయచిత్ర, 'శుభలేఖ' సుధాకర్, బ్రహ్మాజీ, జాన్ విజయ్, రాజ్ తిరందాసు, సంజయ్ స్వరూప్, భరత్ రెడ్డి తదితరులు పోషించారు. ఇందులో రెండు, మూడు నేపథ్య గీతాలు ఉన్నాయి తప్పితే డ్యుయేట్స్ లేవు. 'ఉయ్యాలో ఉయ్యాల...' పాటకు అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం బాగుంది. తమన్ నేపథ్య సంగీతం ఈ సినిమాను నిలబెట్టింది. అలానే రాం ప్రసాద్ సినిమాటోగ్రఫీ చక్కగా ఉంది. దసరా కానుకగా వచ్చిన ఇతర సినిమాలతో పోల్చితే 'భగవంత్ కేసరి' కాస్తంత విషయం ఉన్న సినిమా. పైగా ఫ్యామిలీతో వెళ్లి చూడదగ్గ చిత్రం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-



వెల : ₹.390/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.360/-



వెల : ₹.100/-



వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.799/-




వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 54

# ఇది 'జాగృతి' అమృతోత్సవం

పేజీలు : 250
వెల : 125/-


- ఢిల్లీలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఎలా ఏర్పడింది?
- అటల్ బిహారీ వాజపేయి హయాంలో దేశం ఏం సాధించింది?
- పోఖ్రాన్ పరీక్షల చరిత్ర ఏమిటి?
- వాజపేయి ప్రభుత్వం ఎలా కూలింది?
- మన్మోహన్‌సింగ్, యూపీఏ ప్రభుత్వ చరిత్ర ఏమిటి?
- ముస్లిం మతోన్మాదుల పేలుళ్లతో కంపించిన భారత్
- గోధ్రా అల్లర్ల ఫలితం ఏమిటి?
- నరేంద్ర దామోదర్ దాస్ మోదీ అనే నేను....!

ఆకాశదీపాలు

- పూజనీయులు ఆర్ఎస్ఎస్ సరసంఘచాలక్‌లు
- నాటి జాతీయ పరిణామాల గురించి జాగృతి సంపాదకీయాలు ఏమన్నాయి?
- గోరక్షణోద్యమం ఎక్కడిదాకా వచ్చింది?
- జాగృతి దృష్టిలో తెలుగు సినిమా

ఇంకా

- దీపావళి కథల పోటీ ఫలితాలు
- ప్రథమ విజేత రాసిన కథ
- కార్టూన్లు.



మరచిపోవద్దు మీ చేతులలోకి రాబోతున్న
ఈ దీపావళి సంచిక జాగృతి నమోదు చేసిన
75 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్ర

**త్వరపడండి!**

గమనిక : ఈ సంచిక చందాదారులకు విధిగా పంపిస్తాము.

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 31లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

- ➡ 10 నుంచి 25 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- ➡ 26 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- ➡ 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- ✿ పార్శిల్ ఖర్చులు అదనం